ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ప్రకాశం జిల్లా వార్తలు
మంగళవారం 30, ఏప్రిల్ 2024



ఎర్రగుడిపాడులోని వైసీపీ నేత అవుల షెడ్‌లో దొరికిన మద్యం బాటిళ్లు

దర్శి నియోజకవర్గంలోని ముండ్లమూరు మండలంలో వైసీపీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నామినేషన్‌కు ముందు రోజు భారీ మద్యం డంప్ దొరికింది. ఏకంగా వైసీపీ నాయకుల ఇళ్లలో ప్రభుత్వ దుకాణం నుంచి తరలించిన మద్యాన్ని నిల్వ చేశారు. 240 కేసులను ఎస్‌ఈబీ అధికారులు సీజ్ చేశారు. దీనిపై ఆయా దుకాణాల సిబ్బందిపై కేసులు నమోదు చేశారు.

ఒంగోలులో అధికార పార్టీ వారికి ఐదారు బార్ల నుంచి మద్యం సరఫరా చేస్తున్నారని ఎస్‌ఈబీ అధికారులకు సమాచారం అందింది. నోటిఫికేషన్‌కు ముందే రూ.6కోట్లకు పైగా బార్ల యజమానులకు అడ్వాన్స్ ఇచ్చినట్లు సమాచారం. దీంతో నిత్యం పెట్టెల కొద్దీ మద్యం మధ్యాహ్నం సమయంలో డివిజన్లకు, గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. తీరప్రాంతంలో ఒకచోట, నగరంలోని శివారులో మరోచోట భారీ డంప్‌లు పెట్టినట్లు ఎస్‌ఈబీకి సమాచారం అందింది.

మంత్రి నాగార్జున పోటీ చేస్తున్న సంతనూతలపాడు నియోజకవర్గంలో గోవా మద్యం ఏరులై పారుతోంది. ఎర్రగుడిపాడులోని ఓ వైసీపీ నాయకుడి అవుల ఫాం షెడ్‌లో 1000కి పైగా బాటిళ్లు దొరకడమే ఇందుకు నిదర్శనం. ఇంకా నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో ఇలాంటి నిల్వలు ఉండే అవకాశం ఉందని అధికార యంత్రాంగం భావిస్తోంది.

జిల్లాలో అధికారపార్టీ నేతలు జనాన్ని మందులో ముంచుతున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలకు రేషన్ విధించడంతో.. ఆ ముసుగులో సామాన్యులకు, మిగతా పార్టీల వారికి మద్యం దొరకకుండా చేస్తున్నారు. తమ అడ్డాలకు మాత్రం దొడ్డిదారిన కేసులకొద్దీ తరలించేస్తున్నారు. మరోవైపు బార్లలో కూడా తమకే మద్యం ఇవ్వాలంటూ బెదిరించి తీసుకెళ్తున్నారు. మాట వినకుంటే సీజ్ చేయిస్తున్నారు. అదీ చాలదన్నట్లు కొందరు ఏకంగా గోవా, కర్ణాటక రాష్ట్రాల నుంచి అక్రమ మార్గాలలో యథేచ్ఛగా సరుకును తీసుకొచ్చి వైసీపీ నేతల ఇళ్లు, షెడ్‌లలో దాచిపెడుతున్నారు. వైసీపీ వారి కారణంగా మద్యం దొరక్క మందుబాబులు అల్లాడుతున్నారు.

# మద్యం మాయం


ముండ్లమూరులో పట్టుబడిన మద్యం కేసులు (ఫైల్)

- రేషన్ మాటున పక్కదారి
- అధికారపార్టీకి మాత్రమే సరఫరా
- ప్రభుత్వ దుకాణాలు, బార్ల నుంచి తరలింపు
- 50 మందికిపైగా సర్కారు వైన్‌షాపుల సిబ్బందిపై కేసులు
- దర్శిలో వైసీపీకి చెందిన వారి వద్ద 240 పెట్టెల మందు స్వాధీనం
- మంత్రి ఇలాకాలో గోవా సరుకు
- తాజాగా ఎర్రగుడిపాడులో డంప్
- చోద్యంచూస్తున్న అధికార యంత్రాంగం

ఒంగోలు (క్రైం), ఏప్రిల్ 29 : ఎన్నికల్లో అధికార పార్టీ మద్యాన్ని ఏరులై పారిస్తోంది. మంత్రి మేరుగ నాగార్జున పోటీ చేస్తున్న సంతనూతలపాడు నియోజకవర్గంలోని చీమకుర్తి మండలం ఎర్రగుడిపాడులో గోవా మద్యం 1001 బాటిళ్లు దొరకడం అందుకు ఉదాహరణ. పైగా ప్రభుత్వ దుకాణాలు, బార్ల నుంచి తమకు ఉన్న అధికార బలంతో మద్యం బాటిళ్లను కేసుల కొద్దీ తరలించుకుపోతున్నారు. అదీ చాలదన్నట్లు అక్రమ మార్గాల్లో గోవా, కర్ణాటక మద్యాన్ని గ్రామాలకు చేరవేస్తున్నారు. డంప్‌లు పెడుతున్నారు. జిల్లా సరిహద్దులలో 18 చెక్‌పోస్టులు ఉన్నాయి. అయినా నేరుగా గ్రామాలలోకి గోవా మద్యం చేరవేయడం అధికారపక్షం బరితెగింపు అని చెప్పవచ్చు. ఎన్నికల కమిషన్, అధికార యంత్రాంగం చెబుతున్నట్లు కట్టుదిట్టంగా ఏర్పాటు చేసిన పదులకొద్దీ చెక్‌పోస్టులను దాటి మద్యం బాటిళ్లను జిల్లాలోకి తెచ్చారంటే ఆశ్చర్యం వేస్తోంది. దీనిని బట్టి ఆ చెక్‌పోస్టులు ఏస్థాయిలో పనిచేస్తున్నాయో అర్థమవుతోంది. కేవలం సామాన్యుల వాహనాలను ఆపి అణువణువూ తనిఖీ చేయడం.. కొద్దిపాటి డబ్బులు, ఇతర విలువైన వస్తువులు ఉన్నా స్వాధీనం చేసుకోవడం లాంటివి చేస్తున్నారు తప్ప అధికారపార్టీ వారి వాహనాలైతే చూసీచూడనట్లు వదిలేస్తున్నట్లు పరిస్థితి తయారైందని తెలుస్తోంది.

### మంత్రి ఇలాకాలో గోవా మద్యం

మంత్రి మేరుగ నాగార్జున పోటీ చేస్తున్న సంతనూతలపాడు నియోజకవర్గంలోని చీమకుర్తి మండలం ఎర్రగుడిపాడులో వైసీపీ మండల నాయకులు గోవా మద్యం గ్రామాలకు సరఫరా చేస్తుండగా ఎస్‌ఈబీ అధికారులు దాడిచేసి పట్టుకున్నారు. 1001 బాటిళ్ల గోనెసంచులలో పెట్టి ఆయా గ్రామాలకు సరఫరా చేసేందుకు సిద్ధమయ్యారు. జిల్లాకు గతంలో గోవా, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి కంటైనర్ల ద్వారా మద్యం దిగుమతి అయిన సందర్భాలు ఉన్నాయి. కాగా ఇతర రాష్ట్రాల మద్యం డంప్ దొరకడం కలకలం రేకెత్తించింది. అదీ 25 పెట్టెల మద్యం కావడం గమనార్హం. పైగా చీమకుర్తి మండల వైసీపీ నేతలు ఇందులో కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై లోతుగా విచారణ చేస్తే ఆ నియోజకవర్గంలో మరిన్ని అక్రమ నిల్వలు బయటపడే అవకాశం ఉంది. గోవా మద్యం ఇక్కడకు ఎలా వచ్చింది అనే అంశంపై దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

### షాపుల్లో రేషన్‌తో భారీ డిమాండ్

ప్రస్తుతం ఎన్నికల నిబంధనల ప్రకారం మద్యంకు రేషన్ పెట్టడంతో భారీ డిమాండ్ ఏర్పడింది. దీంతో సామాన్య మందుబాబులకు, ఇతర పార్టీల వారికి మద్యం దొరకడం లేదు. బార్లకు వెళ్లి అధిక ధరకు కొనలేని పరిస్థితి. దుకాణాల నుంచి బెల్ట్‌షాపులు, వైసీపీ నాయకులకు మద్యం సరఫరా చేస్తున్న 50మందికిపైగా సిబ్బందిపై కేసులు నమోదు చేయడం చూస్తే ప్రభుత్వ దుకాణాల నుంచి వైసీపీకి మద్యం సరఫరా బాగా జరుగుతుందని అర్థమవుతుంది. ఒంగోలు నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాలకు మద్యం తరలించేందుకు కొత్తపట్నం మండలంలోని కొన్ని గ్రామాల్లో భారీగా నిల్వలు ఉంచినట్లు పోలీసు అధికారులకు సమాచారం వచ్చింది. దీనిపై విచారణ చేపట్టిన అధికారులకు కీలకమైన ఆధారాలు లభించకపోవడంతో వెనుదిరిగారు. ఇలా ఎన్నికలను మద్యంతో ముంచెత్తడానికి ప్రయత్నం చేస్తున్నారు అధికారపక్షం అభ్యర్థులు.

### స్టాక్ పాయింట్ నుంచే అధికార పార్టీకి..

పదిరోజుల క్రితం దర్శి నియోజకవర్గం ముండ్లమూరు మండలంలో మూడు దుకాణాల నుంచి తరలించి మద్యం అక్రమంగా నిల్వ ఉంచారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు, ఎస్‌ఈబీ అధికారులు దాడి చేసి 240 పెట్టెలు అంటే సుమారు రూ.20లక్షలు పైచిలుకు విలువైన సరుకును స్వాధీనం చేసుకున్నారు. అందుకు సంబంధించి వైసీపీ నాయకులు, మద్యం దుకాణాలలో పనిచేసే సిబ్బందిపై కేసులు నమోదు చేశారు. ఈ మద్యాన్ని స్టాక్ పాయింటు నుంచి దుకాణం కోసమని తెచ్చి నేరుగా వైసీపీ నాయకుల ఇళ్లకు తరలించినట్లు చెబుతున్నారు. ఇలా జిల్లావ్యాప్తంగా మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. అందుకు కారణం ప్రభుత్వ మద్యం దుకాణాలలో పనిచేసే సిబ్బంది అంతా వైసీపీ సానుభూతి పరులే. వైసీపీ నాయకులు స్వయంగా నియమించిన వారు. అలాగే ఎక్సైజ్ శాఖ అధికారులు కూడా అధికారపార్టీ సేవలో మునిగితేలుతున్నారు. వారికి ఎంత స్టాక్ కావాలంటే అంత పంపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సాధారణ దుకాణాల్లో స్టాక్ అమ్ముడుపోయినట్లు చూపి ఆ సరుకును దొడ్డిదారిన వైసీపీ నేతల అడ్డాలకు చేర్చుతున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తరువాత ఇలా సరుకును తరలిస్తూ సుమారు 50మంది సిబ్బంది ఎస్‌ఈబీ అధికారులకు దొరికిపోవడంతో కేసులు నమోదు చేశారు.

### బార్ల నుంచి సరఫరా

నిత్యం బార్ల నుంచి మద్యం అధికారపార్టీ వారికి సరఫరా చేయడం చర్చనీయాంశమైంది. దర్శిలో ఇప్పటికే ఒక బార్‌ను అధికారులు సీజ్ చేసిన విషయం విదితమే. ఒంగోలులో కూడా ఒక్కో బారు నుంచి రోజుకు పది పెట్టెల మద్యం అధికారపార్టీ వారికి సరఫరా చేస్తున్నట్లు సమాచారం. అందుకు సంబంధించి అడ్వాన్స్‌గా కోట్లు చెల్లించారని అంటున్నారు. బార్ల నుంచి ఒక్క బాటిల్ మద్యం కూడా బయటకు విక్రయించకూడదు. అయితే రోజూ మద్యం దుకాణాలను రేషన్ కారణంగా మధ్యాహ్నానికే మూసివేయడంతో బార్లలో జోరుగా విక్రయాలు జరుగుతున్నాయి. చీటీలు రాసిస్తే మద్యం ఇవ్వడం పరిపాటైంది. కొత్తపట్నం మండలంలో చివరగా ఉన్న ఒక కీలక గ్రామంలో భారీగా మద్యం నిల్వలు ఉంచినట్లు అధికారులకు సమాచారం రావడంతో వారం క్రితం విచారణ చేశారు. అయితే పక్కాగా నిల్వల సమాచారం లేదని వెనుతిరిగి వెళ్లారు.



లోకేష్ సభకు సిద్ధం చేస్తున్న హోర్డింగ్‌లు

# నేడు జిల్లాకు లోకేష్, బాలకృష్ణ

- ఒకేరోజు మామ, అల్లుడు
- ఏర్పాట్లలో తెలుగు తమ్ముళ్లు
- ఒంగోలులో యువతతో లోకేష్ ముఖాముఖి
- మర్రిపూడి, సంతనూతలపాడుల్లో బాలయ్య సభలు





ఒంగోలు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు మంగళవారం నారా లోకేష్, నందమూరి బాలకృష్ణలు జిల్లాకు వస్తున్నారు. వేర్వేరు కార్యక్రమాలలో మామాఅల్లుళ్లు పాల్గొననున్నారు. ఇద్దరి కార్యక్రమాలు జిల్లాలోని తూర్పుప్రాంతంలోనే జరగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా యువతను చైతన్యవంతం చేసే లక్ష్యంతో ఈనెల 30నుంచి వారం రోజులపాటు లోకేష్ యువగళం తరహాలో మరోకార్యక్రమాన్ని చేపట్టారు. ఒక్కో రోజు ఒక్కో పార్లమెంట్ పరిధిలో తొలిసారి ఓటు హక్కు పొందిన విద్యార్థులు, యువకులతో ముఖాముఖికి ఆయన సిద్ధమయ్యారు. జగన్ పాలనలో ధ్వంసమైన రాష్ట్రం పునర్నిర్మాణం కోసం యువతను సన్నద్ధం చేయడమే లక్ష్యంగా లోకేష్ చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని ఒంగోలు నుంచి ప్రారంభిస్తున్నారు. నగరంలోని గుంటూరు రోడ్డులో మంగళవారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఇది జరగనుంది. అందుకు అవసరమైన ఏర్పాట్లు టీడీపీ ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ నేతృత్వంలో జరుగుతున్నాయి. సదస్సు అనంతరం లోకేష్ నెల్లూరు వెళ్లనున్నారు.

### రెండు చోట్ల బాలకృష్ణ సభలు

టీడీపీ సీనియర్ నేత, ప్రముఖ సినీ నటుడు నందమూరి బాలకృష్ణ కూడా మంగళవారం కొండపి, సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. సాయంత్రం 4 గంటలకు కొండపి సెగ్మెంట్‌లోని మండల కేంద్రమైన మర్రిపూడికి ఆయన హెలికాప్టర్‌లో చేరుకొంటారు. ఆరు గంటల వరకు అక్కడ జరిగే సభలో పాల్గొంటారు. టీడీపీ యువనేత దామచర్ల సత్య ఆధ్వర్యంలో అందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మర్రిపూడిలో కార్యక్రమం అనంతరం బాలకృష్ణ రోడ్డు మార్గాన కాటూరివారిపాలెం, చీమకుర్తి మీదుగా సంతనూతలపాడు చేరుకుంటారు. అక్కడ రోడ్డుషో, సభలో పాల్గొంటారు. రాత్రికి ఒంగోలులో బస చేస్తారు. సంతనూతలపాడులో బాలకృష్ణ సభకు సంబంధించి అక్కడి టీడీపీ అభ్యర్థి బీఎన్ విజయ్‌కుమార్ నేతృత్వంలో ఏర్పాట్లు చేస్తున్నారు. సంతనూతలపాడు చెరువు వెలుపల మైనంపాడు డొంక నుంచి భారీ బైక్ ర్యాలీతో బాలకృష్ణకు స్వాగతం పలకనున్నారు.

# ఎన్నికల బరిలో 165 మంది!

- ఒంగోలు పార్లమెంట్‌కు 25 మంది పోటీ
- ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు రంగంలో 140 మంది

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 29 : సార్వత్రిక ఎన్నికల్లో కీలకమైన నామినేషన్‌ల ప్రక్రియ పూర్తయ్యింది. సోమవారంతో ఉపసంహరణలకు గడువు ముగిసింది. ఒంగోలు పార్లమెంట్‌తోపాటు ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 165 మంది పోటీలో ఉన్నారు. వారికి అధికారులు ఎన్నికల గుర్తులు కేటాయించారు. ఒంగోలు పార్లమెంట్ స్థానానికి 25 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు 140 మంది రంగంలో నిలిచారు. అందులో అత్యధికంగా ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గానికి 27 మంది, మార్కాపురం నుంచి 27 మంది ఉన్నారు. గిద్దలూరు నుంచి 21 మంది అభ్యర్థులు రంగంలో నిలిచారు. కనిగిరి నుంచి 12 మంది, దర్శి నుంచి 11 మంది, సంతనూతలపాడు నుంచి 14 మంది, కొండపి నుంచి 15 మంది, ఎర్రగొండపాలెం నియోజకవర్గం నుంచి 14 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.


స్ట్రాంగ్‌రూం వద్ద ఎన్నికల పరిశీలకులతో కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ సుమిత్, అధికారులు

### ఒంగోలు పార్లమెంట్‌కు రెండో ఈవీఎం తప్పని పరిస్థితి

ఒంగోలు పార్లమెంట్‌తోపాటు, మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు పోటీలో ఎక్కువ మంది ఉండటంతో రెండో ఈవీఎం కూడా ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక్కో ఈవీఎంలో 16 గుర్తులు కేటాయించేందుకు అవకాశం ఉంది. అందులో ఒకటి నోటా కింద ఉంటుంది. అయితే ప్రస్తుతం ఒంగోలు పార్లమెంట్ స్థానానికి 25 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు. దీంతో పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ రెండో ఈవీఎంను ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే ఒంగోలు, మార్కాపురం, గిద్దలూరు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూడా 16 కంటే ఎక్కువ మంది అభ్యర్థులు రంగంలో ఉండటంతో రెండో ఈవీఎం తప్పనిసరి కానుంది.


కందులాపురం కూడలిలో నిర్వహించిన సభకు హాజరైన ప్రజలు

## టీడీపీతోనే రాష్ట్రం సుభిక్షం

- ఆ పార్టీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట
- కంభంలోని కందులాపురం కూడలిలో బహిరంగ సభ

లోపలి పేజీల్లో..

# వైసీపీకి షాక్!

- పార్టీని వీడనున్న కొత్తపట్నం, పాదర్తి మాజీ సర్పంచ్‌లు
- ఇద్దరూ భార్యాభర్తలు
- బాలినేని వైఖరితోనే అని స్పష్టం
- టీడీపీలో చేరికకు రంగం సిద్ధం

కొత్తపట్నం (ఒంగోలు నగరం) ఏప్రిల్ 29 : కొత్తపట్నం మండలంలో వైసీపీకి భారీషాక్ తగలనుంది. కొత్తపట్నం, పాదర్తి మాజీ సర్పంచ్‌లు మూగ ధనమ్మ, మూగ వెంకటేశ్వర్లు ఆ పార్టీని వీడనున్నారు. వారు టీడీపీలో చేరికకు రంగం సిద్ధమైంది. రెండుమూడు రోజుల్లో సైకిలెక్కనున్నారు. ధనమ్మ, వెంకటేశ్వర్లు భార్యాభర్తలు. బీసీ వర్గానికి చెందిన వీరు గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. వైసీపీ ఆవిర్భావం అనంతరం ఆపార్టీలో చేరారు. చాలాకాలంగా బాలినేని శ్రీనివాసరెడ్డికి ముఖ్యఅనుచరులుగా కొనసాగిన వారు తాజాగా పార్టీ మారాలని నిర్ణయించుకున్నారు. ధనమ్మ, వెంకటేశ్వర్లు దంపతులకు కొంతకాలం నుంచి మండలంలోని ఒకరిద్దరు వైసీపీ నాయకులతో తీవ్రస్థాయిలో విభేదాలున్నాయి. వీటిని బాలినేని దృష్టికి తీసుకెళ్లినా ఆయన తన సామాజిక వర్గం వారినే సమర్థిస్తూ వెనుకబడిన వర్గానికి చెందిన తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వెంకటేశ్వర్లు దంపతులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒంగోలులోని బీసీ సామాజికవర్గానికి చెందిన నాయకుడు టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్‌తో మాట్లాడి వెంకటేశ్వర్లు దంపతులు పార్టీలో చేరేందుకు లైన్‌క్లియర్ చేసినట్లు తెలుస్తోంది. రెండు మూడు రోజుల్లో వీరు టీడీపీలో చేరే అవకాశం ఉంది. దీనిపై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బీసీ వర్గానికి చెందిన తమను బాలినేని పట్టించుకోవడం లేదని, ఆయన సామాజికవర్గం వారికే ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. దీంతో వైసీపీలో ఇమడలేక టీడీపీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. కొత్తపట్నం, పాదర్తి గ్రామాల్లో బీసీ వర్గాల్లో పట్టున్న ఇద్దరు మాజీ సర్పంచ్‌లు ఎన్నికల సమయంలో పార్టీని వీడటం వైసీపీకి ఇబ్బందికరం కానుంది.



## హనుమంత వాహనంపై చెన్నయ్య

మార్కాపురంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా మూలవిరాట్‌కు సోమవారం చందన అలంకరణ చేశారు. అనంతరం వాహన సేవ నిర్వహించారు. స్వామివారు శ్రీరాముని అలంకరణలో హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

- మార్కాపురం వన్‌టౌన్

# ఎన్నికల్లో అరాచక ప్రభుత్వాన్ని ఓడించండి

- టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల పిలుపు
- 33వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం
- భారీగా తెలుగుదేశంలో చేరికలు



ఓటర్లకు నమస్కరించి మాట్లాడుతున్న దామచర్ల జనార్దన్



పార్టీలో చేరిన వారితో జనార్దన్

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 29: రాష్ట్ర అభివృద్ధి కోసం, ఒంగోలులో మరిన్ని మౌలిక సౌకర్యాల కోసం టీడీపీ కూటమిని గెలిపించాలని, అభివృద్ధి చేసే పార్టీకి ఓటు వేయాలని, అవినీతి, అరాచక ప్రభుత్వాన్ని ఓడించాలని కూట మి ఒంగోలు ఎమ్మెల్యే అభ్యర్థి దామచర్ల జనార్దన్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం స్థానిక 33వ డివిజన్‌లోని మిలటరీ కాలనీ, శివప్రసాద్ కాలనీ, జడ్పీ కాలనీ, జర్నలిస్ట్ కాలనీలతోపాటు సమీప కాలనీల్లో దామ చర్ల బీజేపీ, జనసేన శ్రేణులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కో సం అనుభవం గల చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా రావాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసి, వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. అలాగే విడిపోయిన రాష్ట్రంలో నిధుల కొరత ఉన్నప్పటికీ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు చంద్రబాబు ఎంతో కృషి చేశారని చెప్పారు. మరోసారి టీడీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో విదేశీ కంపెనీల ఏర్పాటు, యువతకు ఉద్యోగ అవకాశాలు, మహిళలకు రుణాలు, ఉచిత ఆర్టీసీ ప్రయాణం, ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తామని పేర్కొన్నారు. తన హయాంలోనే ఒంగోలు నియోజకవర్గం అభివృద్ధి జరిగిందని, బ్రిడ్జిల నిర్మాణం, రోడ్ల విస్తరణ, సబ్ స్టేషన్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి, వేసవిలోనూ తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు గుర్తు చేశారు. శివారు కాలనీల్లో రహదారుల నిర్మాణం, తాగునీరు పైపులైనులు ఏర్పాటు, సెంటర్ డివైడర్లు, హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేసి నగరాన్ని సుందరంగా తీర్చి దిద్దినట్లు తెలిపారు. ప్రజలు వచ్చే నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, బీజేపీ నాయకులు యోగయ్యయాదవ్‌తోపాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

**వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు**

వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి భారీగా చేరికలు కొనసాగుతున్నాయి. సోమవారం స్థానిక 17 డివిజన్ ప్రగతికాలనీకి చెందిన వైసీపీ నాయకులు చిరుగూరి సంజీవరావు, రమేష్, సన్నిపోగు రాజా, పులుకూరి ఎలీషాతో పాటు కాలనీకి చెందిన మరో 50మంది వైసీపీని వీడి టీడీపీలో చేరారు. అలాగే ఉలిచి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు చుంచు లక్ష్మీనారాయణ, చుంచు శేషగిరిరావు, బొడ్డోలూరి శ్రీనివాసరావు, చేజర్ల శీనయ్య, నూతలపాటి వెంకట్‌లు దామచర్ల సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా దామచర్ల వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వారితోపాటు మరో 45 మంది టీడీపీలో చేరారు. మాజీ మండల అధ్యక్షులు నర సింహారావు, పొగాకు సమాఖ్య అధ్యక్షులు చుంచు శేషయ్య, శింగయ్య, చందు, ఇన్‌చార్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**30వ డివిజన్‌లో..**

టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల గెలుపు కోరుతూ 30వ డివిజన్‌లో పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం విస్తృతం చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నత్తల కనకారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న నాయకులు

## ఎస్‌ఎన్‌పాడు బరిలో 14మంది అభ్యర్థులు

- గుర్తులు కేటాయింపు ప్రక్రియ పూర్తి



మాట్లాడుతున్న ఆర్వో గోపాలకృష్ణ

చీమకుర్తి, ఏప్రిల్ 29 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ సోమవారంతో ముగిసింది. సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల బరిలో 14మంది అభ్యర్థులు మిగిలారు. వారందరికీ గుర్తులు కేటాయింపు ప్రక్రియ పూర్తి చేశారు. బరిలో ఉన్న అభ్యర్థులు, ప్రతినిధులుతో చీమకుర్తిలోని మున్సిపల్ కార్యాలయంలో ఆర్వో గోపాలకృష్ణ సమావేశాన్ని నిర్వహించారు. కాగా బరిలో మిగిలిన అభ్యర్థులు, వారికి కేటాయించిన గుర్తులు ఇలా ఉన్నాయి..

| పేరు | పార్టీ | గుర్తు |
|---|---|---|
| కైలా వెంకట్రావు | బీఎస్పీ | ఏనుగు |
| నాగార్జున మేరుగు | వైసీపీ | సీలింగ్ ఫ్యాన్ |
| పాలపర్తి విజేష్ | ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ | హస్తం |
| బీఎన్.విజయ్‌కుమార్ | తెలుగుదేశం | సైకిల్ |
| ఇస్తర్ల శంకరయ్య | లిబరేషన్ కాంగ్రెస్ | బావి |
| కాటుకూరి డేవిడ్ | జై భీమ్‌రావుభారత్ | కోటు |
| చావాబత్తిన రాంబాబు | రాడికల్‌పార్టీ ఆఫ్ ఇండియా (అంబేడ్కరిస్ట్) | ఉంగరం |
| తాళ్లూరి నాగరాజు | పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా | టెలివిజన్ |
| పంతగాని విజయ్‌బాబు | జాతీయ జనసేనపార్టీ | పెన్‌స్టాండ్ |
| కత్తి రత్నకుమారి | ఇండిపెండెంట్ | బెల్ట్ |
| కోటి రవికుమార్ | ఇండిపెండెంట్ | త్రిభుజం |
| గట్టుపల్లి గోపాలరావు | ఇండిపెండెంట్ | విజిల్ |
| మందా శరత్‌బాబు | ఇండిపెండెంట్ | బల్ల |
| వడ్డిముక్కల రవీంద్రబాబు | ఇండిపెండెంట్ | బ్యాట్ |

## టీడీపీ గెలుపు మోత మోగాలి..!



డప్పులు కొడుతూ ప్రచారం నిర్వహిస్తున్న కూటమి మహిళలు

తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ గెలుపు కోరుతూ కూటమి మహిళలు తప్పెట్లతో డబ్బు మోత మోగించారు. సోమవారం స్థానిక 33వ డివిజన్ మిలటరీకాలనీలో దామచర్ల ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ, జనసేన, బీజేపీ మహిళలు తప్పెట్లు కొట్టి ప్రజలను ఆకర్షించారు. వచ్చే జూన్ 4న వెలువడే ఎన్నికల ఫలితాల్లో దామచర్ల గెలుపు చప్పుళ్ళు ముందే మొదలయ్యాయని మహిళలు పేర్కొన్నారు. - ఒంగోలు (కార్పొరేషన్)

## పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.296

సంతనూతలపాడు, ఏప్రిల్ 29: పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1వ పొగాకు బోర్డు వేలం కేంద్రంలో సోమవారం పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.296 పలికింది. కొణిజేడు నుంచి 1044 పొగాకు బేళ్లు రాగా 891 బేళ్లు అమ్ముడయ్యాయి. 153 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు ఆక్షన్ సూపరింటెండెంట్ రవికాంత్ తెలిపారు. కనిష్ఠ ధర రూ.215, సరాసరి ధర రూ.257.31 వచ్చినట్లు చెప్పారు.

# మహిళల అభ్యున్నతికి మహాలక్ష్మి పథకం

టీడీపీ కూటమి ఎస్‌ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్ • బండ్లమూడిలో 70కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశంలో చేరిక



బండ్లమూడిలో పార్టీలో చేరినవారితో విజయ్‌కుమార్



దొడ్డవరప్పాడు ఎస్సీకాలనీలో బీఎన్ ప్రచారం

చీమకుర్తి, ఏప్రిల్ 29 : మహిళల అభ్యున్నతి కోసమే చంద్రబాబునాయుడు మహాలక్ష్మి పథకం రూపొందించాలని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. కూటమి అధికారంలోకి రాగానే మహాలక్ష్మి పథకం అమలు చేస్తామని, మహిళల ఆర్థికాభివృద్ధికి ఎంతో ప్రయోజనకరమని ఆయన చెప్పారు. సోమవారం మండలంలోని బండ్లమూడి గ్రామంలో బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్‌కు గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. బీఎన్ గ్రామంలో ఇంటింటా తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను అందజేశారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందివ్వటం, పింఛన్ రూ.4వేలకు పెంపు, బీసీలకు 50ఏళ్లకే పింఛన్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, బీసీలకు రక్షణ చట్టం, తల్లికి వందనం కింద కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు చదువుతుంటే అంతమందికి రూ.15వేలు డబ్బులు అందివ్వటం లాంటి పథకాలను అమలు చేస్తామని చెప్పారు. త్వరలో జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు.

బండ్లమూడి పంచాయతీ పరిధిలో వైసీపీని వీడిన 70కుటుంబాలు బీఎన్.విజయ్‌కుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. వీరందరికి పార్టీ కండువాలు కప్పిన బీఎన్ సాదర స్వాగతం పలికారు. కూటమి అభ్యర్థుల గెలుపునకు ఐక్యంగా కృషి చేయాలని కోరారు. నాయకులు గొట్టిపాటి రాఘవరావు, కాట్రగడ్డ రమణయ్య, వనిపెంట శ్రీనివాసరెడ్డి, బాలగిరి జ్యోతి, కాటసాని రమణారెడ్డి, కటకంశెట్టి పుల్లయ్య, గోపిరెడ్డి గంగిరెడ్డి, పొదిలి వెంకటేశ్వర్లు, ఆవులమంద సుబ్బయ్య పుట్టా బ్రహ్మయ్య, యానం వెంకటేశ్వర్లు, చలువాది శ్రీను, సుబ్బారెడ్డి, బ్రహ్మారెడ్డి, పాపిరెడ్డి, మొండితోకల సుబ్బులు, అహరోన్, మీరయ్య తదితరులు పాల్గొన్నారు.

**దొడ్డవరప్పాడు ఎస్సీకాలనీలో..**

మద్దిపాడు: టీడీపీ అధికారంలోకి రాగానే గ్రామాల్లోని అన్ని రకాల అభివృద్ధి పనులు బాధ్యతగా తీసుకుని పూర్తి చేస్తామని టీడీపీ కూటమి ఎస్ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని దొడ్డవరప్పాడు ఎస్సీకాలనీలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎన్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో దోపిడీలు, దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా జగన్‌రెడ్డి మూడు రాజధానుల నాటకాన్ని రూపొందిచారని విమర్శించారు. దళితుల పట్ల వివక్ష చూపుతున్నారన్నారు. నకిలీ మద్యంతో పేదల ప్రాణాలను బలిగొంటున్నారని ఆరోపించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, దుగ్గినేని నరసింహారావు, పాటిబండ్ల అజయ్‌బాబు, గోరంట్ల చిరంజీవి, చుండూరి రాఘురాం, నర్రా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల ప్రలోభాల కట్టడికి చర్యలు తీసుకోవాలి

అభ్యర్థుల ఖర్చుపై నిరంతర నిఘా • అధికారులకు ఎన్నికల ప్రత్యేక పరిశీలకుడు మిశ్రా ఆదేశం





సమావేశంలో మాట్లాడుతున్న జనరల్ అబ్జర్వర్ మోహన్ మిశ్రా

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 29 : జిల్లాలో ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలను కట్టడి చేయాలని ఎన్నికల ప్రత్యేక పరిశీలకుడు శ్రీరామ్ మోహన్ మిశ్రా ఆదేశించారు. తనిఖీల పేరుతో సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు. సోమవారం జిల్లాకు వచ్చిన ఆయన స్థానిక ప్రకాశంభవన్‌లో కలెక్టర్, ఎస్పీలతోపాటు ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా నిర్వహించేందుకు యంత్రాంగం చేపట్టిన చర్యలను సమీక్షించారు. జిల్లాకు జనరల్ అబ్జర్వర్లుగా వచ్చిన అరవింద్ కుమార్ సౌరాసియా, మయూర్ కె మెహత, ఖజాన్‌సింగ్, పోలీస్ అబ్జర్వర్ హాసీబ్ ఉర్ రహమాన్‌లతో కలిసి జిల్లాలోని పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ గరుడ్ సుమిత్‌లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ నిర్వహణ కోసం అవసర మైన సిబ్బందిని ఇప్పటికే గుర్తించి శిక్షణ కూడా ఇచ్చామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలికవసతుల కల్పనతోపాటు సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టి భద్రతాపరంగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సంకల్పం పేరుతో ప్రత్యేక స్టిక్కర్లు రూపొందించి ప్రతి ఇంటికీ అందేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఎస్పీ గరుడ్ సుమిత్ మాట్లాడుతూ అర్హులంతా నిర్భయంగా ఓటు వేసేలా చర్యలు చేపట్టామని తెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లో కలెక్టర్‌తో కలిసి ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిచామని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు పోలీస్ సిబ్బందితోపాటు మాజీ సైనికులు, ఎన్‌సీసీ సేవలను వినియోగించుకుంటున్నట్లు వివరించారు. అన్నింటినీ సావధానంగా తెలుసుకున్న శ్రీరామ్‌మోహన్ మిశ్రా.. యంత్రాంగం చేపట్టిన చర్యలను అభినందించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డీఆర్వో ఆర్.శ్రీలత, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

## ఒంగోలు పార్లమెంట్ బరిలో 25మంది అభ్యర్థులు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 29 : ఒంగోలు లోక్‌సభ నియోజవర్గం స్థానంలో 25మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ జరిగినా ఒక్క అభ్యర్థి కూడా నామినేషన్‌ను ఉపసంహరించుకోలేదు. దీంతో జిల్లా ఎన్నికల అధికారి, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి దినేష్‌కుమార్ గుర్తులను కేటాయించారు. ప్రధాన పార్టీలతో పాటు 17 మంది స్వతంత్ర అభ్యర్థులు రంగంలో ఉన్నారు.

| పేరు | పార్టీ | గుర్తు |
|---|---|---|
| ఈదా సుధాకరరెడ్డి | కాంగ్రెస్ | హస్తం |
| చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి | వైసీపీ | సీలింగ్‌ఫ్యాన్ |
| ధరణికోట లక్ష్మీనారాయణ | బీఎస్పీ | ఏనుగు |
| మాగుంట శ్రీనివాసులురెడ్డి | తెలుగుదేశం | సైకిల్ |
| ఓర్సు వీణ | జైభారత్‌నేషల్‌పార్టీ | బ్యాటరీటార్చ్ |
| కొమ్ము యోహన్ | లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ | వెల్ |
| కె.పవన్‌కల్యాణ్ | జైజనసేన పార్టీ | ఫ్యాన్ స్టాండు |
| పాశం వెంకటేశ్వర్లుయాదవ్ | సమాజ్‌వాదిపార్టీ | సైకిల్‌పంపు |
| సూర్యతేజ కోట | పిరమిడ్‌పార్టీ ఆఫ్ ఇండియా | టెలివిజన్ |
| ఆకుమల్ల మల్లికార్జునరెడ్డి | స్వతంత్ర అభ్యర్థి | కొబ్బరితోట |
| కె.రాజు | స్వతంత్ర అభ్యర్థి | ప్రెజర్‌కుక్కర్ |
| కోట వంశీకృష్ణ | స్వతంత్ర అభ్యర్థి | బకెట్ |
| జగదీష్ రాయపాటి | స్వతంత్ర అభ్యర్థి | బ్యాట్ |
| దేవిరెడ్డి బాలాంజనేయులు | స్వతంత్రఅభ్యర్థి | జాక్‌ఫ్రూట్ |
| పొదిలి రాంబాబు | స్వతంత్ర అభ్యర్థి | గ్లాసుతంబ్లర్ |
| బూచి ఏడుకొండలు | స్వతంత్ర అభ్యర్థి | ల్యాప్‌టాప్ |
| బొడ్డు క్రాంతికుమార్ | స్వతంత్ర అభ్యర్థి | ఫ్లూట్ |
| బొంత రంగారెడ్డి | స్వతంత్ర అభ్యర్థి | రింగ్ |
| యు.మధుబాబు | స్వతంత్రఅభ్యర్థి | క్యూబ్ |
| మోహన్‌గౌడ్ జేవీ | స్వతంత్ర అభ్యర్థి | పాట్(కుండ) |
| యర్ర దశరథరామయ్య | స్వతంత్ర అభ్యర్థి | చైన్ |
| వేసుపోగు గురవబాబు | స్వతంత్ర అభ్యర్థి | విజిల్ |
| సింగమనేని శ్రీకాంత్ | స్వతంత్ర అభ్యర్థి | గన్నకిసాన్ |
| శేషుబాబు జి | స్వతంత్ర అభ్యర్థి | గ్యాస్‌స్టవ్ |
| హరిప్రసాద్ తుపకూల | స్వతంత్ర అభ్యర్థి | బ్రెడ్ |

## లోకేష్ యువగళం విజయవంతం చేయాలి


- టీడీపీ కూటమి ఒంగోలు అభ్యర్థి దామచర్ల



మాట్లాడుతున్న దామచర్ల జనార్దన్

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 29 : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మంగళవారం ఒంగోలు విచ్చేయనున్న సందర్భంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ కోరారు. సోమవారం ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, బూత్ ఇన్‌చార్జులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ మధ్యాహ్నం 3గంటలకు స్థానిక ఏ1 కన్వెన్షన్ హాలు ఎదురు నిర్వహించే యువతతో ముఖాముఖి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతోపాటు, నియోజకవర్గానికి చెందిన యువతీ, యువకులు పాల్గొనేలా చూడాలని కోరారు. సమావేశంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, మంత్రి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



బ్రహ్మయ్య మృతదేహం

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 29 : కుటుంబ కలహాల నేపథ్యంలో ఉరేసుకుని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన తిమ్మసముద్రంలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ కిషోర్ తెలిపిన వివరాల మేరకు .. తిమ్మసముద్రం ఉప్పరకాలనీకి చెందిన దుంపల బ్రహ్మయ్య (45) కుటుంబ కలహాల నేపథ్యంలో కలత చెందాడు. ఆదివారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఫ్యానుకు ఉరేసుకుని మృతిచెందాడు. సోమవారం ఉదయాన్నే గమనించిన కుటుంబసభ్యులు ఉరికి వేలాడుతున్న బ్రహ్మయ్యను కిందికి దింపి పరీక్షించగా మృతిచెందినట్లుగా గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. హెడ్ కానిస్టేబుల్ తన సిబ్బందితో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఈవీఎంలకు పటిష్ట భద్రత : కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 29 : ఈవీఎంల భద్రత, ఓట్ల లెక్కింపు కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లను రైజ్ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. జిల్లాకు వచ్చిన ఎన్నికల జనరల్ అబ్జర్వర్లు అరవింద్‌కుమార్ చౌరాసియా, మయూర్ కె మెహతాలతో కలిసి సోమవారం సాయంత్రం ఒంగోలులోని రైజ్ కాలేజీని ఎస్పీ గరుడ్ సుమిత్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అన్ని నియోజకవర్గాల నుంచి వచ్చిన ఈవీఎంలను భద్రపరిచేందుకు తరగతి గదులలో చేస్తున్న ఏర్పాట్లను కలెక్టర్ వివరించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఎలక్ట్రిఫికేషన్ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, అగ్నిమాపక పరికరాలను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలని అబ్జర్వర్లు సూచించారు. రెండు, మూడు రోజుల్లోనే ఈ విధంగా మార్పులు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఓట్లలెక్కింపు రోజున కూడా ఎలాంటి లోపాలు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రవేశ మార్గంలోనే ఐడీ కార్డులను తనిఖీ చేసి అభ్యర్థులను, సిబ్బందిని లోపలికి అనుమతిస్తామని, నేరుగా సంబంధిత కౌంటింగ్ గదిలోకి వెళ్లేలా బారికేడ్లు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలను ఎప్పటికప్పుడు తెలియజేసేలా పాత్రికేయులకు ప్రత్యేక కేంద్రం కూడా ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో శ్రీలత, అధికారులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న అబ్జర్వర్

## అవీ..ఇవీ..

### నేడు ఒంగోలులో నారా లోకేష్ యువగళం

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 29 : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మంగళవారం ఒంగోలు విచ్చేయనున్నారని టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు స్థానిక గుంటూరు రోడ్‌లోని ఏ1 ఫంక్షన్ హాలు ఎదురు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యువగళం పేరుతో యువతతో ముఖాముఖిగా మాట్లాడుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఒంగోలు నియోజకవర్గానికి చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ యు వత, శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని దామచర్ల కోరారు.

### నేడు సంతనూతలపాడుకు బాలకృష్ణ రాక



సంతనూతలపాడు, ఏప్రిల్ 29: హిందూపూరం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం సాయంత్రం 6 గంటలకు సంతనూతలపాడుకు చేరుకోనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కూటమి అసెంబ్లీ అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్, ఎంపీ అభ్యర్థి తేనేటి కృష్ణప్రసాద్‌లు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. మండలంలో ఆయా గ్రామాల్లోని కూటమి శ్రేణులు, బాలకృష్ణ అభిమానులు పెద్ద ఎత్తున హాజరుకావాలని హరిబాబు కోరారు.

### లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్లలోకే పింఛన్లు

- నగర కమిషనర్ జశ్వంత్‌రావు

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 29: ఎన్నికల నియమవాళి అమలులో ఉన్నందున నగర పరిధిలోని వృద్ధాప్య, వింతంతు, దివ్యాంగులు, ఒంటరి మహిళల పింఛన్లు వారి బ్యాంకు ఖాతాలకే జమ చేస్తామని, పింఛనుదారులు ఆందోళనపడాల్సిన అవసరం లేదని నగర కమిషనర్ జశ్వంత్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛనుదారుల ఆధార్ నెంబరు, బ్యాంకు అకౌంట్ అనుసంధానం అయిన వారికి ఏప్రిల్ నెల పింఛను మే 1వ తేదీన, అలాగే మే నెల పింఛను జూన్ 1న వారి బ్యాంకు ఖాతాలో జమ జరుగుతుందన్నారు. ఈ విధంగా జమ చేయబడిన అనంతరం బ్యాంకు అకౌంట్లు లేని వారికి, అలాగే బ్యాంకులకు వెళ్ళలేని వయోవృద్ధులు, దివ్యాంగులు, మూడు చక్రాలకు పరిమితం అయినవారు, అనారోగ్యంతో మంచంలో ఉండే వారికి ఇంటి వద్దనే సచివాలయ సిబ్బందితో పింఛను పంపిణీ చేస్తామని తెలిపారు. ఇందుకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా, సచివాలయంలో గాని, కార్పొరేషన్ కార్యాలయంలో గాని, ఫోన్ 18004252858 ద్వారా తెలుసుకోవచ్చని కమిషనర్ తెలిపారు.

### ఉద్యోగుల పీఎఫ్ సమస్యలు పరిష్కారానికి కృషి

- కమిషనర్ సతీష్‌కుమార్



మాట్లాడుతున్న సతీష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 29: ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పీఎఫ్ సమస్యల పరిష్కారానికి నిధి ఆఫ్ కెనిఖత్ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని పీఎఫ్ కమిషనర్ సతీష్‌కుమార్ తెలిపారు. జిల్లా ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలులోని శ్రీహర్షిణి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో నిధి ఆప్ కెనిఖత్ కార్యక్రమం నిర్వహించారు. భవిష్యనిధి సంస్థ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు పీఎఫ్‌పై అవగాహన కల్పించారు. భవిష్యనిధి ప్రయోజనాలను వివరించారు. జిల్లా నోడల్ ఆఫీసర్ ఎం.సమ్మయ్య పెన్షన్ చెల్లింపు విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పేర్కొన్నారు. ఈఎస్ఐ మేనేజర్ అనూష ఈఎస్ఐ ద్వారా ఒనగూరే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.ఆంజనేయులు, సిబ్బంది, వివిధ సంస్థల యజమానులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### కనీస కూలి వచ్చేలా చర్యలు తీసుకోవాలి

- డ్వామా పీడీ అర్జునరావు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 29: ఉపాధి హామీ ప థకం ద్వారా కూలీలకు రోజువారీ కనీస కూలి రూ.280కి తగ్గకుండా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ బి.అర్జునరావు ఆదేశించారు. ఒంగోలులోని డ్వామా కార్యాలయంలోని సమావేశపు హాలులో సోమవారం జరిగిన ఏపీఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ప్రతిరోజు ఉదయం 5.30 గంటలకల్లా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం రోజువారి 2.07 లక్షల మంది పనులకు వస్తున్నారని, ప్రస్తుతం వేసవిలో ఉపాధి పనులు పెద్ద ఎత్తున జరిగేలా చూడాలని చెప్పారు. రోజువారీ పనులకు 2.50లక్షల మంది తగ్గకుండా వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని కూలీలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. సమావేశంలో డ్వామా ఏవో విజయలక్ష్మి, విజిలెన్స్ అధికారి ఝాన్సీరాణి, ఏపీడీ వందర్‌మెన్ తదితరులు పాల్గొన్నారు.

### చలివేంద్రం ప్రారంభం

సంతనూతలపాడు, ఏ ప్రిల్ 29: సంతనూతలపాడులోని శాంతినగర్‌లో సోమవారం టీఎస్‌టీయూసీ మండల అధ్యక్షుడు మం దాడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహర్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్.శ్రీనివాసరావు, సీహెచ్.వి.సుబ్బయ్య, ఎం.శ్రీనివాసరావు, బిక్షాలు, తిరుపాలు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

### బీఎన్ గెలుపు కోరుతూ ప్రచారం



కరపత్రాలను అందిస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 29 : టీడీపీ కూటమి సంతనూతలపాడు నియోజకవర్గ అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ సోమవారం ఉప్పుగుండూరులో తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక హైస్కూల్ కాలనీలో టీడీపీ నేత కనగాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను అందజేశారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి బీఎన్.విజయ్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బి.సెల్వం, తెలగతోటి జాన్సన్, జంజనం సుబ్బయ్య, శ్రీకాంత్, రామకృష్ణ, పొట్లూరి నాగమల్లేశ్వరావు, కుంభా పార్వతి, జనసేన నాయకులు పెంట్యాల కోటి, పెంట్యాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### రామచంద్రయాదవ్‌పై దాడి దుర్మార్గం

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 29: పుంగనూరు నియోజక వర్గంలో ప్రచారం నిర్వహిస్తున్న భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ కాన్వాయ్‌పై రాష్ట్రమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు దాడి చేయడాన్ని ఆ పార్టీ రాష్ట్ర సమన్వయ సారధి మిరియం శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. రామచంద్రయాదవ్‌పై దాడికి పాల్పడటమే కాకుండా వాహనాలకు నిప్పుపెట్టి భయాందోళనలు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## టీడీపీతోనే రాష్ట్రం సుభిక్షం

- కంభంలో బహిరంగ సభలో ఎంపీ అభ్యర్థి మాగుంట

కంభం, ఏప్రిల్ 29 : టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. రోడ్డుషోలో భాగంగా కంభంలోని కందులాపురం కూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. మెగా డీఎస్సీపై మొదటి సంతకం చేయడమే కాకుండా వృద్ధాప్య పింఛన్ నెలకు రూ.4వేలకు పెంచనున్నట్లు తెలిపారు. దివ్యాంగుల ఫించన్ రూ.6 వేలు, 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు 1500, ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం, యువతకు 20లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు భృతి, తల్లికి వందనం కింద ఎంతమంది పిల్లలు ఉన్నా ఏడాదికి ఒక్కొక్కరికి 15వేలు, సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. వలంటీర్లకు నెలకు 10వేలు, ఉచిత ఇసుక, అన్నా క్యాంటీన్లు, భూహక్కు చట్టం రద్దు, బీసీలకు 50 ఏళ్లకు పింఛన్ పంపిణీ, ప్రతి పేదవాడికి 2 సెంట్ల స్థలం, పెళ్లి కానుక 2 లక్షల నగదు, పండుగల కానుకలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రసంగించారు. ప్రజలు భారీగా తరలివచ్చారు.

## బాలకృష్ణ పర్యటనను విజయవంతం చేయాలి

● పార్టీ శ్రేణులకు సత్య పిలుపు

మర్రిపూడి, ఏప్రిల్ 29 : స్వర్ణాంధ్ర సాధికార యాత్రలో భాగంగా మంగళవారం మండల కేంద్రమైన మర్రిపూడిలో జరిగే సినీనటుడు హిందూపురం శాసన సభ్యుడు నందమూరి బాలకృష్ణ పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ శ్రేణులకు ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య పిలుపునిచ్చారు. పృథులగిరి రోడ్డులో జరుగుతున్న హెలిప్యాడ్ నిర్మాణ పనులను సోమవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. హెలిప్యాడ్ నుంచి ప్రచార సభ వరకు రూట్ మ్యాప్‌ను ఖరారు చేశారు. బస్టాండ్ కూడలిలో జరిగే సభను జయప్రదం చేసేందుకు నాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని



హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న దామచర్ల సత్య

కోరారు. ప్రతి గ్రామం నుంచి పార్టీ శ్రేణులను పెద్దఎత్తున తరలించాలన్నారు. ఎన్‌డీఏ కూటమి తరుపున పోటీ చేసే మాగుంట శ్రీనివాసుల రెడ్డి, డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామిలను అఖండ మెజారిటీలతో గెలిపించాలని కోరారు. వైకాపా ప్రకటించిన ఎన్నికల ప్రణాళికను టీడీపీ అధినేత ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల వత్యాసాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. వైసీపీ మేనిఫెస్టో పేలవంగా ఉందన్న విషయంపై ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. అంతకుముందు కనిగిరి డీఎస్పీ రామరాజు, కొండపి సీఐ పాండు రంగారావు, ఎస్సై శివబసవరాజు, కొండపి నియోజకవర్గ టీడీపీ కీలక నేత దామచర్ల పూర్ణచంద్రరావులు హెలిప్యాడ్ నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. వీరి వెంట తెలుగురైతు రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఎర్రమోతు శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షుడు చేరెడ్డి నరసారెడ్డి, మాజీ ఎంపీపీ దాసరి వెంకటేశ్వర్లు, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు రేగుల వీరనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యులు తుళ్లూరి నరసింహారావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు గొంటు హనుమారెడ్డి, టీడీపీ నాయకులు వై.వెంకటరెడ్డి, రమేష్, ఏసుపాదం, ఉప్పు సాయి, సారెడ్డి పుల్లారెడ్డి, గొంటు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టంగుటూరు కేంద్రంలో కొనసాగుతున్న పొగాకు వేలం

## పొగాకు గరిష్ఠ ధర కిలో రూ. 293

టంగుటూరు, ఏప్రిల్ 29 : టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో సోమవారం జరిగిన వేలంలో గరిష్ఠ ధర కిలోకు రూ. 293 రైతులకు దక్కింది. వేలం కేంద్రానికి ఆలకూరపాడు, రావివారిపాలెం, అనంతవరం, పాలేటిపాడు, జయవరం రైతులు 1,025 పొగాకు బేళ్లను వేలానికి తీసుకువచ్చారు. ఇందులో 930 బేళ్లు కొనుగోలు చేయగా మిగిలిన 95 బేళ్లు వివిధ కారణాలో తిరస్కరణకు గురయ్యాయి. తిరస్కరించిన బేళ్లలో 42 ఎన్‌బీ కాగా ఆర్‌ఆర్-13, సీఆర్-21 ఉన్నాయి. కిలోకు గరిష్ఠ ధర రూ. 293 కాగా కనిష్ఠ ధర రూ. 215 మాత్రమే రైతులకు దక్కింది. సరాసరి ధర రూ. 258.44 లభించింది. కొనుగోళ్లలో 15 కంపెనీలు పాల్గొన్నాయి.





భేరీకి భారీగా హాజరైన మహిళలు, మాట్లాడుతున్న టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి జ్యోత్స్న

# వైసీపీని సాగనంపితేనే మనుగడ

### మహిళాభేరీలో టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి జ్యోత్స్న

కొండపి, ఏప్రిల్29: వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో మహిళల ఉసురుపోసుకుందని, వారిని అనేక ఇబ్బందులకు గురిచేసిందని, వైసీపీని సాగనంపితేనే రాబోయే రోజుల్లో మహిళల మనుగడని పలువురు వక్తలు అన్నారు. సోమవారం కొండపిలోని ఓ ప్రైవేటు కల్యాణమండపంలో టీడీపీ ఆధ్వర్యంలో కొండపి నియోజకవర్గస్థాయిలో జరిగిన మహిళాభేరి కార్యక్రమంలో టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి జ్యోత్స్న తిరునగరి, టీడీపీ డ్వాక్రా, అంగన్‌వాడీ సంక్షేమ సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత పాల్గొన్నారు. తెలుగు మహిళా మండల అధ్యక్షురాలు బొద్దులూరి ప్రసన్నలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జ్యోత్స్న మాట్లాడుతూ మద్యం నిషేధం చేసి ఓట్లగుతానన్న జగన్ ఆ మాట మరిచాడన్నారు. విద్యుత్, ఆర్టీసీబస్సు, నిత్యవసరాల ధరలు విపరీతంగా పెంచి మహిళలను వైసీపీ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేసిదని ఆమె విమర్శించారు. 2019కి ముందు అందరికీ ముద్దులు పెట్టిన జగన్ అధికారంలోకి వచ్చాక అందరిపై పిడిగుద్దులు కురిపించాడని ఆమె దుయ్యబట్టారు. మహిళలపై అఘాయిత్యాలు, నేరాలు పెరిగిపోయాయన్నారు. మహిళల అభివృద్ధి, సంక్షేమం కోరుకునేది టీడీపీయేనన్నారు. అందుకు నిదర్శనం టీడీపీ మేనిఫెస్టోనని అన్నారు. ఆచంట సునీత మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ పాలనలో 30 వేల మంది ఆడబిడ్డలు కనిపించకుండా పోయారన్నారు. రాష్ట్రంలో మద్య నిషేధం చేస్తానన్న జగన్ చేయకపోగా, మునుపెన్నడూ లేని విధంగా రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్‌కు కేంద్రంగా మార్చారన్నారు. దేశరాజధానికి వెళ్లి మహిళ తన వేలుకోసుకుందంటే రాష్ట్రంలో మహిళల పరిస్థితి ఎంతటి దారుణమో అర్థం చేసుకోవచ్చన్నారు. జగన్ దెబ్బకు తల్లి విజయమ్మ విదేశాలకు పారిపోయిందని, సొంత అక్కచెల్లెళ్లు రోడ్డున పడ్డారన్నారు. అటువంటి జగన్ తన అక్కచెల్లెమ్మలను సంబోధించడం దుర్మార్గమన్నారు. తిరిగి అధికారంలోకి జగన్ వస్తే ఇప్పటి వరకు రాష్ట్రంలో వనరులే కొల్లగొట్టాడని, ఇకపై రైతుల భూములు దోచుకుంటాడని విమర్శించారు. ఎన్‌డీఏ కూటమి బలపరుస్తున్న టీడీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, కొండపి ఎమ్మెల్యే అభ్యర్థి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామిలను గెలపించాలని కోరారు. కార్యక్రమంలో మాగుంట శ్రీనివాసులరెడ్డి కోడలు చందనారెడ్డి మాట్లాడుతూ తమ చారిటబుల్ ట్రస్టు ద్వారా మహిళల స్వయం ఉపాధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తన మామ మాగుంట శ్రీనివాసులరెడ్డిని ఎంపీగా, కొండపి ఎమ్మెల్యేగా స్వామిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా నాయకురాళ్లు, క్షత్రియ, రజిత, మంగపాటి ప్రశాంతి, గాలి పద్మావతి, పేముల విజయనిర్మల తదితరులు మాట్లాడారు. తెలుగుదేశం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య, కొండపి నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు అడకా స్వాములు, కొండపి మాజీ ఎమ్మెల్యే గుండపనేని అచ్యుత్‌కుమార్, బీజేపీ, జనసేన పార్టీల మహిళా విభాగాల నాయకురాళ్లు పాల్గొన్నారు.

# వెన్నంటి ఉండేవారు కావాలా.. వలస పక్షులు కావాలా..

### ప్రచారంలో టీడీపీ కూటమి అభ్యర్థి స్వామి

టంగుటూరు, ఏప్రిల్ 29 : నిరంతరం మీ వెంటే ఉంటూ, మీ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, అభివృద్ధే పరమావధిగా పని చేసే నేను కావాలా? ట్రిప్పుకో నియోజకవర్గం నుంచి పోటీచేస్తూ అక్కడి జనం చేత ఛీకొట్టించుకుంటూ ఈ సారి కొండపి బరిలో నిలబడ్డ వలస పక్షి కావాలో తేల్చుకోవాలని కొండపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ప్రజలకు సూచించారు. మండలంలోని పొందూరు, ఎం. నిడమలూరు, మర్లపాడు, మల్లవరప్పాడు, కారుమంచిలో సోమవారం ఎమ్మెల్యే స్వామి టీడీపీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండపిలో పోటీకి దిగిన వలస పక్షి తాను చెప్పుకుంటున్నట్లు అంత గొప్ప అభివృద్ధి ప్రదాత అయితే ఎన్నికలు జరిగే ప్రతి సారి నియోజకవర్గం ఎందుకు మారుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన పనిచేసిన నియోజకవర్గంలో మంత్రి కనిపించలేదని వాల్‌పోస్టర్లు వేయించుకున్నారని ఇంతకంటే దారుణం ఇంకొకటి ఉండదన్నారు. వైద్య వృత్తిని వదలి ప్రజా సేవకు రాజకీయాల్లోకి వచ్చిన తాను ప్రజల కోసం అంకిత భావంతో పని చేస్తున్నానని, నిస్వార్థంగా ప్రజాసేవే పరమార్థంగా ఎమ్మెల్యే విధులు నిర్వర్తిస్తున్నట్లు స్వామి వెల్లడించారు. తాను నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోతున్నానని, వైసీపీ పాలనలోని ఈ ఐదేళ్ల కాలంలో ఎమ్మెల్యేగా ఉండి కూడా నిధులు లేక, ప్రభుత్వ సహకారం కరువై ఏమీ చేయలేకపోయానన్న ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సారి జగన్ గెలిస్తే మీ ఆస్తులు లాక్కున్నట్లేనని, ఇందుకు వీలుగా ప్రభుత్వం కొత్త చట్టాలను అమల్లోకి తెచ్చిందన్నారు.



పొందూరులో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి

### అడుగడుగునా నీరాజనం

ఎమ్మెల్యే స్వామికి గ్రామగ్రామాన ఘన స్వాగతం లభించింది. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఆయనకు నీరాజనం పలికారు. ఉదయం పొందూరు చేరుకున్న ఎమ్మెల్యేకు పొందూరు టీడీపీ శ్రేణులంతా ఎదురేగి ఘన స్వాగతం పలికారు. ఊరేగింపుగా గ్రామంలోకి తీసుకొచ్చారు. తెలుగుమహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు మేరువ ఆనంద్, ఎంపీటీసీ పమిడి నాగేశ్వర రావు నేతృత్వంలో కొనసాగింది. ఎం నిడమలూరు టీడీపీ శ్రేణులు స్వామికి ఘనంగా స్వాగతం పలికారు. ఆయన పొందూరు నుంచి నేరుగా ఎం నిడమలూరు ఎస్సీ కాలనీని సందర్శించారు. గ్రామం నడిబొడ్డున సెంటర్‌లో ప్రచారం నిర్వహించారు. అక్కడ ప్రచారం ముగించుకొని గ్రామంలోని రెండు ఎస్సీ కాలనీలను చుట్టేశారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కాకుమాని శ్రీకాంత్, పార్టీ సీనియర్ నేత బోడపాటి అజయ్‌బాబు, ఉపాధ్యక్షుడు కాకుమాని సుబ్బారావు, మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పిడుగురాళ్ల సురేష్ పాల్గొన్నారు. ఎం నిడమలూరులో ముగియగానే మధ్యాహ్నానికి మర్లపాడు చేరుకున్నారు. అక్కడ మాజీ ఎంపీటీసీ హరిబాబు, ప్రస్తుత ఎంపీటీసీ చుండూరి వేణు హాజరై ఆహ్వానం పలికారు. గ్రామంలో ప్రచారం ముగియగానే కందులూరు చేరుకున్నారు. కందులూరు టీడీపీ నాయకులు దామచర్ల బసవయ్య నేతృత్వంలో ఎమ్మెల్యే ప్రచారం చేశారు. మల్లవరప్పాడు, కారుమంచిలోనూ ప్రచారం జరిగింది. కారుమంచిలో టీడీపీ నాయకుడు ఈదర ప్రభాకర్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రవీంద్ర నేతృత్వంలో ఎమ్మెల్యే గ్రామంలో ప్రచారం నిర్వహించారు.



ఎం నిడమలూరులో ఎమ్మెల్యే స్వామికి పూల వర్షంతో స్వాగతం పలుకుతున్న మహిళలు

# నియంత పాలనకు రోజులు దగ్గరపడ్డాయి

### టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర

కనిగిరి, ఏప్రిల్ 29: రాష్ట్రంలో నియంతపాలనను సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. కనిగిరి మండలం బల్లిపల్లి గ్రామానికి చెందిన ఐదు కుటుంబాలు, పీసీపల్లి మండలం నేలపాటిపల్లి గ్రామానికి చెందిన 11 కుటుంబాలు వైసీపీని వీడారు. సోమవారం స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకోవటం చారిత్రక అవసరమన్నారు. వైసీపీ పాలనలో ఐదేళ్లలో రాష్ట్రాన్ని తన సొంత జాగీరులా నియంత పాలన సాగించిన జగన్‌ను సాగనంపేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని చెప్పారు. పార్టీలో చేరిన ప్రతిఒక్కరూ మరో పది మందితో కలసి చంద్రబాబు పాలనలో జరిగిన అభివృద్ధిని, మళ్లీ గెలిపిస్తే చేయబోయే అభివృద్ధిని ప్రజలకు సవివరంగా వివరించాలని కోరారు. పార్టీలో చేరిన వారు పాతవారితో కలసిపోయి కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలన్నారు. ప్రతి గడపలో చంద్రబాబు చేయబోయే అభివృద్ధి గురించే చర్చించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

కనిగిరి ప్రాంతాభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని డాక్టర్ ఉగ్ర చెప్పారు. శాశ్వతంగా మంచినీటి సమస్య, వలసన నిర్మూలన సమస్యను పరిష్కరిస్తామన్నారు. కనిగిరిలో ఉపాధి అవకాశాలు లభించేలా పరిశ్రమల స్థాపనకు కృషి చేయనున్నట్లు చెప్పారు. భవిష్యత్తు తరాలు కనిగిరి నుంచి వలసలు వెళ్లేందుకు వీలులేకుండా యువతకు ఉద్యోగావకాశాలు లభించేలా కృషి చేస్తామన్నారు. గతంలో పాలించిన వారు కనిగిరికి టూరిస్ట్‌గైడ్‌లా వచ్చి పోయారేకానీ కనిగిరి అభివృద్ధిపై ఏమాత్రం దృష్టి సారించకపోవటం బాధాకరమన్నారు. ఇకనైనా ప్రజలు ఆలోచించాలని తనను గెలిపిస్తే కనిగిరి అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కనిగిరి: డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన బల్లిపల్లి గ్రామస్థులు

### వైసీపీని వీడిన యాదవ సామాజకవర్గ నేతలు

టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డిపై అన్ని వర్గాల ప్రజల ఆదరణ అభిమానం మరింత బలోపేతం అవుతుంది. ఇప్పటికే యాదవ సామాజకవర్గానికి చెందిన ఎంతో మంది ముఖ్యనేతలు వైసీపీని వీడి డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. తాజాగా హనుమంతునిపాడు మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన వైసీపీ ముఖ్యనేత మల్లెబోయిన గంగరాజుయాదవ్, వెలిగండ్ల మండలం వెదుళ్ళచెరువు గ్రామానికి చెందిన చింతనబోయిన రమణయ్యయాదవ్‌లు సోమవారం కనిగిరిలో అమరావతి గ్రౌండ్స్‌లో డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కనిగిరి అభివృద్ధి చెందాలంటే సమర్థుడైన డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి వలనే సాధ్యమవుతుందనే నమ్మకంతో టీడీపీలో చేరుతున్నట్టు చెప్పారు.కార్యక్రమంలో టీడీపీ హనుమంతునిపాడు మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి(ఎస్‌టీఆర్), కుందురు తిరుపతిరెడ్డి, గాయం రామిరెడ్డి, బీరం వెంకటేశ్వరరెడ్డి, చల్లా సురేంద్రబాబు, కోటపాటి రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

# అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

కొండపి, ఏప్రిల్ 29 : అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గోగినేనివారిపాలెం గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగింది. ఆలస్యంగా అందిన సమాచారం ప్రకారం గోగినేనివారిపాలెం గ్రామానికి చెందిన గోగినేని లక్ష్మీ నరసింహం (68) ఆదివారం సాయంత్రం తన ఇంటిలో ఎవరూ లేని సమయంలో పురుగు మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లక్ష్మీనరసింహం తనకు ఉన్న దాదాపు 6 ఎకరాలు సొంత భూమిలో రెండేళ్లుగా శనగ పంట సాగు చేశారు. పంట సరైన దిగుబడి రాకపోవడంతో నష్టపోయాడు. దీంతో పశువులను కొనుక్కుని మేపుకుంటున్నాడు. తద్వారా వచ్చే ఆదాయంతో అప్పులు తీర్చాలనుకున్నాడు. అయినా అప్పులు తీరకపోవడంతో కలత చెందిన లక్ష్మీ నరసింహం ఆదివారం సాయంత్రం తన ఇంటిలో పురుగుమందును తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

చూసిన ఇరుగుపొరుగు వారు 108కు సమాచారం అందించడంతో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ లక్ష్మీనరసింహం మరణించారు. వైద్యశాల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణబాజీబాబు తెలిపారు.

## కొండపి బరిలో 15మంది

కొండపి, ఏప్రిల్29: నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 15 మంది బరిలో నిలిచారని కొండపి నియోజకవర్గ ఈఆర్వో ఎ. కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నామినేషన్ల పరిశీలన అనంతరం బరిలో 21 మంది నిలిచారు. వారిలో ఆరుగురు సోమవారం ఉపసంహరించుకున్నారు. అనంతరం 15 మంది బరిలో మిగిలారు. ప్రధాన పార్టీలైన వైసీపీ అభ్యర్థి ఆదిమూలపు సురేష్ ఒకటో నంబర్‌లో ఉండగా, గత 2019 ఎన్నికల్లో మాదిరిగా కూటమి అభ్యర్థి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి రెండవ గుర్తుగా సైకిల్‌ను కలిగి ఉన్నాడు. వరుసగా పసుమర్తి సుధాకర్‌రావు కాంగ్రెస్‌పార్టీ హస్తం గుర్తుతో, తర్వాత బీఎస్పీ అభ్యర్థి రావినూతల మాతృక ఏనుగు గుర్తుతో, అంబటి కొండలరావు వీసీకే పార్టీ తరుపున కుండ గుర్తుతో, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరుపున కనపర్తి శివరామ్ బావి గుర్తుతో, కాశిరాజు మంగేపురం సమాజ్‌వాదీ పార్టీ తరుపున సైకిల్‌పంపుతో, కందిపాటి వెంకట కృష్ణారావు జైభీంరావ్‌భారత్ పార్టీ తరుపున కోటు గుర్తుతో, చొప్పర శ్రీకాంత్ నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరుపున బేబీ వాకర్ గుర్తుతో, మెండా బాలకోటయ్య పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా పార్టీ తరుపున టెలివిజన్ గుర్తుతో, రావూరి లక్ష్మణరావు రాడికల్‌పార్టీఆఫ్ ఇండియా (అంబేడ్కరిస్ట్) తరుపున ఉంగరం గుర్తుతో, జముళ్లమూడి పోలయ్య సంతంత్ర అభ్యర్థిగా రోడ్ రోలర్ గుర్తుతో, అలాగే పలువురు స్వతంత్ర అభ్యర్థులు బరిలో నిలిచారని, వీరితోపాటు నోటా 16వగుర్తుగా ఉంటుందని ఈఆర్వో కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు.

## టీడీపీ తీర్థం పుచ్చుకున్న 20 కుటుంబాలు

● ఎమ్మెల్యే స్వామి, సత్య సమక్షంలో పార్టీలో చేరిక

సింగరాయకొండ, ఏప్రిల్ 29 : మండలంలోని ఊళ్లపాలెం పంచాయతీ పరిధి బేసిన్ పల్లెపాలెం గొల్లపోతు స్వాములు చెందిన పది కుటుంబాలు వైసీపీని వీడారు. ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సమక్షంలో సోమవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయన వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు బాయిరెడ్డి మురళి, కానాల బాలాజీ, నాయుడు జనార్దన్, కొక్కిలగడ్డ శ్రీనివాసులు పాల్గొన్నారు. కాగా ఒంగోలులో దామచర్ల సత్య సమక్షంలో సింగరాయకొండకు చెందిన పలువురు టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం మాజీ ట్రస్టుబోర్డు సభ్యుడు బచ్చు యుగంధర్, పవన్ కుమార్, షేక్ బాషా, ఇనకొల్లు రమేష్ పలు కుటుంబాల వారు ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు చీమకుర్తి కృష్ణ, మేకల అంకారావు, నరేష్, కాకా శ్రీనివాసులు, ఎర్రయ్య పాల్గొన్నారు.



దామచర్ల సత్య సమక్షంలో పార్టీలో చేరిన వారు

### సత్య ఆధ్వర్యంలో పార్టీలో చేరిక

సింగరాయకొండ పంచాయతీ పరిధి హనుమాన్ నగర్ వైసీపీకి చెందిన 10 నాయిబ్రహ్మణ కుటుంబాల వారు వైసీపీని వీడారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆపార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య సమక్షంలో సోమవారం రాత్రి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి సత్య ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పాకల వెంకట సుబ్బారావు, మోహన్‌రావు, మారెళ్ల క్రాంతికుమార్, కార్తీక్, బోయిలపల్లి సురేష్, యమార్తి సాయి, వెంకట్రావు, పలు కుటుంబాల వారు ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## మర్రిపూడిలో చేరికల జోరు

మర్రిపూడి, ఏప్రిల్ 29 : మండలంలోని శివరాయునిపేట ఎస్సీ కాలనీకి చెందిన పలువురు సోమవారం టీడీపీలో చేరారు. టంగుటూరు మండలంలో జరుగుతున్న ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామిని కలిసి పార్టీలో చేరతున్నట్లు ప్రకటించారు. మండల టీడీపీ సీనియర్ నాయకులు గురిజాల ఏసుపాదం ఆధ్వర్యంలో అంబటి కిరణ్, సదానందం, వరకుమార్, విష్ణులు పార్టీలో చేశారు. వారికి ఎమ్మెల్యే స్వామి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే

## రైలులో రూ.11.50 లక్షల నగదు పట్టివేత



రైల్వేపోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

ఒంగోలు(క్రైం), ఏప్రిల్ 29 : రైలులో రూ.11.50 లక్షల నగదును తరలిస్తుండగా రైల్వే పోలీసులు సోమవారం రాత్రి పట్టుకున్నారు. సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరుకు చెందిన అమర మధు ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.11.50 లక్షలు నగదును నెల్లూరు నుంచి తీసుకొని వెళుతున్నారు. రైలులో తనిఖీలు చేపట్టిన పోలీసులు సింగరాయకొండ-టంగుటూరు మధ్యలో నగదును గుర్తించారు. అందుకు సంబంధించి ఎలాంటి ఆధారాలను మధు చూపించలేదు. అయితే తాను అపరాల వ్యాపారిని అని, నెల్లూరు నుంచి రైతులకు ఇవ్వాల్సిన నగదు తీసుకెళుతున్నట్లు పోలీసులకు తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం రైల్వే పోలీసులు నగదును ఒంగోలు రైల్వే సీఐకి అప్పగించారు. ఈ మేరకు నగదును సీజ్ చేశారు.

## ప్రజాసేవకే గొట్టిపాటి కుటుంబం అంకితం

కురిచేడు, ఏప్రిల్ 29: గొట్టిపాటి కుటుంబం మాట ఇస్తే కట్టుబడి ఉంటుందని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మాట తప్పే గుణం తమ రక్తంలోనే లేదని చెప్పారు. సార్వత్రిక ఎన్నికలలో భాగంగా సోమవారం దర్శి నియోజకవర్గ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కురిచేడు మండలం ఆవులమంద పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమెకు మద్దతుగా రవికుమార్ ముష్టగంగవరం గ్రామంలో లక్ష్మితో కలసి ప్రచారంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ తాము ప్రజాసేవకే అంకితమయ్యామన్నారు. దర్శిని అభివృద్ధి చేసి చూపిస్తామని చెప్పారు. మా బిడ్డను మీ వద్దకు పంపామని, ఆదరించి అభిమానం చూపాలని కోరారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కార్యకర్తలందరూ ఏకమై కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. రామాంజనేయ కాలనీ, నాంచారపురం, ప్రతిజ్ఞాపురం, ముష్టగంగవరం, కొత్తూరు, ఆవులమంద గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పిడతల పెమిలయ్య, గొట్టిపాటి వెంకటేశ్వర్లు, కాట్రాజు నాగరాజు, గొట్టిపాటి అజయ్, కిలారి పెద్ద కొండయ్య, మొఘల్ మస్తాన్ వలి పాల్గొన్నారు.

## ఆగి ఉన్న బస్సును ఢీకొని విద్యార్థి మృత్యువాత

టంగుటూరు, ఏప్రిల్ 29 : జాతీయ రహదారిలో పేస్ కళాశాల ఎదురుగా సోమ వారం జరిగిన ప్రమాదంలో విద్యార్థి మృతి చెందాడు. కళాశాల విద్యార్థి టి వెంకటేష్ మోటారు సైకిల్‌పై రోడ్డు దాటుతూ ఆగిఉన్న కాలేజీ బస్సును ఢీకొని, పక్కనే ఉన్న డివైడర్‌పై పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఆవెంటనే తీవ్ర రక్తస్రావం అయి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనపై టంగుటూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు ఇంజనీరింగ్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడని, స్వగ్రామం కొండపి అని పోలీసులు తెలిపారు.



డివైడర్‌పైడి మృతిచెందిన విద్యార్థి వెంకటేష్

# ఎన్నికల సిబ్బందికి రెమ్యునరేషన్ నామమాత్రం

**ఐదేళ్ల క్రితం ఎన్నికలకు ఇచ్చిందే ఇప్పుడు కూడా**

**పెంచాలని కోరుతున్న ఉద్యోగులు**

- ప్రిసైడింగ్ ఆఫీసర్ అండ్ కౌంటింగ్ సూపర్‌వైజర్‌కు రోజుకు రూ.350
- నాల్గో తరగతి ఉద్యోగులకు రోజుకు రూ.200
- వీడియో సర్వేలెన్స్ టీమ్‌కు ఏకమొత్తంగా రూ.1200
- వీడియో వ్యూయింగ్ టీమ్, అకౌంటింగ్ టీంకు ఏకమొత్తంగా రూ.1000
- కంట్రోల్ రూమ్, కాల్‌సెంటర్ స్టాఫ్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీకి రోజుకు రూ.200
- సెక్టోరల్ ఆఫీసర్‌కు రూ.5000, మాస్టర్ ట్రైనర్‌కు రూ.2000, అసిస్టెంట్ ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్‌కు రూ.7500 ఏకమొత్తంగా చెల్లిస్తారు.
- ఆదాయ పన్ను ఇన్‌స్పెక్టర్‌కు ఏకమొత్తంగా రూ.1200
- మైక్రో అబ్జర్వర్‌కు ఏక మొత్తంగా రూ.100 చెల్లిస్తారు.
- పోలింగ్ విధులకు నియమితులయ్యే వారికి పోలింగ్ రోజున ఫ్యాక్డ్‌లంచ్, రిఫ్రెష్‌మెంట్స్‌కు, పోలీసు సిబ్బందికి, మొబైల్ పార్టీ సిబ్బందికి, హోంగార్డులకు, ఫారెస్టు గార్డులకు, గ్రామ రక్షక దళ, ఎన్‌సీసీ క్యాడెట్లకు మాజీ సైనిక ఉద్యోగులు, వలంటీర్లకు ఫ్యాక్డ్ లంచ్ లేదా రూ.150 నగదు చెల్లిస్తారు. ఎన్నికల్లో పోలింగ్ విధులకు, ఓట్ల లెక్కింపు విధులకు నియమితులైన వారికి రెమ్యునరేషన్‌తో పాటు లంచ్‌కు రూ.150 చెల్లిస్తారు. అర్హత మేరకు డీఏ చెల్లిస్తారు.

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 29 : వచ్చే నెల 13న జరగనున్న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల విధులకు నియమితులైన అధికారులు, సిబ్బందికి గత ఎన్నికలకు చెల్లించిన నామమాత్రపు రెమ్యునరేషన్ ఇప్పుడు కూడా చెల్లించనున్నారు. 2019 సాధారణ ఎన్నికలకు నియమితులైన అధికారులు, సిబ్బందికి చెల్లించాల్సిన రెమ్యునరేషన్ మొత్తాలనే ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల విధులకు నియమితులైన వారికి చెల్లించనున్నారు. అంటే ఐదేళ్ల క్రితం చెల్లించిన రెమ్యునరేషన్‌నే ప్రస్తుతం కూడా చెల్లించనున్నారు. ఈమేరకు ఎన్నికల కమిషన్ ఈ నెల 27న ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల విధులకు సెక్టార్ ఆఫీసరు కాకుండా అదనంగా నియమితులయ్యే జోనల్ మేజిస్ట్రేట్‌కు ఏకమొత్తంగా రూ.1500 చెల్లిస్తారు.

**ఉద్యోగుల పెదవి విరుపు**

ఎంత కష్టతరమైన పోలింగ్ విధులకు నియమితులైన ఉద్యోగులకు నామమాత్రపు రెమ్యునరేషన్ చెల్లింపునకు ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ఉద్యోగులు పెదవివిరుస్తున్నారు. ఒంగోలులో పని చేస్తున్న వారిని సుమారు 200 కిలోమీటర్ల దూరంగా గిద్దలూరు, మార్కాపురం, వైపాలెం, కనిగిరి నియోజకవర్గాలకు కేటాయించారు. అంతదూరం వెళ్లి విధులు నిర్వహించి రావాలంటే కనీసం వెయ్యి రూపాయలు ఖర్చు అవుతుంది. ఎంఈవోలు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, బ్యాంకు మేనేజర్లను పీవో, ఏపీవోలుగా నియమించారు. ఎన్నికల సిబ్బంది రెమ్యూనరేషన్ విషయంలో ఎన్నికల కమిషన్ పునరాలోచించి రెమ్యునరేషన్ పెంచుతూ తాజా ఉత్తర్వులు సవరించాలని ఉద్యోగులు కోరుతున్నారు.





వదిన గెలుపు కోసం ప్రచారం చేస్తున్న ఆడపడుచు కడియాల లక్ష్మి

# విస్తృతంగా..వివరంగా...!

**దర్శి కూటమి టీడీపీ అభ్యర్థి లక్ష్మి కుటుంబ సభ్యుల ముమ్మర ప్రచారం**

**భర్త, మామలు, తల్లి, సోదరుడు, మరదలు అందరూ ప్రతి ఇంటినీ చుట్టేస్తున్న వైనం**

**మహిళల ఇబ్బందులను తెలుసుకుంటూ భరోసా ఇస్తున్న అభ్యర్థి లక్ష్మి**

దర్శి, ఏప్రిల్ 29 : టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ విజయం కోసం ఆమె కుటుంబ సభ్యులందరూ ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఆమె అత్తింటి తరపు వారు, పుట్టింటి తరపు వారు అందరూ అన్నీ మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన గొట్టిపాటి వారసురాలిగా లక్ష్మీ ఎన్నికల బరిలో దిగటంతో వారి బంధువర్గమంతా ఆమె విజయం కోసం కష్టపడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమిని గెలిపించాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఇంటింటి ప్రచారం చేస్తూ ప్రజలతో మమేకమై ముందుకు సాగుతున్నారు. అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మీ భర్త డాక్టర్ లలిత్‌సాగర్ ఎన్నికల నిర్వహణ మొత్తం భుజస్కంధాలపై వేసుకొని ముందుకు సాగుతున్నారు. అదే సమయంలో ప్రచారం కూడా చేస్తూ ప్రజలతో కలిసి మమేకమవుతున్నారు. అభ్యర్థి లక్ష్మీ మామ కడియాల వెంకటేశ్వరరావు ప్రముఖ వైద్య నిపుణులైనప్పటికీ హాస్పిటల్‌లో ఇతర వైద్యులను కేటాయించి ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. లక్ష్మీ తల్లి గొట్టిపాటి పద్మ మహిళలతో కలిసి ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. అదేవిధంగా లక్ష్మీ ఆడపడుచు హిందుజా వదిన విజయం కోసం అన్నీ మండలాల్లో పర్యటించి ముమ్మర ప్రచారం చేస్తున్నారు. మహిళలతో కలిసి ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. లక్ష్మీ చిన్న మామ కడియాల రమేష్ ఎన్నికల వ్యూహకర్తగా వ్యవహరిస్తూ అన్ని విషయాలు చూసుకుంటున్నారు. అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మీ సోదరుడు భరత్ అన్ని మండలాల్లో పర్యటిస్తూ సోదరి విజయం కోసం గట్టిగా కృషి చేస్తున్నారు. అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మీ ఉదయం నుంచి రాత్రి వరకు ముమ్మర ప్రచారం చేస్తూ తన ప్రసంగాలతో ప్రజలను ఆకట్టుకుంటున్నారు. ప్రధానంగా మహిళలతో మమేకమై వారి ఇబ్బందులను తెలుసుకుంటూ అండగా నిలుస్తామని భరోసా ఇస్తున్నారు. మహిళా అభ్యర్థి కావటంతో మహిళలు ఆమెకు బ్రహ్మరథం పడుతున్నారు. ఆమెతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ముమ్మర ప్రచారం చేస్తున్నారు. ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి అపార అనుభవాన్ని ఎన్నికల్లో ప్రదర్శిస్తున్నారు. ఆయన కుమారుడు మాగుంట రాఘవరెడ్డి విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఎంతో పట్టుదలతో కూటమి నాయకులు, లక్ష్మీ కుటుంబ సభ్యులు చేస్తున్న ప్రచారం, వారి కష్టం ప్రజలను ఆలోచింపజేస్తున్నాయి. మండుటెండను సైతం లెక్కచేయకుండా నిరంతరం ప్రజలతో కలిసి వారితో మమేకమవుతుండటంతో పరిస్థితులు సానుకూలంగా మారుతున్నాయి.



ఓట్లు అభ్యర్థిస్తున్న లక్ష్మీ భర్త డాక్టర్ లలిత్ సాగర్

## వలంటీర్ల వద్దే సెల్‌ఫోన్లు

మద్దిపాడు, ఏప్రిల్ 29 : గ్రామ వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచడంతోపాటు వారి నుంచి సెల్‌ఫోన్లను, ఇతర ప్రభుత్వ సామగ్రిని స్వాధీనం చేసుకోవాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. మండలంలోని పలు గ్రామాల్లో వలంటీర్ల వద్ద సెల్‌ఫోన్లు ఉండడంతో ఓటర్లను ప్రభావితం చేస్తారని ప్రజలు చెబుతున్నారు.



# బెల్లంకొండవారిపాలెంలో హైడ్రామా

**టీడీపీలో చేరిన వైసీపీ సర్పంచ్ భర్త, ఎంపీటీసీ భర్తపై తీవ్ర ఒత్తిడి**

**రెండుగంటలు తిష్టవేసి ఒకరికి పార్టీ కండువా కప్పిన బూచేపల్లి**



సర్పంచ్ భర్త శ్రీకాంత్‌రెడ్డికి బలవంతంగా వైసీపీ కండువా కప్పుతున్న బూచేపల్లి

తాళ్లూరు, ఏప్రిల్ 29 : బెల్లంకొండవారిపాలెంలో నేతలు పార్టీ మారిన నేపథ్యంలో వైసీపీ వారు హైడ్రామాను సృష్టించారు. వైసీపీని వీడి ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన ఆ గ్రామ నేతలపై అధికార పార్టీ తీవ్ర ఒత్తిడి తెచ్చింది. ఆదివారం బెల్లంకొండవారిపాలెం సర్పంచ్ భర్త పోశం శ్రీకాంత్‌రెడ్డి, దోసకాయలపాడు ఎంపీటీసీ సభ్యురాలు భర్త గూడా ప్రభాకర్‌రెడ్డి మరికొందరు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ పరిణామాలు వైసీపీ నేతలను మింగుడుపడనియకుండా చేశాయి. 24 గంటలు గడవక ముందే వారిపై తీవ్ర ఒత్తిడి తెచ్చి బలవంతంగా సోమవారం సాయంత్రం సర్పంచ్ సుమలత భర్త శ్రీకాంత్‌రెడ్డిను జడ్పీటీసీ సభ్యుడు మారం వెంకటరెడ్డి తన వెంటబెట్టుకుని దర్శిలో బూచేపల్లి నివాసానికి తీసుకెళ్లి వైసీపీ కండువా కప్పారు.

**ఆదివారం నుంచే ఒత్తిళ్లు**

గ్రామంలో ఆదివారం సాయంత్రం నుంచే వైసీపీ వారు బెల్లంకొండవారిపాలెం గ్రామ రాజకీయాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆ రోజు రాత్రి బూచేపల్లి వారిని తిరిగి వైసీపీలోనే కొనసాగాలని కోరినట్లు తెలిసింది. ఎంపీ మాగుంట సమక్షంలో టీడీపీలో చేరిన సర్పంచ్ భర్త పోశం శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు భర్త గూడా ప్రభాకర్ రెడ్డి, వారి అనుచరులపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. వైసీపీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి నేరుగా రంగప్రవేశం చేసి తూర్పుగంగవరంలో తిష్టవేసి రెండుగంటలపాటు పార్టీ వీడిన వారితో సంప్రదింపులు జరిపారు. శ్రీకాంత్‌రెడ్డి తండ్రి గంగిరెడ్డి తాము టీడీపీలో చేరామని తిరిగి వైసీపీలోకి వచ్చే ప్రశ్నేలేదంటూ వారికి తెగేసి చెప్పినట్లు సమాచారం. జడ్పీటీసీ సభ్యుడు మారం వెంకటరెడ్డికి శ్రీకాంత్‌రెడ్డి ప్రధాన అనుచరుడు కావటంతో సాయంత్రం వరకు సర్పంచ్ ఇంటి వద్దే మకాం వేసి టీడీపీ కండువా కప్పుకున్న శ్రీకాంత్‌రెడ్డిని మళ్లీ ఒప్పించి సర్పంచ్ సుమలతతో పాటు ఇరువురిని దర్శిలోని బూచేపల్లి నివాసానికి తీసుకెళ్లి తిరిగి వైసీపీ కండువా కప్పించారు. ఆదివారం ఎంపీ మాగుంట సమక్షంలో టీడీపీలో చేరిన వారిలో సర్పంచ్ భర్త శ్రీకాంత్ రెడ్డి ఒక్కరే వైసీపీ గూటికి తిరిగి చేరగా, మిగిలిన వారంతా టీడీపీలోనే కొనసాగుతామని స్పష్టంగా చెప్పి మిన్నకుండి పోయినట్లు తెలిసింది.

# పార్కులను పాడుబెట్టారు

- ఒంగోలులో అధ్వానంగా పార్కులు..
- గాంధీపార్కులో నాటి సందడి ఏదీ?
- ఐదేళ్లుగా పార్కుల అభివృద్ధిని పట్టించుకోని వైసీపీ పాలకులు
- గత టీడీపీ హయాంలో నిర్వహించిన హ్యాపీసండే ఊసే లేదు

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 29 : నగరంలో పార్కులన్నీ నామరూపాలు కోల్పోయాయి. వేసవి సెలవులు కావడంతో చిన్నారులు ఆటలు ఆడుకునేందుకు ఏ పార్కులో కూడా సరైన వసతులు మృగ్యమయ్యాయి. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కులన్నీ కళావిహీనంగా మారాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నగరంలోని పార్కుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించారు. ప్రతి ఆదివారం హ్యాపీసండేలతో ఎక్కడ చూసినా సందడి వాతావరణం కనిపించేది. సినిమాలను సైతం కాదని గాంధీపార్కులో కూర్చోవడానికి నగర ప్రజలు ఆసక్తి చూపేవారు. బోట్ క్లబ్, అందమైన పచ్చని మొక్కలు, వినోదాలకు రోజూ భారీ స్క్రీన్‌పై ఓ సినిమా ప్రదర్శన ఉండేది. కుటుంబ సమేతంగా కూర్చుని కాసేపు సరదాగా గడిపేవారు. ఇపుడా పరిస్థితి లేదు. సినిమాకు తెరదించేయగా, క్యాంటీన్ మూసేశారు. బోట్ క్లబ్ సంగతే మరిచిపోయారు. వేసవి సెలవులు రావడంతో పిల్లలతో కలిసి కాసేపు సరదాగా గడిపేందుకు ఒంగోలులో సరైన పార్కు ఒక్కటైనా లేకపోవడం విచారకరం. వైసీపీ ప్రభుత్వం పార్కుల అభివృద్ధిని పూర్తిగా మరిచిపోయింది. నగర అభివృద్ధిని వదిలేసినట్లే పిల్లల పార్కుల అభివృద్ధిని కూడా వైసీపీ పాలకులు వదిలేశారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఉండీ ఉపయోగం లేదు..**

నగరంలోని దాదాపు అన్ని పార్కులు పచ్చదనం కోల్పోయాయి. పిల్లలు ఆటల పరికరాలు విరిగిపోయి పనికిరాకుండా పోయాయి. వినోద వేదికలైన పార్కుల్లో పిల్లల ఆట పరికరాలు, పచ్చదనం కొరవడటంతో ఆహ్లాదం ఆవిరిగానే మారింది. మొత్తం దాదాపు 26 పార్కుల వరకు ఉండగా వాటిలో సగానికిపైగా ప్రజలకు ఏ మాత్రం ఉపయోగపడటం లేదు. పలు పార్కుల్లో పచ్చదనం కనిపించకపోవడంతో తప్పేదేముందన్నట్లు ఆ ప్రాంత చిన్నారులు అరకొర ఆట వస్తువులతోనే సరిపెట్టుకుంటున్నారు. అన్నవరప్పాడులోని పార్కు నిర్మాణం చేసి పదేళ్లకు పైగా కావస్తుండగా నేటికీ ప్రజలకు పెద్దగా ఉపయోగపడటం లేదు. సంతపేటలోని నాటు బాబురావు పార్కులో పచ్చదనం కొంత ఫర్వాలేదనిపించినా, పిల్లల ఆట వస్తువులు మాత్రం తుప్పుబట్టి విరిగిపోయాయి. పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న వస్తువులే కనిపిస్తున్నాయి. రోజూ సాయంత్రం వేళల్లో పిల్లలు, పెద్దలు, యువత, కుటుంబ సభ్యులతో కలిసి దాదాపు 200 మందికిపైగా వస్తుంటారు. పార్కులో మౌలిక వసతులు కరువవడంతో వారు రావడం మానేశారు. నిర్మల్‌నగర్, గద్దలగుంట పార్కులు స్థానికుల పర్యవేక్షణలో ఓ కమిటీగా ఏర్పడటంతో కొంతమేర బాగున్నాయి. అవి అక్కడి ప్రాంత వాసులకే ఉపయోగపడుతుండగా, ఇతరులు వెళ్లలేని పరిస్థితి. దేవుడుచెరువు పార్కు స్థానికులకు కొంత ఉపయోగకరంగా ఉంది. 3లక్షల లక్షల జనాభా గల ఒంగోలుకు ఒక్క పార్కు కూడా పూర్తిస్థాయిలో ఉపయోగంగా లేకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత టీడీపీ పాలనలో ఎంతో అందంగా కనిపించిన పార్కులు గడిచిన ఐదేళ్లుగా వైసీపీ పాలకులు పట్టించుకోకపోవడంతో అందహీనంగా మారడంపై పెదవివిరుస్తున్నారు.



తెగిపోయిన పిల్లల ఊయల బెల్టు, విరిగిన గొలుసులు



నిర్వహణ లేక ఎండిపోయిన మొక్కలు



విరిగిపోయిన బెంచ్



ఎండిపోయిన చెట్లు, లేచిపోయిన టైల్స్



బోటు క్లబ్‌లోకి దిగేందుకు వెళ్లే దారి ఇలా...




ధ్వంసమైన మూత్రశాల

## నువ్వు ఇటు.. నేను అటు..!

**పలువురు అన్నదమ్ములు, బావాబావమర్దులు వేర్వేరు పార్టీల్లో**

**అంతరంగికంగా ఫోన్ సమాలోచనలు**



చీరాల, ఏప్రిల్ 29 : ఎన్నికల వేళ పలువురు అన్నదమ్ములు, బావాబావమర్దులు వ్యూహాత్మకంగా వేర్వేరు పార్టీల్లో ఉంటూ తమ పబ్బంగా గడుపుకుంటున్నారు. వారు ముమ్మరంగా ప్రచారాల్లోనూ పాల్గొంటున్నారు. వారు రోజూ ఉదయం, సాయంత్రం ఎప్పుడు వీలైతే అప్పుడు ఫోన్లలో మాట్లాడుకుంటూ తమ అడుగులు వేస్తున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తమకు తాము చేసే అక్రమ కార్యకలాపాలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఆ మార్గాన్ని ఎంచుకున్నట్లు సదరు వ్యక్తులు తమ సన్నిహితుల వద్ద చెబుతుండడం గమనార్హం. ఈ తతంగాన్ని గమనిస్తున్న కొందు వారు డబుల్‌గేమ్ ఆడుతున్నారన్న చర్చ సాగుతోంది. ఇలాంటి వారిపనే బాగుంది. పార్టీ కోసం కష్టకాలం నుంచి అండగా ఉంటూ, జెండాలు మోసిన వారికన్నా కూడా అదినాయకులు కూడా వారికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారనే చర్చ సాగుతోంది. ప్రధానంగా ఓ ముగ్గురు అన్నదమ్ములు, వారి బంధువులు నిర్ణీత చర్చల తరువాత ఎవరెవరు ఏ పార్టీలో ఉండాలి. ఆయా అభ్యర్థులతో సన్నిహితంగా మెలుగుతూ తమ ప్రాధాన్యతను పెంపొందించుకోవాలనే అని ముందస్తుగా నిర్ణయించుకున్న విధానంలో అడుగులు వేస్తున్నట్లు చర్చ జరుగుతోంది. వైసీపీ, టీడీపీ, కాంగ్రెస్ ఈ మూడు పార్టీల తరఫున అభ్యర్థుల వద్ద కూడా ఆ ముగ్గురు అన్నదమ్ములు వారి బంధుగణం వ్యవహరించే తీరు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

# మాగుంట ఇంట.. సేవల పంట

**విద్యా, వైద్య సేవల్లో పలు కార్యక్రమాలు**

**నిర్వహించిన ఆ కుటుంబం**

**క్రీడా పోటీలు నిర్వహించి యువతకు ప్రోత్సాహం**

**ట్రస్ట్ తరపున కుట్టుమిషన్లు అందజేసి ఆర్థికంగా వెన్నుదన్ను**

**ప్రచారంలో చర్చనీయాంశమైన అంశాలు**

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో మాగుంట కుటుంబం రాజకీయాలకు అతీతంగా ఎప్పట్నుంచో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి. ఆ కుటుంబ వారసుడు మాగుంట శ్రీనివాసుల రెడ్డి ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తుండగా, వైసీపీ తరపున చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి రంగంలో ఉన్నారు. దీంతో ప్రచార కార్యక్రమాల్లో పార్టీలకు అతీతంగా అభ్యర్థుల సేవా కార్యక్రమాలు కూడా ప్రజల్లో చర్చకు దారితీశాయి. మాగుంట కుటుంబ విషయానికొస్తే... 1991 ఎన్నికల్లో ఒంగోలులో రాజకీయంగా ప్రవేశించినప్పటి నుంచి ఇప్పటివరకు వారి కుటుంబం పేరుతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూనేఉన్నారు. విద్య, వైద్య రంగాల్లో పేదలకు చేయూత నిస్తున్నారు. 30 ఏళ్ల క్రితం కాలేజీ విద్య గ్రామీణ ప్రాంతాలకు అందుబాటులో లేని సమయంలో మాగుంట కుటుంబం జూనియర్, డిగ్రీ కళాశాలల స్థాపనకు శ్రీకారం చుట్టారు. స్వంత నిధులు వెచ్చించి ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 16 జూనియర్, 3 డిగ్రీ కాలేజీలను మాగుంట కుటుంబం ఏర్పాటు చేసింది. కొండపిలో ఒక డిగ్రీ కాలేజీతో పాటు కురిచేడు, సీఎస్‌పురం, కనిగిరి, పెద్దఇర్లపాడు, సంతనూతలపాడు, చీమకుర్తి, ఈతముక్కల, అమ్మనబ్రోలు, చిన్నగంజాం, రావినూతల, జె.పంగులూరు, వలపర్ల, లింగసముద్రం, గుడ్లూరు, కందుకూరులో జూనియర్ కాలేజీలను ఏర్పాటు చేశారు. అలాగే అప్పట్లో ఒంగోలు లోక్‌సభలో ఉన్న నెల్లూరు జిల్లాలోని కావలిలో ఒక జూనియర్, డిగ్రీ కాలేజీని, వింజమూరులో డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేశారు. నేటికీ ఈ విద్యా సంస్థలు కొనసాగుతూనే ఉన్నాయి. అలాగే ఒంగోలులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీకి అనేక సౌకర్యాలు కల్పించారు. రూ.30 లక్షల వ్యయంతో విద్యార్థుల కోసం కంప్యూటర్లు ఏర్పాటు చేశారు. కావలి అసెంబ్లీ నియోజకవర్గంలో పాఠశాలలకు ఉపాధ్యాయుల కోరిక మేరకు బెంచీలను ఏర్పాటు చేశారు. ఇలా గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు జూనియర్, డిగ్రీ కాలేజీలను చేరువ చేసిన ఘనత మాగుంట కుటుంబం సొంతం చేసుకుంది. అలాగే పలు గ్రామాలలో మహిళలకు కుట్టుమిషన్లు అందజేసి వారికి కుటుంబానికి వెన్నుదన్నుగా నిలిచారు.

**వైద్య సేవలు :** కరోనా సమయంలో ప్రజలకు అనేక రకాలు అండగా ఉన్న మాగుంట కుటుంబం... వివిధ రకాల వైద్య సేవలు కూడా అందించటం విశేషం. ముఖ్యంగా గుండె శస్త్రచికిత్సల విషయంలో ఆర్థికంగా వెసులుబాటు లేక ఇబ్బందులు పడుతున్న రోగులకు అండగా ఆ కుటుంబం నిలిచింది. 1991 నుంచి ఇప్పటి వరకు ఒంగోలు లోక్‌సభ పరిధిలో 500 మంది గుండె జబ్బుల రోగులకు నిపుణులైన డాక్టర్ల చేత శస్త్రచికిత్సలు ఉచితంగా చేయించి ఆదుకున్నారు. వారికి అవసరమైన మందులను కూడా ఉచితంగా ఇప్పించారు. కనిగిరి ప్రాంతంలో ఫ్లోరోసిస్ ప్రభావంతో దివ్యాంగులైన వారికి చికిత్సలు చేయించారు. తిరుపతిలోని బర్డ్ వైద్యశాల వారికి రూ.10 లక్షలు ఇచ్చి ప్రపంచ ప్రఖ్యాతి పొందిన వైద్య నిపుణులను ఇక్కడకు రప్పించారు. ఆ మేరకు ఒంగోలులో ఒక మెగా వైద్య శిబిరం నిర్వహించి వందలాది మంది అంగవైకల్యం కల్గిన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించి మందులిచ్చారు. అలాగే దివ్యాంగులకు కూడా చేయూతనిచ్చారు. ఒంగోలులోని సీతారామ కల్యాణ మండపంలో ప్రత్యేక క్యాంపు నిర్వహించి రూ.4 లక్షల వ్యయంతో వారికి వైబ్రేషన్ స్టిక్స్ ఇచ్చారు. ఇలా విద్య, వైద్య రంగాల్లో ప్రజలకు ఆ కుటుంబం ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించగలిగింది.

**క్రీడా పోటీలు :** ప్రస్తుతం యువత క్రికెట్ ఆట వైపు మొగ్గు చూపటంతో ఆ ఆటను ప్రోత్సహించేందుకు అనేక కార్యక్రమాలు చేట్టారు. లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీ 20 క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించారు. ఈ టోర్నమెంట్లలో ఆయా ప్రాంతాలకు చెందిన 250 జట్లు పాల్గొనటం గమనార్హం. చివరగా ఒంగోలులో క్రికెట్ ఫైనల్ టోర్నమెంట్ నిర్వహించగా అందులో 14 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు ప్రథమ బహుమతిగా లక్ష రూపాయలు, ద్వితీయ బహుమతిగా రూ.50 వేలు, ఉత్తమ బ్యాట్స్‌మన్, ఉత్తమ బౌలర్, ఉత్తమ ఫీల్డింగ్‌తో పాటు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ ఒక్కొక్కరికి రూ.5వేల నగదు బహుమతులను ప్రదానం చేశారు. ఈ పోటీల నిర్వహణకు రూ.80 లక్షలు వ్యయం చేశారు. అలాగే గతంలో కనిగిరిలో రాష్ట్రస్థాయిలో ఖోఖో పోటీలు నిర్వహించారు. ఆ పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చిన 13 పురుషుల జట్లకు, 13 మహిళా జట్లకు కనిగిరిలో వసతి, భోజన ఏర్పాట్లతో పాటు దుస్తులు కూడా ఉచితంగా అందించారు. మూడు రోజుల పాటు ఆ పోటీలు జరిగాయి. జిల్లాకు చెందిన రెండు జట్లకు అన్నీ వసతులు కల్పించి ఒంగోలులో రెండు నెలల పాటు ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఇలా క్రీడా రంగాల్లో యువతను ప్రోత్సహించేందుకు కూడా మాగుంట కుటుంబం అనేక కార్యక్రమాలు నిర్వహించింది. ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలో ప్రజల్లో వారు చేసిన సేవా కార్యక్రమాలు కూడా చర్చనీయాంశంగా మారాయి.

కంభం రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎంపీ మాగుంట, పక్కన అశోక్‌రెడ్డి



# వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి

- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి
- తర్లుపాడు మండలంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం



పోతలపాడులో ప్రచారం నిర్వహిస్తున్న నారాయణరెడ్డి

తర్లుపాడు, ఏప్రిల్ 29: వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని మార్కాపురం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని పోతలపాడు, గానుగపెంట, బుడ్డపల్లి, కేతగుడిపి, సూరెపల్లి, సీతానాగులవరంలో కందుల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు కందులకు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో తీవ్ర మంచినీటి ఎద్దడి నెలకొన్నప్పటికీ ప్రజలను వైసీపీ ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేశామని ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి చెప్పడం సిగ్గుచేటన్నారు. మార్కాపురం నియోజకవర్గం టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే అభివృద్ధి చెందిందన్నారు. వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగు, ప్రజలకు తాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. మార్కాపురం జిల్లా చేయకుండా వైసీపీ నాయకులు కుట్రలు చేశారన్నారు. మార్కాపురం జిల్లా అయితే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి అవుతుందన్నారు. జిల్లా ఏర్పాటుకు చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. నియోజకవర్గాన్ని టీడీపీ హయాంలో, వైసీపీ హయాంలో ఎంత అభివృద్ధి చెందిందో ప్రజలు బేరీజు చేసుకోవాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. పథకా లతో ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే మార్కాపురం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని కందుల అన్నారు. వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచకాలను ప్రజలకు వివరించారు. ప్రస్తుతం వైసీపీ నాయకులు డబ్బుల సంచులతో గ్రామాల్లోకి వస్తున్నారని, ధనవంతులకు, పేదలకు జరిగే ఈ ఎన్నికల్లో ప్రజలే న్యాయ నిర్ణేతలన్నారు. ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి జిల్లాలో గత 35 ఏళ్ల నుంచి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించిన ధర్మరాజు అన్నారు. వైసీపీ ఎంపీ అభ్యర్థి ఒక పుష్పలో వంటి స్మగ్లర్ అన్నారు. రానున్న ఎన్నికల్లో తనకు, మాగుంట శ్రీనివాసులరెడ్డికి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉడుముల చిన్నపురెడ్డి, ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు కంచెర్ల కాశయ్య, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రావి బాసపతిరెడ్డి, మాజీ ఎంపీపీ పి.ఏసుదాసు, మాజీ ఎంపీటీసీ పి.గోపినాథ్ చౌదరి, నాయకులు రామిరెడ్డి, కాశీం, సత్తెనపల్లె చలమయ్య, తిరుపతయ్య, చిరంజీవి, నంబుల లక్ష్మయ్య, బత్తుల శీను, నంద్యాల కాశయ్య, ఏల్పుల సుబ్బారెడ్డి, గెండెబొమ్ము శీను, నంద్యాల సుబ్బారావు, ఆరికట్ల వెంకటేశ్వరరెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జమ్మనపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రోహిత్ రెడ్డి



సూరెపల్లెలో కందులకు స్వాగతం పలుకుతున్న మహిళలు

**జమ్మనపల్లిలో టీడీపీ ప్రచారం**

మార్కాపురం రూరల్ : మండలంలోని జమ్మనపల్లి గ్రామంలో సోమవారం రాత్రి నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి తనయుడు రోహిత్‌రెడ్డి నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డికి ఓటు వేయాలని కోరారు. కూటమి అభ్యర్థులను గెలిపిస్తే మన ప్రాంతాభివృద్ధి చెందుతుందన్నారు. మార్కాపురం జిల్లా కేంద్రం, వెలిగొండ ప్రాజెక్టు పూర్తిచేయడం వంటి పనులను అధికారంలోకి వచ్చిన వెంటనే చేస్తామని నాయకులు చెప్పిన విషయాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ, మండల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

**వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించండి**

కొనకనమిట్ల : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు తమ ఓటుతో గద్దె దింపాలని మార్కాపురం టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి కుమార్తె కందుల నందినిరెడ్డి అన్నారు. మండలంలోని వెలిగండ్ల గ్రామంలో ఇంటింటికి మనకందుల, ప్రజగళం కార్యక్రమాన్ని ఆమె సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడిపార్టీల అభ్యర్థులు మాగుంట శ్రీనివాసరెడ్డి, కందుల ఆరాయణరెడ్డిని అత్యధిక మెజార్టీలతో గెలిపించాలని కోరారు. గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు 6గ్యారెంటీల గురించి ప్రజలకు వివరిస్తూ ఉమ్మడి కూటమితెలుగు దేశం, బీజేపీ, జనసేన కూటమి టీడీపీ అభ్యర్థులు అయిన కందుల నారాయణరెడ్డి, ఎంపి అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డిలను ఒక్కసారి గెలిపించాలని, ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడిని చేయాలని ప్రజలను అభ్యర్థించారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజలు పూర్తిగా నష్ట పోయారని ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆమె చెప్పారు. గ్రామంలోని మహిళలు నందినిరెడ్డికి ఘనస్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చెక్‌పోస్టు వద్ద తనిఖీ



తనిఖీ చేస్తున్న ఆర్‌వో నాగజ్యోతి

గిద్దలూరు, ఏప్రిల్ 29 : ప్రకాశం-నంద్యాల జిల్లాల సరిహద్దులోని దిగువమెట్ట వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి డి.నాగజ్యోతి తనిఖీ చేశారు. ఎస్ఎస్‌టీ టీమ్ పనితీరును పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని, అనుమానంగా వస్తువులు కలిగి ఉంటే బిల్లులు పరిశీలించాలని, ప్రతి వాహన నంబరును నమోదు చేసుకోవాలని సిబ్బందికి సూచించారు.

## బైక్‌ను ఢీకొన్న ట్రాలీ ఆటో

- ఒకరికి తీవ్రగాయాలు

త్రిపురాంతకం, ఏప్రిల్ 29: వేగంగా వెళుతున్న ట్రాలీ ఆటో, ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని శ్రీనివాసనగర్ సమీపంలో ఎన్‌హెచ్ 544డీపై సోమవారం చోటుచేసుకొంది. మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన శివశంకర్ బైక్‌పై త్రిపురాంతకం వస్తుండగా మార్కాపురం వైపు వెళుతున్న ట్రాలీ ఆటో (అశోక్ లేలాండ్) వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివశంకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బైకు పూర్తిగా ధ్వంసమైంది. గమనించిన స్థానికులు 108 సహాయంతో మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రుడిని గుంటూరు తరలించారు.

## పొదిలిలో కాంగ్రెస్‌పార్టీ కార్యాలయం ప్రారంభం

పొదిలి, ఏప్రిల్ 29 : రానున్న ఎన్నికల సందర్భంగా పట్టణంలో కాంగ్రెస్‌పార్టీ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. పట్టణంలో లక్కిశెట్టిపాలెంలో మార్కాపురం కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి జావిద్‌అన్వర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల కళ్లల్లో ఆనందం చూడాలంటే కాంగ్రెస్‌పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఉండేలా చూస్తుందన్నారు. కార్యక్రమంలో పొదిలి, కొనకనమిట్ల, మార్కాపురం, తర్లుపాడు మండలాధ్యక్షులు షేక్ నసీరుద్దీన్, దర్శాసి సుబ్బారావు, ఇస్మాయిల్, బడేసాహెబ్, సీపీఎం నాయకులు రమేష్, సీపీఐ నాయకులు వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురు అభ్యర్థులు ఉపసంహరణ

- పోటీలో 21 మంది

గిద్దలూరు, ఏప్రిల్ 29 : నామినేషన్ల ఉపసంహరణ గట్టం ముగిసింది. చివరి రోజు సమాజ్‌వాద్ పార్టీ అభ్యర్థి అడపాల నాగమణి, జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక అభ్యర్థి ఈవీ.సురేష్‌బాబు, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ అభ్యర్థి షేక్ మహబూబ్‌భాషా నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో 21 మంది అభ్యర్థులు అసెంబ్లీ బరిలో ఉన్నట్లు రిటర్నింగ్ అధికారి నాగజ్యోతి తెలిపారు.

## ఇద్దరు స్వతంత్రులు నామినేషన్ల ఉపసంహరణ

- మార్కాపురం అసెంబ్లీకి 27 మంది అభ్యర్థులు పోటీ

మార్కాపురం, ఏప్రిల్ 29: మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి మే 13న జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో 27 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఉపసంహరణకు తుది గడువైన సోమవారం ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేసిన వారు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు రిటర్నింగ్ అధికారి రాహుల్ మీనా ఒక ప్రకటనలో తెలిపారు. పి.ఇమ్మానియేలు, టి.వి.సుబ్బలక్ష్మిలు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్న వారిలో ఉన్నారు.

## గెలిపించండి అభివృద్ధి చేస్తాం



మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

బేస్తవారపేట, ఏప్రిల్ 29 : టీడీపీని గెలిపించండి గిద్దలూరు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని మాగుంట శ్రీనివాసరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డిలు అన్నారు. బేస్తవారపేటలో రోడ్డుషోలో భాగంగా సోమవారం రాత్రి బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ..గతంలో టీడీపీ హయంలో గిద్దలూరు నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశామని అందులో బేస్తవారపేట మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి సోమవారపేట సమీపంలోని చీతీరేలుకతువ వద్ద నుండి బేస్తవారపేటకు పైపులైన్ ద్వారా నీటిని అందించామన్నారు. చెరువుల అభివృద్ధితో పాటు, గ్రామాల్లో తాగునీటి సమస్యకు ఎప్పటికప్పుడు పరిష్కారించాని అన్నారు. ఇక జిల్లాలో మాగుంట కుటుంబానికి 33 ఏళ్లగా గౌరవప్రదమైన రాజకీయ చరిత్ర ఉందన్నారు. జిల్లాకు సేవచేసే మాగుంట శ్రీనివాసులరెడ్డిని గెలిపించుకోవాలన్నారు.

## టీడీపీతోనే రాష్ట్రం సుభిక్షం

- ఆ పార్టీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి
- కంభంలోని కందులాపురం కూడలిలో బహిరంగ సభ

కంభం, ఏప్రిల్ 29 : టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి తెలిపారు. రోడ్డుషోలో భాగంగా కందులాపురం కూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. మెగా డీఎస్సీపై మొదటి సంతకం చేయడమే కాకుండా వృద్ధాప్య ఫించన్ నెలకు రూ.4వేలకు పెంచనున్నట్లు తెలిపారు. దివ్యాంగుల ఫించన్ రూ.6 వేలు, 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు 1500, ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం, యువతకు 20లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి, తల్లికి వందనం కింద ఎంతమంది పిల్లలు ఉన్నా ఏడాదికి ఒక్కొక్కరికి 15వేలు, సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. వలంటీర్లకు నెలకు 10వేలు, ఉచిత ఇసుక, అన్నా క్యాంటీన్లు, భూహక్కు చట్టం రద్దు, బీసీలకు 50 ఏళ్లకు పింఛన్ పంపిణీ, ప్రతి పేదవాడికి 2 సెంట్ల స్థలం, పెళ్లి కానుక 2 లక్షల నగదు, పండుగల కానుకలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రసంగించారు. ప్రజలు భారీగా తరలివచ్చారు.

# టీడీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం

- ఆ పార్టీ సభలకు ప్రజలు బ్రహ్మరథం
- ఎన్నికల్లో గెలుపుపై ధీమా



గడికోట నుంచి అశోక్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన కార్యకర్తలు

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 29 : టీడీపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం ఉరకలేస్తోంది. రాష్ట్రంలో, నియోజకవర్గంలో టీడీపీ విజయకేతనం ఎగురవేస్తుందని సర్వేలు పేర్కొంటుండగా టీడీపీ శ్రేణుల్లో జోష్ పెరిగింది. సోమవారం ప్రచారంలో పార్లమెంటు అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డి, గిద్దలూరు అసెంబ్లీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి కలిసి నియోజకవర్గంలోని అర్ధవీడు, బేస్తవారపేట, కంభం మండల కేంద్రాలలో భారీ ర్యాలీలో, బహిరంగ సభలు నిర్వహించగా టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఆయా కార్యక్రమాలకు భారీగా హాజరయ్యారు. సోమవారం గిద్దలూరు టీడీపీ కార్యాలయంలో మండలంలోని గడికోట పంచాయతీ మాజీ సర్పంచులు ముచ్చుగుండ్ల రావుసుబ్బయ్య, మందగిరి రంగస్వామితోపాటు దూదేకుల నరసింహులు ఆధ్వర్యంలో దేవనగరం గ్రామానికి చెందిన ఇద్దరు వార్డుసభ్యులతో సహా 25 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరందరికీ పార్టీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో తాళ్ల శ్రీనివాసులు, కసిన వెంకటేశ్వర్లు, తాళ్ల బాల గురువయ్య, నల్లమేకల రమణయ్య, మందగిరి తిరుపతయ్య, తానం శ్రీధర్, గుర్రపుశాల వెంకట రమేష్, తాళ్ల శ్రీను, అల్లం వెంకటేశ్వర్లు, చలివేంద్ర చిన్నగోపాల్, పెద్దగోపాల్, పెరుగు వెంకటరమణ, తాళ్ల బాలయ్య, దండె ఓబయ్య, అల్లం నారాయణ, పోతుగంటి చిన్న కాశయ్య, మూలంటి మురళి, మూడమంచు తిరుమలయ్య, కసినే పెద్దఓబులేసు పాల్గొన్నారు.

కంభం పట్టణానికి చెందిన వ్యాపారి అస్లామ్ బేగ్ (హైటెక్‌హోటల్) సోమవారం టీడీపీలో చేరారు. ముత్తుముల అశోక్‌రెడ్డి అస్లామ్‌బేగ్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. బేగ్‌తో పాటు అనుచరులు టీడీపీలో చేరారు. తామంతా అశోక్‌రెడ్డి గెలుపుకు కృషి చేస్తామన్నారు.



మాట్లాడుతున్న మాగుంట శ్రీనివాసులురెడ్డి

కంభం (అర్ధవీడు) : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రవేశ పెడుతున్న సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజలకు సంక్షేమం అందించి ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేయడమే చంద్రబాబు ధ్యేయమని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి తెలిపారు. సోమవారం అర్ధవీడు మండలం అర్ధవీడు, కంభంలలో గిద్దలూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన టీడీపీ ప్రచార కార్యక్రమం రోడ్డుషోలో మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడు తూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే గిద్దలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా చూస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే సత్తా ఒక్క చంద్రబాబు నాయుడికే ఉందన్నారు. ముస్లింలకు 4శాతం రిజర్వేషన్ ఖచ్చితంగా అమలు అవుతుందన్నారు. మైనారిటీలు ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులే విజయం సాధిస్తారన్నారు. గిద్దలూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే పశ్చిమ ప్రాంతవాసుల ఆశాజ్యోతి వెలుగొండ ప్రాజెక్టును పూర్తి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. జగన్‌రెడ్డి మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారని, ప్రతిసారి మోసం చేయలేడరన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఒంగోలు పార్లమెంటు అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసలరెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. రోడ్డుషోలో మాగుంట శ్రీనివాసులరెడ్డిని, ముత్తుముల అశోక్‌రెడ్డిలను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చేగిరెడ్డి రామకృష్ణారెడ్డి, అర్ధవీడు మాజీ ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బెల్లంకొండ సాయిబాబు, మాగుంట శ్రీనివాసులరెడ్డి తనయుడు నిఖిల్‌రెడ్డి, కుప్పా రంగస్వామి, జంకానం ఇస్మాయిల్, దాదా పాల్గొన్నారు.

# ఆరుగ్యారెంటీలతో అందరికీ సంక్షేమ ఫలాలు



ఎన్నికల ప్రచారంలో డాక్టర్ చెల్సియా, మన్నె రవీంద్ర

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 29 : టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలోని ఆరు గ్యారెంటీలతో ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మన్నె రవీంద్ర ప్రజలకు వివరించారు. ఈ నెల 13న నిర్వహించే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబును ఎమ్మెల్యేగా, ఎంపీ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులరెడ్డిలను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. సోమవారం ఎర్రగొండపాలెంలో టీడీపీ విజయం కోసం టీడీపీ అభ్యర్థి ఎరిక్షన్‌బాబు కుమార్తె చెల్సియా, చైతన్యనగర్‌లో ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, పట్టణ అధ్యక్షులు మస్తాన్ వలి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి**

ఎర్రగొండపాలెం : మండలంలోని గురిజేపల్లి గ్రామానికి చెందిన 10 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. సోమవారం సాయత్రం ఎర్రగొండపాలెం టీడీపీ కార్యాలయానికి వచ్చి టీడీపీ కండువాలు వేసుకొని టీడీపీలో చేరారు. ప్రజల విశ్వాసాన్ని వైసీపీ నిలబెట్టుకోవడంతో టీడీపీ తీర్థం పుచ్చుకున్న గురిజేపల్లి నాయకులు అన్నారు.

**నాన్నను గెలిపించండి**

పుల్లలచెరువు : మే నెల 13న జరుగనున్న ఎన్నికల్లో తన తండ్రి ఎరిక్షన్‌బాబును గెలిపిస్తే ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేస్తామని ఆయన కుమార్తె చెల్సియా, కుమారుడు అజిత్‌లు అన్నారు. సోమవారం పుల్లలచెరువు మండల కేంద్రంలో వారు ఇంటింటికి ప్రచారం చేశారు. బాబు సూపర్ సిక్స్ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి టీడీపీ గెలుపు ఒక మలుపు అన్నారు. టీడీపీలో క్రమశిక్షణ కలిగిన సమాన్య కార్యకర్త తన తండ్రి ఎరిక్షన్‌బాబు అన్నారు. నియోజకవర్గంలో ప్రతి గడపలో సమస్య తెలిసిన వ్యక్తి ఎరిక్షన్‌బాబు అని అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే వృద్ధులకు నెలకు 4వేల ఫించను, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఎడాదికి మూడు గ్యాసు సిలిండర్లు, నెలకు 18 నుంచి 60 ఏళ్ళ లోపు మహిళకు 1500 ఆర్థిక సహాయం అందజేయడం వంటి సంక్షేమ పథకాలు అమలుజేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి మీ ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, టీడీపీ నాయకులు రెంటపల్లి సుబ్బారెడ్డి, కాకర్ల కోటయ్య, గజ్వేల్లి భాస్కర్, ఉప్పల హనుమంతు, కె కుమార్, మేడికొండ లక్ష్మి నారాయణ, శనగా నారాయణ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎరిక్షన్‌బాబు సమక్షంలో టీడీపీలో చేరిన కార్యకర్తలు

## చెన్నయ్యకు చందన అలంకారం





చందన గంధంతో చెన్నయ్య, భక్తుల సాంస్కృతిక కార్యక్రమాలు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 29: మార్కాపురంలోని శ్రీ లక్ష్మిచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం చెన్నకేశవస్వామి మూలవిరాట్‌ను చందనంతో అలంకరించారు. రాజ్యలక్ష్మి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. చెన్నకేశవ స్వామి మూల విరాట్‌కు ఆలయ అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు 37 కిలోల చందనంతో మూలవిరాట్‌ను అలంకరించారు. భక్తులు స్వామి మూల విరాట్‌ను తన్మయత్వంతో వీక్షించి పులకించారు. గరుడసేవ కావడంతో భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. చందన అలంకార దాతలుగా మేడా వెంకటసుబ్బారావు, వెంకట నరసింహరావు, శ్రీనివాసరావులు వ్యవహరించారు.

బ్రహ్మోత్సవాలలో భాగంగా మార్కాపురంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి హనుమంత వాహనంపై శ్రీ రాముని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం గరుడవాహన సేవ నిర్వహించనున్నారు.

**ఘనంగా బ్రాహ్మణ గరుడ సమారాధన**

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం లో సోమవారం బ్రాహ్మణ గరుడ సేవ సమారాధన ఘనంగా నిర్వ హించారు. ఆదిశంకరాచార్య అర్చక పురోహిత సంఘం గౌరవా ధ్యక్షులు జటప్రోలు దక్షిణామూర్తిశర్మ ఆధ్వర్యం లో నిర్వహించిన ఈ సమారాధనలో బ్రాహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్రిష్టి లక్ష్మీ నారాయణ జ్ఞాపకార్థం ధర్మపత్ని సుబ్బమ్మ, కుమారులు వెంకట రమణ అనిల్‌బాబు, రవికిరణ్‌లు ఉభయదాతలుగా వ్యవహరించారు.

మార్కాపురం రూరల్ : పట్టణంలోని నెహ్రూ బజార్‌లోని రాజపూడి పుల్లయ్య చారిటబుల్ ట్రస్ట్ భవనం వద్ద బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం మధ్యాహ్నం ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## అవీ..ఇవీ..

### ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

- సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా



ప్రదర్శన చేస్తున్న సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, ఉద్యోగులు, విద్యార్థులు

మార్కాపురం, ఏప్రిల్ 29: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ప్రజలకు రాజ్యాంగం కల్పించిన ఆయుధమని సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా అన్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం నుంచి గడియార స్తంభం వరకూ సోమవారం రెవెన్యూ, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, విద్యార్థులు ప్రదర్శన చేపట్టారు. అక్కడ రోడ్లపై ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించే విధంగా ముగ్గులు వేశారు. ఇరువైపులా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా మాట్లాడుతూ ప్రజలు మే 13న నిర్భయంగా ఓటువేసి తమకు ఇష్టమొచ్చిన నాయకుడిని పాలకునిగా ఎన్నుకోవాలన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవడానికి అధికారులు అన్ని సౌకర్యాలు కల్పించారన్నారు. ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే ఎన్నికల సంఘం దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఈ.కిరణ్, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఓటు హక్కు విశిష్టతను విద్యార్థులు నృత్యాల రూపంలో చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది.

### పన్ను రాయితీకి అవకాశం

గిద్దలూరు, ఏప్రిల్ 29 : 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నులు, ఖాళీస్థలాలపై పన్నులు ఏప్రిల్ నెలాఖరులోగా చెల్లించి 5 శాతం రాయితీ పొందవచ్చని మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెలవుదినాల్లో సైతం మున్సిపాలిటీలో ప్రత్యేక కౌంటర్ ద్వారా పన్నులు చెల్లించే ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

### బార్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



బార్ అసోసియేషన్ నూతన కమిటీ

మార్కాపురం వన్ టౌన్, ఏప్రిల్ 29: పట్టణ బార్ అసోసియేషన్ ఎన్నికలు సోమవారం పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా భూపని కాశయ్య, ఉపాధ్యక్షుడిగా ఉమ్మడి రవీంద్రనాథ్, కార్యదర్శిగా యద్దనపూడి అనిల్‌కుమార్, సహాయ కార్యదర్శిగా ఎస్‌కే కాశీంవలి, కోశాధికారిగా డీజే స్టాలిన్‌లు ఎన్నికయ్యారు. మొత్తం 141 మంది ఓటర్లకు గాను 129 మంది ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల ప్రకియకు రిటర్నింగ్ అధికారులుగా పైడిమర్రి రామచంద్ర, బి.వేణుగోపాల్‌లు వ్యవహరించారు. ఎన్నికైన నూతన కమిటీని పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది అభినందించారు.

### వైసీపీని చిత్తుగా ఓడిస్తాం : పెన్షనర్ల సంఘం



కరపత్రాలు విడుదల చేస్తున్న యూనియన్ నాయకులు

బేస్తవారపేట, ఏప్రిల్ 29 : ఎన్‌డీఏ కూటమిని గెలిపించి, వైసీపీ జగన్మోహన్ రెడ్డి పాలనకు అడ్డుకట్ట వేయాలని అఖిలభారత రాష్ట్ర పెన్షనర్ల సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి జి.పూర్ణచంద్రరావు పిలుపునిచ్చారు. తమ సంఘం సభ్యులతో సోమవారం బేస్తవారపేటలో మాగుంట శ్రీనివాసరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డిలను కలసి మద్దతు తెలిపారు. టీడీపీ కరపత్రాలు విడుదల చేశారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థుల గెలుపు కోసం రాష్ట్రవ్యాప్తంగా తమ సంఘాలు పనిచేస్తున్నాయన్నారు. గతంలో 1వ తేదీన పెన్షన్ అందుకున్నామని, వైసీపీ పాలనలో నెల దాటిన పెన్షన్ కోసం ఎదురు చూసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. దీంతో కుటుంబాలు ఆకలితో ఇబ్బందులు పడ్డాయన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల పెన్షనర్లకు చెల్లించాల్సిన బిల్లులు ఇవ్వకుండా మోసం చేశారని అన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం మాజీ అధ్యక్షులు విజయ్‌చౌదరి, వైద్యఆరోగ్యశాఖ ఎన్జీవో సంఘం మాజీ అధ్యక్షులు పిచ్చయ్య తదితరులు మాగుంట శ్రీనివారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డిలను కలసి మద్దతు తెలిపారు.

### మార్కాపురం జిల్లా ఏర్పాటు టీడీపీతోనే సాధ్యం

- ఆ పార్టీ నాయకురాలు కందుల వసంత



ప్రచారం చేస్తున్న కందుల వసంత లక్ష్మి

మార్కాపురం, ఏప్రిల్ 29: మార్కాపురం కేంద్రంగా నూతన జిల్లా ఏర్పాటు టీడీపీతోనే సాధ్యమౌతుందని టీడీపీ నాయకురాలు కందుల వసంతలక్ష్మి అన్నారు. పట్టణంలోని 19వ వార్డులో టీడీపీ పోల్ మేనేజ్మెంట్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ప్రజాగళంలో భాగంగా 'ఇంటింటికీ మన కందుల' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ హయాంలోనే మహిళలకు రక్షణ కల్పించారన్నారు. మహిళల సాధికారతకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులు మాగుంట శ్రీనివాసులరెడ్డి, కందుల నారాయణరెడ్డిలను రానున్న ఎన్నికలలో గెలిపించి మార్కాపురం ప్రాంత అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు షేక్ మౌలాలి, కొప్పుల శ్రీనివాసులు, మాజీకౌన్సలర్ మర్రి ఝాన్సీరాణి, పాల్గొన్నారు.

### టీడీపీ అభ్యర్థులను గెలిపించండి



ప్రచారం చేస్తున్న నారాయణరెడ్డి సోదరి లక్ష్మీ

పొదిలి, ఏప్రిల్ 29 : రానున్న ఎన్నికల్లో కూటమి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కందుల నారాయణ రెడ్డి సోదరి లక్ష్మీ కోరారు. సోమవారం పట్టణంలోని 12వ వార్డులో ఇంటింటికి తిరిగి తన అన్నను ఆదరించాలని సోదరి లక్ష్మీ ఓటర్లను అభ్యర్థించారు.. కందుల నారాయణరెడ్డి ప్రజలకోసం అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి అన్నారు.జనసేన, బీజేపీ పార్టీలు బలపరిచిన మార్కాపురం ఉమ్మడి టీడీపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రతిఒక్కరు కందుల నారాయణరెడ్డికి, మాగుంట శ్రీనివాసరెడ్డికి ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మండల, గ్రామ, పట్టణ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### అశోక్‌రెడ్డి గెలుపు కోసం విస్తృత ప్రచారం



జేపీ.చెరువులో అశోక్‌రెడ్డి సోదరి గీత ప్రచారం

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 29 : టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి గెలుపు కోసం ఆయన కుటుంబసభ్యులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. గిద్దలూరు మండలం కొంగలవీడు గ్రామంలో సతీమణి ముత్తుముల పుష్పలీల ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పుష్పలీలకు బ్రహ్మరథం పట్టారు. గ్రామంలో ఆమెకు ఎదురెళ్లి స్వాగతం పలికారు. కౌన్సిలర్ పాలుగుళ్ళ శ్రీదేవి తదితరులు ఉన్నారు. రాచర్ల మండలం జెపిచెరువు గ్రామంలో ముత్తుముల అశోక్‌రెడ్డి సోదరి గీత ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి అశోక్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డిలను గెలిపించాలని కోరారు.

## 'సూపర్ సిక్స్'తో టీడీపీ విజయం తథ్యం

దొనకొండ, ఏప్రిల్ 29: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో కూటమి విజయం తథ్యమని ఆపార్టీ మండల నాయకుడు వీరపనేని వెంకన్నచౌదరి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని రామాపురం గ్రామంలో జరిగిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ టీడీపీ సూపర్ సిక్స్ పథకాలకు ప్రజల్లో లభిస్తున్న ఆదరణ చూసి వైసీపీ నేతల గుండెల్లో గుబులు మొదలైందన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి చేతిలో అన్ని రంగాల్లో మోసపోయిన ప్రజలకు ధైర్యం చెప్పేందుకే తాము భవిష్యత్తుకు భరోసా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కామేపల్లి నారాయణమ్మ, కామేపల్లి పోలయ్య, తాండ్ర వెంకటేశ్వర్లు, విప్పర్ల శేషు, సింగమనేని హనుమంతరావు, ఫణిదపు వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## దొనకొండను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తాం


మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుధాకర్‌రెడ్డి

దొనకొండ, ఏప్రిల్ 29: కాంగ్రెస్ హామీ ఇస్తే తుచ తప్పకుండా నెరవేరుస్తుందని ఆపార్టీ ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి ఈదా సుధాకర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇస్తే దొనకొండను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం దొనకొండలో దర్శి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పుట్లూరి కొండారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు సాధించలేక కనీసం రాజధాని లేని రాష్ట్రంగా మిగిల్చిందని అన్నారు. బీజేపీకి తొత్తులుగా మారి విభజన చట్టంలోని ఏహామీని అమలు పర్చలేకపోయారని విమర్శించారు. కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు కర్ణ పుల్లారెడ్డి, వై చిన్నకోటయ్య, పొట్టయ్య, కొప్పుల సాయికృష్ణ, తాండవ రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా కల్పిస్తాం

దర్శి, ఏప్రిల్ 29: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించి అభివృద్ధిపథంలో ముందుకు తీసుకువెళతామని ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి ఈదా సుధాకర్‌రెడ్డి చెప్పారు. దర్శి అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి పి.కొండారెడ్డితో కలిసి సోమవారం రాత్రి దర్శిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మాడపాకుల రమేస్‌బాబు, సీపీఎం కార్యదర్శి టి.రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ పాలనలో అన్నివర్గాలకు ఇబ్బందులు

పామూరు, ఏప్రిల్ 29: వైసీపీ పాలనలో అన్నివర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని టీడీపీ నాయకుడు పులి నాయబా అన్నారు. సంక్షేమం పేరుతో ప్రజలపై భారాలు మోపి ఆర్థిక ఇబ్బందులకు గురిచేశారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే అన్నివర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. పట్టణంలోని ఎర్రచేలు ప్రాంతంలో చంద్రబాబు ప్రవేశపెట్టిన మహిళాశక్తి సూపర్ సిక్స్ పథకాల గురించి సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ముబినామౌలాలి, తెనాలిమస్తాన్ పాల్గొన్నారు. అలాగే, మండలంలోని వగ్గంపల్లి, బొట్లగూడూరు, తిరగళదిన్నె రావిగుంటపల్లి, దాదిరెడ్డిపల్లి, తదితర గ్రామాల్లో టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు.

### విధులకు ఆటంకం కలిగించిన 14 మందిపై కేసు నమోదు

పామూరు, ఏప్రిల్ 29: పామూరు పట్టణంలోని నెల్లూరు రోడ్డులోగల మద్యం దుకాణంలో తహసీల్దార్ షాకీర్‌పాష ఎన్నికల విధుల్లో భాగంగా ఆదివారం తనిఖీ కోసం వెళ్లారు. అక్కడ తన విధులకు ఆటంకం కలిగించిన 14 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం. సైదుబాబు తెలిపారు. తన విధులకు ఆటంకం కలిగించిన షాపు నిర్వాహకుడుతో పాటు మరో 13 మందిపై తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## వైన్‌షాప్‌ను తనిఖీచేసిన తహసీల్దార్

ముండ్లమూరు, ఏప్రిల్ 29: ముండ్లమూరులోని ప్రభుత్వ మద్యం దుకాణాన్ని తహసీల్దార్ జె.మధుబాబు సోమవారం పరిశీలించారు. స్టాక్‌కు సంబంధించిన వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించగా తేడాలు రావటంతో సిబ్బందికి షోకాజ్ నోటీసు ఇవ్వటమే కాక మార్కాపురం డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ధరల కన్నా ఒక్క రూపాయి కూడా అదనంగా వసూలు చేయరాదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పుల్లారెడ్డి, వీఆర్‌వో పున్నారావు, తదితరులు పాల్గొన్నారు.

## రమణారావుకు గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న రమణారావు

కురిచేడు, ఏప్రిల్ 29: విశ్రాంత ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సేవకులు, లయన్స్ క్లబ్ ఆఫ్ కురిచేడు అధ్యక్షుడు వీవీ రమణారావుకు తమిళనాడుకు చెందిన యునైటెడ్ ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ సోషల్ సర్వీసెస్ విభాగం కింద గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. తమిళనాడు ఊటీలోని జమ్‌పార్కులో యూనివర్సిటీ ప్రతినిధులు గౌరవ డాక్టరేట్ అవార్డును రమణారావుకు అందజేశారు. ఆయన సేవలను గుర్తించి అవార్డు అందజేయడం పట్ల కురిచేడు మండల ఉపాధ్యాయ సంఘం నేతలు హర్షం వ్యక్తం చేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు అభినందనలు తెలియజేశారు.

## అన్నా క్యాంటీన్ నిర్వహణకు రూ.50 వేలు విరాళం

పామూరు, ఏప్రిల్ 29: టీడీపీ పామూరు మండల ప్రధానకార్యదర్శి బత్తుల సత్యనారాయణ కుమారుడు కేశవ్ జన్మదిన సందర్భంగా కనిగిరిలోని అమరావతి గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ విరాళం అందజేశారు. సోమవారం టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డిని సత్యం కుటుంబ సభ్యులు కలిసి రూ.50 వేలు విరాళం అందజేశారు.

## క్యాన్సర్ బాధితులకు అండగా నిలుస్తా!

తాళ్లూరు, ఏప్రిల్ 29: మండలంలోని రామభద్రాపురం గ్రామంలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఇద్దరికి సోమవారం జనసేన దర్శి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ గరికపాటి వెంకట్ ఆర్థికసాయం అందజేశారు. ఈసందర్భంగా గరికపాటి మాట్లాడుతూ క్యాన్సర్‌తో బాధపడుతున్నవారిని బసవతారకం కాన్సర్ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యసేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో యర్రంశెట్టి చిరంజీవి, కృష్ణ, సురేష్, సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న గరికపాటి వెంకట్

# నియంత పాలనకు రోజులు దగ్గరపడ్డాయి..

» టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర

కనిగిరి, ఏప్రిల్ 29: రాష్ట్రంలో నియంతపాలనను సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. కనిగిరి మండలం బల్లిపల్లి గ్రామానికి చెందిన ఐదు కుటుంబాలు, పీసీపల్లి మండలం నేలపాటిపల్లి గ్రామానికి చెందిన 11 కుటుంబాలు వైసీపీని వీడారు. సోమవారం స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకోవటం చారిత్రక అవసరమన్నారు. వైసీపీ పాలనలో ఐదేళ్లలో రాష్ట్రాన్ని తన సొంత జాగీరులా నియంత పాలన సాగించిన జగన్‌ను సాగనంపేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని చెప్పారు. పార్టీలో చేరిన ప్రతిఒక్కరూ మరో పది మందితో కలసి చంద్రబాబు పాలనలో జరిగిన అభివృద్ధిని, మళ్లీ గెలిపిస్తే చేయబోయే అభివృద్ధిని ప్రజలకు సవివరంగా వివరించాలని కోరారు. పార్టీలో చేరిన వారు పాతవారితో కలసిపోయి కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలన్నారు. ప్రతి గడపలో చంద్రబాబు చేయబోయే అభివృద్ధి గురించే చర్చించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

కనిగిరి ప్రాంతాభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని డాక్టర్ ఉగ్ర చెప్పారు. శాశ్వతంగా మంచినీటి సమస్య, వలసల నిర్మూలన సమస్యను పరిష్కరిస్తామన్నారు. కనిగిరిలో ఉపాధి అవకాశాలు లభించేలా పరిశ్రమల స్థాపనకు కృషి చేయనున్నట్లు చెప్పారు. భవిష్యత్తు తరాలు కనిగిరి నుంచి వలసలు వెళ్ళేందుకు వీలులేకుండా యువతకు ఉద్యోగావకాశాలు లభించేలా కృషి చేస్తామన్నారు. గతంలో పాలించిన వారు కనిగిరికి టూరిస్ట్‌గైడ్‌లా వచ్చి పోయారేకానీ కనిగిరి అభివృద్ధిపై ఏమాత్రం దృష్టి సారించకపోవటం బాధాకరమన్నారు. ఇకనైనా ప్రజలు ఆలోచించాలని తనను గెలిపిస్తే కనిగిరి అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పీసీపల్లి: ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన దళితులు


డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన బల్లిపల్లి గ్రామస్థులు

### వైసీపీని వీడిన ముఖ్యనేతలు

కనిగిరి, ఏప్రిల్ 29: టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డిపై అన్నివర్గాల ప్రజల ఆదరణ అభిమానం మరింత బలోపేతం అవుతుంది. ఇప్పటికే యాదవ సామాజికవర్గానికి చెందిన ఎంతో మంది ముఖ్యనేతలు వైసీపీని వీడి డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. తాజాగా హనుమంతునిపాడు మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన వైసీపీ ముఖ్యనేత మల్లెబోయిన గంగరాజు యాదవ్, వెలిగండ్ల మండలం వెదుళ్ళచెరువు గ్రామానికి చెందిన చింతనబోయిన రమణయ్యయాదవ్‌లు సోమవారం కనిగిరిలో అమరావతిగ్రౌండ్స్‌లో డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కనిగిరి అభివృద్ధి చెందాలంటే సమర్థుడైన డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి వలనే సాధ్యమవుతుందనే నమ్మకంతో టీడీపీలో చేరుతున్నట్లు చెప్పారు. గడచిన ఐదేళ్ళలో కనిగిరిలో అభివృద్ధి శూన్యమన్నారు. జగన్ అసమర్థ పాలనతో రాష్ట్రం అంధకారంలోకి వెళ్ళిందన్నారు. డాక్టర్ ఉగ్రకు అత్యధిక మెజార్టీ సాధించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ హనుమంతునిపాడు మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి(ఎస్‌టీఆర్), కుందురు తిరుపతిరెడ్డి, గాయం రామిరెడ్డి, బీరం వెంకటేశ్వరరెడ్డి, చల్లా సురేంద్రబాబు, కోటపాటి రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీలో చేరిన 11 కుటుంబాలు

పీసీపల్లి, ఏప్రిల్ 29: మండలంలోని నేలపాటిపల్లి దళితకాలనీకి చెందిన 11 కుటుంబాలు సోమవారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కనిగిరిలోని అమరావతి గ్రౌండ్‌లో కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ అప్పులపాలైన రాష్ట్రం తిరిగి గాడిలో పడాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమని అన్నారు. వైసీపీని వీడి టీడీపీలో చేరినవారిలో ప్రభుదాసు, యోహాన్, చినకొండయ్య, శామ్యేల్, ప్రకాశం, లచ్చయ్య, దయాకర్, ఏసయ్య, కొండయ్య, బాబూరావు, తిమోతి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బద్దిహూడి ఎబినే జరు, ఏసుదాసు, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన యాదవ సామాజికవర్గ ముఖ్యనేతలు

### వైసీపీని వీడిన ముస్లిం నాయకుడు

పామూరు, ఏప్రిల్ 29: పామూరు పట్టణానికి చెందిన ప్రముఖ ముస్లిం నాయకుడు షేక్ ఆదాంసాగారి సాధక్‌సాహెబ్ తన కుటుంబసభ్యులతో కలిసి వైసీపీని వీడి టీడీపీలో చేరారు. స్థానిక బొల్లా క్యాంపు కార్యాలయంలో సోమవారం సాధక్ కుటుంబసభ్యులను డాక్టర్ ఉగ్ర పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

కార్యక్రమంలో టీడీపీ మం డల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ జి.దశరథరామయ్య, సయ్యద్ అమీర్‌బాబు, బొల్లా నరసింహారావు, ఇర్రి కోటిరెడ్డి, షేక్ గౌస్‌బా షా పాల్గొన్నారు.

# ప్రజాసేవకే గొట్టిపాటి కుటుంబం అంకితం

» అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

» కూటమి అభ్యర్థి లక్ష్మికి మద్దతుగా ప్రచారం

కురిచేడు, ఏప్రిల్ 29: గొట్టిపాటి కుటుంబం మాట ఇస్తే కట్టుబడి ఉంటుందని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మాట తప్పే గుణం తమ రక్తంలోనే లేదని చెప్పారు. సార్వత్రిక ఎన్నికలలో భాగంగా సోమవారం దర్శి నియోజకవర్గ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కురిచేడు మండలం ఆవులమంద పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమెకు మద్దతుగా రవికుమార్ ముష్టిగంగవరం గ్రామంలో లక్ష్మితో కలసి ప్రచారంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ తాము ప్రజాసేవకే అంకితమయ్యామన్నారు. దర్శిని అభివృద్ధి చేసి చూపిస్తామని చెప్పారు. మా బిడ్డను మీ వద్దకు పంపామని, ఆదరించి అభిమానం చూపాలని కోరారు. వచ్చేది మన ప్రభుత్వమేనని, దర్శి అభివృద్ధికి కావలసిన సౌకర్యాలను కల్పించుకుందామన్నారు. ముఖ్యంగా సాగు, తాగు నీరులేక అనేక మంది ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వారి కష్టాలు త్వరలో గట్టెక్కుతాయన్నారు. గొట్టిపాటి కుటుంబం సంగతి మీ అందరికి తెలుసునని, మాట ఇస్తే తప్పే గుణం తమలో లేదన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కార్యకర్తలందరూ ఏకమై కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. రామాంజనేయ కాలనీ, నాంచారపురం, ప్రతిజ్ఞాపురం, ముష్టగంగవరం, కొత్తూరు, ఆవులమంద గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పిడతల పెమిలయ్య, గొట్టిపాటి వెంకటేశ్వర్లు, క్యాట్రాజు నాగరాజు, గొట్టిపాటి అజయ్, కిలారి పెద్ద కొండయ్య, మొఘల్ మస్తాన్ వలి, తదితరులు పాల్గొన్నారు.


ముష్టగంగవరంలో మాట్లాడుతున్న గొట్టిపాటి రవికుమార్

### కూటమి అభ్యర్థులను గెలిపించాలి

దర్శి, ఏప్రిల్ 29: టీడీపీ కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి భర్త డాక్టర్ లలిత్ సాగర్ కోరారు. సోమవారం దర్శి పట్టణంలోని అద్దంకి రోడ్డులో, సందువారిపాలెంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి ఓట్లు అభ్యర్థించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమలుచేసే సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో దర్శి నగరపంచాయతీ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్న, టీడీపీ దర్శి పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, గోపు యర్రయ్య, కర్ణా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


దర్శిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న డాక్టర్ లలిత్‌సాగర్

### గొట్టిపాటి లక్ష్మిని ఆదరించాలి

తాళ్లూరు, ఏప్రిల్ 29: దర్శి అసెంబ్లీ టీడీపీ కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న తన అక్క డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిని ఆశీర్వదించాలని భరత్ అన్నారు. మండలంలోని తూర్పుగంగవరం, సోమవరప్పాడు గ్రామంలో సోమవారం సాయంత్రం ఆయన ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ గొట్టిపాటి కుటుంబం నమ్ముకున్న ప్రజలకు అండగా నిలుస్తుందన్నారు. ప్రజలకు అన్నివిధాల న్యాయం జరగాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. గొట్టిపాటి కుటుంబాన్ని ఆదరించినట్లుగా లక్ష్మికి అండగా నిలవాలన్నారు. ఎంపీగా మాగుంట శ్రీనివాసులరెడ్డిని, ఎమ్మెల్యేగా గొట్టిపాటి లక్ష్మిని అధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కనిశెట్టి రామలక్ష్మయ్య, వై.చిరంజీవి, వల్లభనేని సుబ్బయ్య, షేక్ మీరామొహిద్దీన్, చందన, ఇమ్మానియేల్, తదితరులు పాల్గొన్నారు.


తూర్పుగంగవరం గ్రామంలో ప్రచారం చేస్తున్న గొట్టిపాటి భరత్

### వైసీపీని వీడిన దామా

ముండ్లమూరు, ఏప్రిల్ 29: మండలంలోని కమ్మవారిపాలెం గ్రామానికి చెందిన వైసీపీ నేత దామా ఏడుకొండలు, తన సోదరుడు తిరుపతిరావు సోమవారం డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి భర్త లలితసాగర్ సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, సోమేపల్లి శ్రీనివాసరావు, నాగినేని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# దర్శి బరిలో 11 మంది అభ్యర్థులు

» ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ గడువు

దర్శి, ఏప్రిల్ 29: దర్శి అసెంబ్లీకి 11 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారం సాయంత్రం ముగియటంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి బరిలోని అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి(టీడీపీ), డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి(వైసీపీ), పుట్లూరి కొండారెడ్డి (కాంగ్రెస్), ఇత్తడి శివప్రసాద్(బీఎస్పీ), కుంచాల కోటేశ్వరరావు(ఆర్‌పీఐ), తేలుకుట్ల కల్యాణ్‌కుమార్(ఎస్‌పీ) పోటీలో ఉన్నారు.

అలాగే, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా పాటిబండ్ల త్రిపురదాస్, భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా అరిగల శ్రీనివాసులు, ఆంధ్రరాష్ట్ర ప్రజాసమితి అభ్యర్థిగా తెనాలి రవిబాబు, స్వతంత్ర అభ్యర్థులుగా మంచా మీన, అనపర్తి జాన్‌వెస్లీ పోటీలో ఉన్నారు. ఎన్నికల అధికారి లోకేశ్వర రావు అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు.

# కనిగిరి అసెంబ్లీ బరిలో 12 మంది

» ఇద్దరు అభ్యర్థులు ఉపసంహరణ

కనిగిరి, ఏప్రిల్ 29: కనిగిరి అసెంబ్లీ బరిలో 12 మంది అభ్యర్థులు ఉన్నట్టు ఆర్వో జాన్‌ఇర్విన్ తెలిపారు. స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో అభ్యర్థుల నామినేషన్ ఉపసంహరణ ప్రక్రియ సోమవారం జరిగింది. 14 మంది అభ్యర్థులలో ఇద్దరు ఉపసంహరించుకున్నారు.

ఎన్నికల బరిలో డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహా రెడ్డి(టీడీపీ), తాతపూడి ప్రభుదాసు(బీఎస్పీ), దద్దాల నారాయణ(వైసీపీ), దేవరపల్లి సుబ్బారెడ్డి(కాంగ్రెస్), షేక్ అల్లాభక్ష(ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్), దమ్ము వెంకటేష్(లిబరేషన్ పార్టీ), పి.అల్లూరయ్య(పిరమిడ్ ఆఫ్ ఇండియా), షేక్ నజీర్‌బాషా(ఎస్‌పీ) ఉన్నారు. ఇండిపెండెంట్‌లుగా కె.ఖుర్షీద్, షేక్ మస్తాన్‌వలి, షేక్ సుబాహాన్, ముపర్లపాటి షాంశిర్‌బాషా పోటీచేస్తున్నట్టు ఆర్వో తెలిపారు. అభ్యర్థులకు ఎన్నికల గుర్తులు కేటాయించారు.

### చెక్‌బౌన్స్ కేసులో ఏడాది జైలు

కనిగిరి, ఏప్రిల్ 29: చెక్‌బౌన్స్ కేసులో అన్నపురెడ్డి పరమేశ్వర్ రెడ్డి అనే వ్యక్తికి కనిగిరి జూనియర్ సివిల్‌జడ్జి కె.భరత్‌చంద్ర రూ.3 లక్షల70వేల పరిహారం, ఏడాది జైలుశిక్ష విధిస్తూ సోమవారం తీర్పు నిచ్చారు. సీఎస్‌పురం మండలం అరివేముల గ్రామానికి చెందిన అన్నపురెడ్డి పరమేశ్వరరెడ్డి వెలిగండ్ల మండలం తమ్మినేనిపల్లి గ్రామానికి చెందిన కఠారి సిద్దారెడ్డి నుంచి రూ3.70లక్షలు అప్పుగా తీసుకున్నారు. దాని తాలూకాకు రూ3.70లక్షలకు చెక్కును 2017వ సంవత్సరంలో ఇచ్చారు. సదరు చెక్కును బ్యాంకులో వేయగా బౌన్స్ అయింది. దీనికిసంబంధించిన కేసు గత ఏడేళ్ళుగా కోర్టులో విచారణ జరుగుతుంది. విచారణ అనంతరం సోమవారం కనిగిరి కోర్టు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ జడ్జి కె.భరత్‌చంద్ర అన్నపురెడ్డి పరమేశ్వరరెడ్డికి ఏడాది జైలు శిక్ష, రూ3.70లక్షల నగదు పరిహారం చెల్లించాలని తీర్పు ఇచ్చారు.

### 40మంది టీడీపీలో చేరిక

కనిగిరి, ఏప్రిల్ 29: మండలంలోని గుడిపాడు ఎస్సీ కాలనీలో 40 మంది సోమవారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. డాక్టర్ ఉగ్ర సమక్షంలో నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు కొండా కృష్టారెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి ఉగ్ర పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరని వారిలో కాలె మల్లికార్జున, కొండా బ్రహ్మయ్య, కొండా ఆదినారాయణ, వీరనారాయణ, చిననాగయ్య, పెదనాగయ్య, చీమల నాగరాజుయాదవ్, మూలె శ్రీనివాసరెడ్డి, కోనంకి మాల్యాద్రి తదితరులు ఉన్నారు.



# మండుటెండల్లో ఎన్నికల వేడి

» ముందస్తు చర్యలతోనే

**పోలింగ్ శాతం పెరిగేందుకు అవకాశం**

పామూరు, ఏప్రిల్ 29: ప్రచండ భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. ఫిబ్రవరి నెల నుంచే ఉష్ణోగ్రతలు పెరిగాయి. రాబోయే రోజుల్లో పరిస్థితి తీవ్రంగా ఎండే అవకాశం ఉంది. మే నెలలో వడగాలులు కూడా వీయెచ్చునని వాతావరణ శాఖ చెబుతుంది. మరోవైపు మేలో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. పోలింగ్ రోజున ఎండ తీవ్రతను తట్టుకోనేలా ఏర్పాట్లకు ఇప్పటి నుంచే ఎన్నికల యంత్రాంగం సన్నద్ధం కావాలని వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. లేకుంటే ఓటింగ్ శాతం తగ్గే అవకాశం ఉంది.

2019లో దేశవ్యాప్తంగా ఏడు విడతల్లో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించారు. తొలి విడతలో భాగంగా రాష్ట్రంలో ఏప్రిల్ 11న పోలింగ్ జరిగింది. ప్రస్తుతం నాలుగో విడతలో భాగంగా మే 13న ఎన్నికలు జరగనున్నాయి. గతంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో సరాసరిన 78.56 శాతం పోలింగ్ నమోదైంది. కనిగిరి నియోజకవర్గంలో 76.38 శాతం నమోదైంది. సాధారణంగా గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణాల్లో ఓటింగ్ శాతం తక్కువగా ఉంటుంది. ఈసారి ఓటింగ్ శాతం పెరగాలని, ఆ దిశగా ఓటర్లలో చైతన్యం కలిగించేలా కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులు సూచిస్తున్నారు. అందుకు తగ్గ ఏర్పాట్లుచేయాలని ఓటర్లు కోరుతున్నారు.

ఎండలు మండిపోతున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఇబ్బందులు రాకుండా, వడదెబ్బ తగలకుండా చేపట్టాల్సిన చర్యలపై అధికారులు సన్నద్ధం కావాల్సి ఉంది. అధిక శాతం పోలింగ్ కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉంటాయి. ఓటు హక్కు వినియోగించుకోనేందుకు ఎక్కువ మంది ప్రజలు వస్తారు. ఆయాచోట్ల నీడ, తాగునీటి కోసం ఏర్పాట్లు చేయాలని ఓటర్లు కోరుతున్నారు. వడదెబ్బ తగిలితే అవకాశం ఉండటంతో తగిన వైద్య సదుపాయాలు సమకూర్చాలని నిపుణులు, స్వచ్ఛంద సంస్థలు సూచిస్తున్నారు. ఓటర్లు ఎక్కువసేపు వేచి చూడకుండా వీలైనంత త్వరగా పోలింగ్ జరిగేలా అధికారులు చూడాలని చెబుతున్నారు. అలాగే, ఎండలకు భయపడి చాల మంది ఓటుకు దూరంగా ఉంటారు. అలాంటి వారికి రవాణా వసతి కల్పించాల్సిన అవసరంఉంది. ఈదిశగా ఎన్నికల అధికారులు తగిన చర్యలు తీసుకొంటే పోలింగ్ శాతం పెరిగే అవకాశం ఏర్పడుతుందని పలువురు భావిస్తున్నారు.

# వలసరహిత కనిగిరిగా తీర్చిదిద్దడమే లక్ష్యం

» డాక్టర్ ఉగ్ర


గుడిపాడులో మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్ర

కనిగిరి, ఏప్రిల్ 29: కనిగిరి నియోజకవర్గాన్ని వలస రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మండలంలోని పునుగోడు, బొమ్మిరెడ్డిపల్లి, గుడిపాడు గ్రామాల్లో సోమవారం రాత్రి డాక్టర్ ఉగ్ర రోడ్ షో ప్రచారం నిర్వహించారు. మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ రాష్ట్రంలోని వెనుకబడిన జిల్లాలో ప్రకాశం జిల్లా, అయితే అందులో పశ్చిమ ప్రాంతంలో కనిగిరి ప్రాంతం అన్నిరంగాల్లో వెనుబాటుకు గురయిందన్నారు. కనిగిరి ప్రజల ఓట్లతో గెలిచి గద్దెనెక్కిన నేతలు అభివృద్ధిని మరచిపోయి, వారి స్వార్థ రాజకీయ స్వలాభాలే చూసుకోవటం ఈప్రాంత ప్రజల దురదృష్టమన్నారు. ప్రతి గడప ముంగిట వృద్ధులు మంచాల్లో ఉండటాన్ని చూసి బాధేసిందన్నారు. వలసల నివారణతోనే కనిగిరి ప్రాంతంలో పల్లెలు కళకళలాడతాయన్నారు. అందుకే కనిగిరిని వలస రహిత ప్రాంతంగా మార్చటమే తన లక్ష్యమన్నారు. అందుకోసం నిమ్జ్ ఏర్పాటుకు గట్టిగా కృషి చేస్తామన్నారు. కుటీర పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం చుట్టి ఉపాధి అవకాశాలు కల్పిస్తానని చెప్పారు. దశాబ్దకాలం పదవుల్లో లేకపోయినా కనిగిరి ప్రాంత ప్రజలతోనే ఉన్నానన్నారు. పరాయి ప్రాంతాల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇచ్చినప్పటికీ, కనిగిరి ప్రాంతంలోనే తాను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచి అభివృద్ధి చేయాలనే ఆ అవకాశాన్ని తీసుకోవలేదన్నారు. గుడిపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో నివసించే వారికి ఇంటి స్థలంతో పాటు పక్కా గృహం నిర్మించి ఇచ్చే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. వేవవరం - కొత్తపాలెం రోడ్డును వేయిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటికి మంచి నీటి సరఫరా చేయిస్తామన్నారు.

కార్యక్రమంలో నాయకులు పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, భేరిపుల్లారెడ్డి, నారపరెడ్డి(యడవల్లి) శ్రీనివాసులురెడ్డి, సైకం మాలకొండారెడ్డి, బాలు ఓబులురెడ్డి, పీతు కొండారెడ్డి, నంబల వెంకటేశ్వర్లుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.





● పిల్లర్ల దశ దాటని బాపట్ల మెడికల్ కళాశాల పనులు

# కాలేజీ పనులు

## మాటల్లోనే వైద్య కళాశాలలు

- మూడేళ్లుగా పూర్తి కాని పనులు
- బాపట్లలో పిల్లర్ల దశ దాటని నిర్మాణాలు
- పిడుగురాళ్లలో హడావుడిగా ప్రారంభోత్సవం
- 2025-26 తరగతులు ప్రారంభం గగనమే

ప్రతి జిల్లాలోనూ ప్రభుత్వ వైద్య కళాశాల. ఇంత వరకూ ఏ ప్రభుత్వం చేయని సాహసం. రూ.500 కోట్లతో వైద్య కళాశాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టాం. మూడేళ్లలో పనులు పూర్తి చేస్తాం. తరగతులను ప్రారంభిస్తాం. కార్పొరేట్ వైద్య సేవలను అందుబాటు లోకి తెస్తాం.. అని సీఎం జగన్ ఆర్భాటంగా ప్రకటించారు. అయితే ఇప్పటికీ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని బాపట్ల, పిడుగురాళ్లలో వైద్య కళాశాల భవన నిర్మాణాలు ఒక కొలిక్కి రాలేదు. ముఖ్య మంత్రి ప్రకటించిన వైద్య కళాశాలలు మాటలకే పరిమితమయ్యాయి. ప్రభుత్వం చెప్పే మాటలు కార్యరూపం దాల్చడం అసాధ్యంగానే కనబడు తోంది. మరోవైపు జాతీయ వైద్య కమిషన్ నిబంధనలు మెడికల్ కళా శాలకు గొడ్డలి పెట్టుగా మారనున్నాయి. కనీస స్థాయిలో కూడా కసరత్తు లేని ప్రభుత్వ విధానాలు మెడికల్ కళాశాలకు భవిష్యత్తులో శాపాలుగా పరిణమించనున్నాయన్న విమర్శలున్నాయి. అయినా ఎన్నికల సభల్లో, ప్రచారాల్లో సీఎం జగన్‌తో పాటు వైసీపీ నేతలు కూడా వైద్య కళాశాలలపై ఆర్భాటపు ప్రకటనలు చేస్తున్నారు.

బాపట్ల, పిడుగురాళ్ల/ ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బాపట్ల, పిడుగురాళ్లలో వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాల, టీచింగ్ హాస్పిటల్‌కు సీఎం జగన్మోహన్‌రెడ్డి వర్చువల్‌గా ముఖ్యమంత్రి జగన్ 2021 మే 31న ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. 2023 డిసెంబరు నాటికి నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని నాడు జగన్ ప్రకటించారు. అయితే 2024 ఏప్రిల్ వచ్చినా వైద్య కళాశాల నిర్మాణాలు ఒక కొలిక్కిరాలేదు. బాపట్లలో అయితే మూడేళ్ల గడిచినా భవన నిర్మాణాలు పిల్లర్ల దశ దాటలేదు. శంకుస్థాపన అనంతరం రెండేళ్ల పాటు పనుల ఊసే పట్టించుకోలేదు. ఎన్నికల వస్తున్నాయని ఏడాది క్రితం నామమాత్రంగా పనులు ప్రారంభించారు. పిల్లర్ల దశలోనే బాపట్ల వైద్య కళాశాల నిర్మాణం ఉంది. పిడుగురాళ్లలో మెడికల్ కాలేజీ పనులు మూడు నెలలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. ఎన్నికల సమీపిస్తున్నాయని ఇటీవల ప్రజలను మభ్య పెట్టేందుకు హడావుడిగా ఓ బ్లాక్‌కు రంగులు వేసి హడావుడిగా ప్రారంభోత్సవం చేశారు. బిల్లుల చెల్లింపులో జాప్యం జరగడం కూడా కళాశాల పనులు సక్రమంగా జరగడంలేదని సమాచారం. అయినా అరకొర పనులతోనే తాము వైద్య కళాశాలలను అందుబాటులోకి తెచ్చినట్లు అదే తమ ఘనతగా చెప్పుకోవడం సీఎం జగన్‌కే చెల్లిందని ప్రతిపక్షాలతో పాటు బాపట్ల, పల్నాడు జిల్లా వాసులు విమర్శిస్తున్నారు. నిర్మాణ పనులు నత్తను తలపించే విధంగా సాగుతుంటే 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభిస్తామని ప్రచారం చేసుకోవడం అంటే ప్రజలను వంచించడమేనని ప్రతిపక్ష నేతలు అంటున్నారు.

### బాపట్ల.. బాలారిష్టాలు

బాపట్ల శివారు జమ్ములపాలెం రోడ్డులోని 50 ఎకరాల స్థలంలో వైద్య కళాశాలకు శంకుస్థాపన జరిగింది. వైద్య కళాశాల కోసం ఓ దాత 50 ఎకరాల భూమిని విరాళంగా ఇచ్చారని అప్పట్లో చెప్పారు. అందులోనే కళాశాలకు శంకుస్థాపన జరిగింది. అయితే ఆ భూమి విషయంలో అనేక ఆరోపణలు వచ్చాయి. అదంతా అసైన్డ్ భూమి అని దానిని విరాళంగా ఇవ్వడం ఏమిటనే ప్రశ్న కూడా ఉత్పన్నమైంది. అయినా దానిపై అధికారులు నోరుమెదపలేదు. ఆ తర్వాత నిధుల విషయంలో తాత్సారం జరిగింది. దీంతో మెడికల్ కళాశాల పనులు ప్రారంభం కాలేదు. సీఎం శంకుస్థాపన చేసిన తర్వాత రెండేళ్ల పాటు పనుల ఊసే మరిచారు. ఏడాది క్రిత మే పనులను మొదలుపెట్టారు. ఇలా ఎన్నో బాలారిష్టాలు మెడికల్ కళాశాల పనులను వెంటాడుతున్నప్పటికీ ప్రభుత్వం మోసపు మాటలతో కాలం వెళ్లబుచ్చుతూ అరచేతిలో వైకుంఠం చూపిస్తోందని ప్రజలు విమర్శి స్తున్నారు.

### జిల్లా కేంద్రమైనా వైద్యం అంతంతే..

బాపట్ల జిల్లా కేంద్రంగా మారింది. అయినా ఆ స్థాయిలో వైద్య సేవలు అభివృద్ధి చెందలేదు. బాపట్ల ఏరియా ఆసుపత్రిలో సరైన సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రానికి తగ్గట్లు వైద్య సేవలను మెరుగుపరిచే విషయంలో ప్రభుత్వం విఫలమైంది. అత్యవసరమైతే అటు ఒంగోలు, ఇటు గుంటూరు వెళ్లాల్సిన దుస్థితిని ప్రజానీకం ఎదుర్కొంటోంది. చాలా సందర్భాల్లో బాపట్ల ఏరియా ఆస్పత్రికి వెళ్లిన కేసుల విషయంలో సరైన సౌకర్యాలు లేవనో, నిపుణులైన డాక్టర్లు లేరనో గుంటూరు ఆస్పత్రికి రిఫర్ చేసిన సందర్భాలు కోకొల్లలు. ఈలోగా వారు ప్రాణాలు విడిచిన సందర్భాలు అనేకం.

### పిడుగురాళ్లలో హడావుడి ప్రారంభోత్సవం

పనులు పూర్తి కాలేదు కానీ పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి సమీపంలో ప్రభుత్వ వైద్య కళాశాలను వైసీపీ పాలకులు ప్రారంభించేశారు. నలభై ఏడున్నర ఎకరాల విస్తీర్ణంలో రూ.500 కోట్లతో కళాశాల, ఆస్పత్రిలను ఆరు బ్లాక్‌లలో నిర్మించాలని నిర్ణయించారు. ఈ ప్రకారం మెడికల్ కళాశాల, దానికి అనుబంధంగా ఆస్పత్రి, నర్సింగ్ కళాశాల కు మూడేళ్ల క్రితం శంకుస్థాపన చేశారు. నిధులు కొరతతో మూడు నెలలు ఆలస్యంగా పనులు ప్రారంభమయ్యాయి. ఇంకా పలు భవనాల నిర్మాణాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. భవనాలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావాలంటే మరో రెండేళ్లు సమయం పట్టేట్లు ఉంది. ఎన్నికల సమీపి స్తుండటంతో ఫిబ్రవరిలో హడావుడిగా ఓ బ్లాక్‌కు రంగులు వేసి నరసరావుపేట లోక్‌సభ అభ్యర్థి అనిల్‌కుమార్, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిలు ప్రారంభోత్సవం చేసేశారు. ప్రారంభించిన భవనాల లోపల గదుల్లో ఎటువంటి సౌకర్యాలు నేటికి ఏర్పాటు చేయలేదు. మరో రెండు నెలల్లో ఆస్పత్రిని అందు బాటులోకి తీసుకొస్తామని ఫిబ్రవరిలో చెప్పినా ఇంతవరకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంలా పనులు సాగుతున్నాయి. మెడికల్ కళాశాలపై చెప్తున్న అబద్ధపు మాటలను ఇకనైనా అధికార పార్టీ నేతలు మాను కోవాలని పల్నాడు ప్రజలు పేర్కొంటున్నారు.

### నిధులు కేంద్రానివి.. ఆర్భాటం వైసీపీది

లోక్‌సభ నియోజకవర్గాల ప్రకారం జిల్లాల విభజన జరిగింది. నూతన జిల్లాల ప్రాతిపదికగా ప్రతీ జిల్లాకో ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి జగన్ ప్రకటించి ఆ ప్రకారం శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ రంగంలో ఇన్ని మెడికల్ కళాశాల నిర్మాణం అద్భుతమని ఆయనకి ఆయనే ప్రకటించుకుంటున్నారు. అయితే వైద్య కళాశాలకు కేంద్రం సగం నిధులు ఇస్తున్న సంగతిని మాత్రం వైసీపీ పాలకులు చెప్పడం లేదు. రూ.500 కోట్లతో ఏర్పాటు చేస్తున్న వైద్య కళాశాల, అనుబంధ ఆస్పత్రిలకు రూ.250 కోట్లను కేంద్రం మంజూరు చేస్తుంది. అయితే ఆ నిధులను సక్రమంగా వినియోగించకపోవడం వల్లే బాపట్ల, పిడుగురాళ్ల కళాశాలల పనులు ఒక కొలిక్కి రాలేదని సమాచారం. బిల్లులు మంజూరులో జాప్యంతో పనులు నత్తనడకన సాగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. బాపట్లలో అయితే పిల్లర్ల దశ కూడా దాటకపోగా, పిడుగురాళ్లలో కేవలం ఇప్పటికి రూ.180 కోట్ల పనులే జరిగాయి. అంటే కేంద్రం విడుదల చేసిన పూర్తి నిధులను కూడా వ్యయం చేయకుండా వైసీపీ ప్రభుత్వం మాయ చేసిందన్న ఆరోపణలు వస్తున్నాయి. మొత్తంమీద నిధులు కేంద్రానికి కాగా ఆర్భాటం వైసీపీది అన్నట్లుగా వైద్య కళాశాలల పరిస్థితి మారిందని బీజేపీ నాయకులు విమర్శిస్తున్నారు.




● పిడుగురాళ్ల : బ్రాహ్మణపల్లి సమీపంలో నిర్మాణంలో ఉన్న భవన సముదాయాలు



హడావుడిగా ప్రారంభోత్సవానికి ఓ బ్లాక్‌కు రంగులు వేసిన బ్రాహ్మణపల్లిలోని మెడికల్ కళాశాల భవనం (పాతచిత్రం)

# రేపు చీరాలకు చంద్రబాబు



● ఊరటనిచ్చే హామీలపై చేనేతల్లో ఆశ

చీరాల, ఏప్రిల్ 29: చీరాల ప్రజలు టీడీపీ అధినేత చంద్రబాబు రాక కోసం ఎదురు చూస్తున్నారు. గతంలో రెండు మూడు పర్యాయాలు చంద్రబాబు పర్యటన ఉంటుందని భావించారు. అయితే ఆ పర్యటనలు వాయిదా పడ్డాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి అభ్యర్థుల తరఫున చంద్రబాబు ప్రజాగళం పేరుతో పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం చంద్రబాబు చీరాల పర్యటన ఖరారైంది. దీంతో నియోజవకర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ప్రచారంలో దూసుకుపోతున్న టీడీపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్యకు చంద్రబాబు పర్యటన అదనపు బలం అవుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రధానంగా నేతన్నలు తమకు ఊరటనిచ్చే హామీలు చంద్రబాబు ప్రత్యేకంగా ప్రకటించవచ్చని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వేటపాలెం మండలం నాయినిపల్లి పంచాయతీ పరిధిలో సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో టెక్స్‌టైల్ పార్కు నిర్మాణానికి గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన చర్యలు, ఆ తర్వాత కోర్టు పరిధిలోకి వెళ్లిన అంశాలపై నేతన్నల్లో చర్చ సాగుతోంది. అలాగే గతంలో సెయింట్ ఆన్స్ కళాశాల ప్రాంగణంలో చేనేత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సభలో చంద్రబాబు చీరాల ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన కుప్పడం చీరకు భౌగోళిక గుర్తింపు తెస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే ఈ రెంటింటికీ కార్యరూపం జరుగుతుందని నేతన్నలు భావిస్తున్నారు. ఆ రెండు అంశాలపై ప్రజాగళం సభలో చంద్రబాబు మరోసారి ప్రస్తావిస్తారని నేతన్నలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కొమ్మమూరు కాలువ ఆధునికీకరణపై కూడా ప్రస్తావించే అవకాశం ఉందంటున్నారు. ఇక కుందేరు, రొంపేరు ప్రక్షాళనకు చేపట్టే చర్యలపై కూడా ప్రకటన చేస్తే బాగుంటుందని శ్రేణులతో పాటు ప్రజలు భావిస్తున్నారు. అత్యధిక తీరప్రాంతం ఉన్న చీరాల మండలం వాడరేవులో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం, అందుకు సంబంధించిన అనుబంధ పరిశ్రమలపై హామీలు ఇస్తారని ఎదురుచూస్తున్నారు.

పర్యాటకంగా అభివృద్ధిలో భాగంగా ఒనగూరే ఉపాధి అవకాశాలు తదితర అంశాలను కూడా ప్రస్తావించి, స్పష్టమైన ప్రకటన చేస్తే బాగుంటుందని మత్స్యకార గ్రామాల ప్రజలతో పాటు, నియోజవకర్గ ప్రజ లు సూచిస్తున్నారు. సుదీర్ఘకాలంగా అపరిష్కృతం గా ఉన్న సమస్యల్లో ఒకటైన చీరాల మండలం ఈపూరుపాలెం పంచాయతీ పరిధిలోని ఆటోనగర్ కార్యరూపం దాల్చేందుకు ఎదురవుతున్న బాలారిష్టాలను అధిగమించేందుకు, తదుపరి చర్యలకు సంబంధించి కూడా స్పష్టత ఇస్తారని భావిస్తున్నారు.



మగ్గంపై నేత నేస్తున్న చేనేత మహిళ

# ఎన్నికల బరిలో.. 104 మంది

బాపట్ల లోక్‌సభ స్థానంలో 15 మంది పోటీ ● రేపల్లె మినహా మిగిలిన స్థానాల్లో 15 మంది

బాపట్ల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల తుది ఘట్టం ముగిసింది. నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారం సాయంత్రంతో ముగియడంతో పోటీలో ఉండే అభ్యర్థులపై స్పష్టత వచ్చింది. జిల్లా పరిధిలోని బాపట్ల లోక్‌సభ, ఆరు అసెంబ్లీ స్థానాలకు సంబంధించి గడువులోపు 19 మంది అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో మొత్తం 104 మంది బరిలో నిలిచారు. బాపట్ల లోక్‌సభ స్థానం నుంచి 15 మంది తుది పోటీలో నిలిచారు. గడువు ముగిసే సరికి బాపట్ల లోక్‌సభ స్థానం నుంచి ఇద్దరు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. వేమూరు, బాపట్ల, పర్చూరు, అద్దంకి, చీరాల అసెంబ్లీ స్థానాల్లో ఒక్కో స్థానం నుంచి 15 మంది బరిలో ఉన్నారు. రేపల్లెలో 14 మంది తుది పోటీలో నిలిచారు. ఈ నెల 18న నామినేషన్ల ఘట్టం మొదలైనప్పుడు మొత్తం 151 మంది నామినేషన్లు వేయగా, పరిశీలనలో 28 మంది నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. సోమవారం 19 మంది నామినేషన్లను ఉపసంహరించుకోగా 104 మంది తుది పోటీలో మిగిలారు. స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు. బ్యాలెట్‌లో అభ్యర్థుల పేర్లు క్రమసంఖ్యను కూడా వెల్లడించారు.

తుది బరిలో ఉండే అభ్యర్థుల సంఖ్య

| స్థానం | నామినేషన్లు | తిరస్కరణ | విత్‌డ్రా | బరిలో |
|---|---|---|---|---|
| ● బాపట్ల(లోక్‌సభ) | 20 | 3 | 2 | 15 |
| ● వేమూరు(అసెంబ్లీ) | 18 | 2 | 1 | 15 |
| ● రేపల్లె | 18 | 3 | 1 | 14 |
| ● బాపట్ల | 31 | 5 | 11 | 15 |
| ● పర్చూరు | 20 | 3 | 2 | 15 |
| ● అద్దంకి | 21 | 6 | 0 | 15 |
| ● చీరాల | 23 | 6 | 2 | 15 |
| మొత్తం | 151 | 28 | 19 | 104 |

# ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా

బాపట్ల, ఏప్రిల్ 29: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల తుది జాబితా విడుదల చేశాం. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగియటంతో బరిలో ఉండే అభ్యర్థులు ఖరారయ్యారు. ఈ పరిస్థితుల్లో పోలింగ్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.. అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 12,91,716 మంది ఓటర్లు ఉన్నారని, లోక్‌సభ, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు కలిపి మొత్తం 104 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని తెలిపారు. మే 13న జరిగే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 1510 పోలింగ్ కేంద్రాలు ఉండగా 337 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో డిస్పాచ్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. సిబ్బంది నియమాకం పూర్తి చేశామని, వారికి మొదటిదశ శిక్షణ పూర్తి కాగా మరోసారి శిక్షణ ఇస్తామన్నారు. హోమ్ ఓటింగ్ కొరకు దివ్యాంగులు, 85 ఏళ్ల దాటిన వారి నుంచి 955 దరఖాస్తులు అందాయన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో పనిచేస్తూ ఇతర జిల్లాలో ఓటు హక్కు ఉన్న వారికి బాపట్లలోనే ఓటు వేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పగటి ఉష్ణోగ్రత అధికంగా నమోదు అవుతున్నందున ఎన్నికల రోజు పోలింగ్ కేంద్రాల వద్ద షామియానాలు, తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. దివ్యాంగుల కొరకు అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద వీల్‌చైర్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.



ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా

### భద్రతా చర్యలు : ఎస్పీ వకుల్ జిందాల్

ఎన్నికలకు ముందస్తు భద్రతా చర్యలు తీసుకున్నామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించడానికి భారీ స్థాయిలో పోలీసు బలగాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నామన్నారు. ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినా, ప్రలోభాలకు గురిచేసిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.4.77 కోట్ల విలువైన వస్తువులు, మద్యం, ఆభరణాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో సి. హెచ్.సత్తిబాబు పాల్గొన్నారు.

# జిల్లా ఓటర్లు.. 12,91,716

● అద్దంకిలో అత్యధికం.. బాపట్లలో అత్యల్పం

● తాజా జాబితాలో 16,176 మంది పెరుగుదల

బాపట్ల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్ కోసం వినియోగించే తుది ఓటర్ల జాబితాను ఎన్నికల అధికారులు సోమవారం విడుదల చేశారు. జనవరి 22న ఓటర్ల తుది జాబితా విడుదల చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి కొత్తగా ఓటర్ల నమోదుతో పాటు చేర్పులు, మార్పులకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. ఇప్పటి వరకు వచ్చిన చేర్పులతో అనుబంధ ఓటర్ల జాబితాను సోమవారం విడుదల చేశారు. ఈ ప్రకారం జిల్లా ఓటర్ల సంఖ్య 12,91,716గా ఉంది. జనవరి 22న విడుదల చేసిన తుది ఓటర్ల జాబితా ప్రకారం మొత్తం ఓటర్ల సంఖ్య 12,75,540. సోమవారం విడుదల చేసిన తుది ప్రచురణలో పురుష ఓటర్ల సంఖ్య 6,29,794, మహిళా ఓటర్ల సంఖ్య 6,61,841గా ఉంది. తాజా జాబితాలోనూ అతివలే అగ్రస్థానంలో ఉన్నారు. ఈ మూడు నెలల వ్యవధిలో ఓటర్ల సంఖ్యలో 16,176 మంది పెరుగుదల నమోదైంది. సోమవారం విడుదల చేసిన ఓటర్ల జాబితాతోనే ఎన్నికలు జరగనుండడంతో రాజకీయపార్టీలన్నీ దీనిపై దృష్టిసారించాయి. బాపట్ల లోక్‌సభ పరిధిలోని సంతనూతలపాడు ఓటర్ల సంఖ్య 2,14,638గా ఉంది. దీనిని కూడా కలుపుకుంటే బాపట్ల లోక్‌సభ పరిధిలోని ఓటర్ల సంఖ్య 15,06,354గా ఉంది.

| నియోజకవర్గం | పురుషులు | మహిళలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| ● వేమూరు | 95,587 | 101855 | 16 | 1,97,458 |
| ● రేపల్లె | 1,11,240 | 1,15,979 | 13 | 2,27,232 |
| ● బాపట్ల | 92,803 | 98,112 | 10 | 1,90,925 |
| ● పర్చూరు | 1,11,865 | 1,17,462 | 6 | 2,29,333 |
| ● అద్దంకి | 1,19,570 | 1,24,475 | 12 | 2,44,057 |
| ● చీరాల | 98,729 | 1,03,958 | 24 | 2,02,711 |
| మొత్తం | 6,29,794 | 6,61,841 | 81 | 12,91,716 |

# ప్రజలను బానిసలుగా చూస్తున్న జగన్

- టీడీపీ, జనసేన నాయకుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే ఏలూరి


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఏలూరి

ఇంకొల్లు, ఏప్రిల్ 29 : ఓటు వేసిన ప్రజలను బానిసలుగా చూస్తున్న వ్యక్తి జగన్‌రెడ్డి అని, ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చని వైసీపీని ఓటుతోనే బుద్ధి చెప్పాలని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు అన్నారు. సోమవారం మండలంలోని హనుమోజీపాలెంలో టీడీపీ, జనసేన పార్టీ నాయ కులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వ ర్గాల ప్రజలను జగన్‌రెడ్డి నిలువునా మోసం చేశార న్నారు. భిన్న సిద్ధాంతాలు కలిగిన టీడీపీ, జనసేన, టీడీపీ ఒక్కటవడానికి కారణం దుర్మార్గ వైసీపీ పాలన అంతానికేనని అన్నారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి లేక పోగా, పదేళ్లు వెనుకబడ్డామన్నారు. ఇసుక నుంచి మద్యం వరకు యథేచ్ఛగా దోచుకున్నారన్నారు.

చేసేది, చెప్పేది లేక అబద్ధాల మాటలతో ఓట్లు దండుకోవాలని చూస్తున్నారన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసి, ఒక్క నీటి ప్రాజెక్టును కూడా నిర్మించలేని, కనీసం రోడ్లు కూడా మరమ్మతులు చేయలేని అసమర్థ పాలకుడు జగన్‌రెడ్డి అని అన్నారు. ఐదేళ్లు రాష్ట్ర ప్రజలతో ఆటలాడుకున్న జగన్‌రెడ్డిని ఓటుతోనే సత్తాను చాటాలని ఏలూరి విజ్ఞప్తి చేశారు. పోలవరం లాంటి పెద్ద ప్రాజెక్టును ఆపేసిన పాపం జగన్‌కు తగులుతుందన్నారు. సాగు, తాగునీరు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. రైతులను పట్టించుకోని ఏకైన వ్యక్తి జగన్ అన్నారు. అధికారం కోసం, సొంత ఖజానాలు నింపుకోవడానికీ, ప్రతిపక్షాలపై దౌర్జన్యాలు చేసేందుకు మాత్రమే జగన్‌రెడ్డి పాలన సాగిస్తున్నార న్నారు. కనీసం యువతకు ఉపాధి లేకుండా చేశారని ఏలూరి ఆందోళన వ్యక్తం చేశారు. ఐదేళ్లు కోల్పోయిన అన్నింటినీ గాడిలో పెట్టే వ్యక్తి చంద్రబాబు ఒక్కరేనన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పెదపూడి విజయకుమార్ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అందరం ఐక్యతతో ఏలూరిని అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం భీమవరంలో పాల్గొన్న ఏలూరికి పూలతో ఘనంగా స్వాగతం పలికారు. రాత్రి కొణికి, దుద్దుకూరు గ్రామాలలో ఏలూరి ప్రచారం నిర్వహించారు. కొణికిలో భారీగా బైకు ర్యాలీ నిర్వహించారు. పెద్దఎత్తున కూటమి నాయకులు, కార్యకర్తలు, ఏలూరి అభిమా నులు మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, పిల్లల బంగారు భవిష్యత్ కోసం టీడీపీ కూటమిని గెలిపించాలని ఏలూరి విజ్ఞప్తి చేశారు.

## టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

చినగంజాం : మండంలోని చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని సోపిరాల, ప్రభుదేవా కాలనీలకు చెందిన వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. సోపిరాల గ్రామానికి చెందిన చినగంజాం తోటవారి ధర్మసత్రం చైర్మన్ తుమ్మల పెంట శ్రీనివాసరావు, ప్రభుదేవా కాలనీలో వైసీపీ చెందిన 15 ఎస్టీ కుటంబాల వారు మార్టూరు మం డ లం ఇసుక దర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆధ్వర్యంలో సోమవారం టీడీపీలో చేరారు. వీరికి ఏ లూరి కండవాలు వేసి ఆహ్వానించారు. కూటమి నాయకులతో కలిసి విజయానికి కృషి చేయాలని శ్రీనివాసరావు భార్య లక్ష్మీప్రసన్నకు ఏలూరి సూచించారు.


కారంచేడులో ప్రచారం నిర్వహిస్తున్న కూటమి శ్రేణులు

## కారంచేడులో ప్రచారం

కారంచేడు(పర్చూరు) : అభివృద్ధి ప్రదాత టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు గెలపు కోసం కారంచేడులో సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రజా కూటమి నేతృత్వంలో రూపొందించిన ఎన్నికల మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ ప్రచార కార్యక్రమం చేపట్టారు. సూపర్‌సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడు తూ వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, రాష్ట్ర భవిష్యత్‌లోసం కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. యువత భవిష్యత్‌కోసం ప్రజా కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తేవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ప్రజా కూటమి శ్రేణులు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన చినగంజాం వైసీపీ నాయకులు

# రైతులకు సబ్సిడీపై పరికరాలు



కూకట్లపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న కమల్‌కిషోర్... అద్దంకిలోని 4వ వార్డులో ప్రచారం చేస్తున్న హర్షవర్ధన్

## ఇంటింటి ప్రచారంలో బాబీ

బల్లికురవ, ఏప్రిల్ 29 : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగినే గతంలో మాదిరిగానే రైతులకు పెద్ద ఎత్తున వ్యవసాయ పరికరాలను రాయితీపై అందజేస్తామని యువనేత గొట్టిపాటి కమల్‌కిషోర్ (బాబీ) తెలిపారు. మండలంలోని కూకట్లపల్లి గ్రామంలో సోమవారం టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా బాబీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయన ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తూ కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే అద్భుతమైన పథకాలతో పేదల ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. ఈసారి రైతులు, మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఏడాదికి పెట్టుబడి సాయంగా రూ.20వేలను అందజేస్తున్నట్లు చెప్పారు. దళిత రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను ఇవ్వనున్నట్లు తెలిపారు. నల్ల చెరకు పంటను ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు చేపడతామన్నారు. అభివృద్ధి పనులు చేపట్టే సత్తా ఉన్న టీడీపీ అభ్యర్థి గొట్టిపాటికి, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఇప్పల అంజిరెడ్డి, పందిరి అబ్రహం, ముంద్రు దానయ్య, రమేష్, రాఘవ పాల్గొన్నారు.

## యువత భవిష్యత్‌ను నాశనం చేసిన జగన్

అద్దంకి : వైసీపీ పాలనలో యువత బంగారు భవిష్యత్‌ను జగన్ నాశనం చేశారని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ తనయుడు గొట్టిపాటి హర్షవర్ధన్ అన్నారు. నాన్నను గెలిపించాలని కోరుతూ పట్టణంలోని 4వ వార్డులో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఏటా జాబ్ క్యాలెండర్ అని చెప్పి నిరుద్యోగులను నిలువునా ముంచేశారన్నారు. జగన్‌రెడ్డి చేతగాని పాలనతో రాష్ట్రం అధోగతిపాలైందన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో 4 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. అలాగే నిరుద్యోగులకు ఎప్పటిలాగే నిరుద్యోగ భృతిని రూ.3వేలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మాగులూరి తిరుపతమ్మ, గోపి, కాకాని అశోక్, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, ధూళిపాళ్ల రామచంద్ర ప్రసాద్, లహరి, కిరణ్, చిరుమామిళ్ల మాధవరావు, వీరాంజనేయులు, మాలిక్ పాల్గొన్నారు.

## వైసీపీకి గుడ్‌బై చెప్పిన ముక్తేశ్వరం, వైదన యువకులు

- ఎమ్మెల్యే గొట్టిపాటి సమక్షంలో టీడీపీలోకి చేరిక


గొట్టిపాటి సమక్షంలో టీడీపీలో చేరిన ముక్తేశ్వరం యువకులు

బల్లికురవ, ఏప్రిల్ 29 : ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో మండలంలోని వైదన, ముక్తేశ్వరం గ్రామాలలో వైసీపీకి షాక్ తగిలింది. రెండు గ్రామాలకు చెందిన యువకులు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో సోమవారం టీడీపీ తీర్థం పుచ్చుకొన్నారు. ముక్తేశ్వరం గ్రామానికి చెన్నూరి శివప్రసాద్ ఆధ్వర్యంలో శంకర్‌శెట్టి వెంకటకోటేశ్వరరావు, చెన్నూరి నాగార్జున, గుంటుపల్లి గోపి, జాగర్లమూడి హరీష్, నాగళ్ల మణికంఠ, బాలకృష్ణ, శేషుబాబు, పసుపులేటి మదుబాబు, గుంటుపల్లి అంకమ్మరావు, షేక్ నాగూర్‌వలి, కరీం బాషా, మాసాని అంజి పార్టీలో చేరారు. వైదన గ్రామానికి చెందిన పంచాయతీ వార్డు మెంబరు షేక్ గోపి, పావులూరి వీరాంజి, శివయ్య, బొజ్జా కోటయ్య, గంపాచిన అక్కయ్య, పొదిలి రాముడు, బండారు మల్లికార్జున, 40 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో అగ్రామ టీడీపీ నేతలు పోగుల చంద్రశేఖర్, జనసేన నేతలు పాల్గొన్నారు.

## 1వ తేదీనే పెన్షన్ పంపిణీ

చినగంజాం, ఏప్రిల్ 29 : మండల పరిధిలోని గ్రామ పంచాయతీలలో సామాజిక పెన్షన్ లబ్ధిదారులకు మే 1వ తేదీనే నగదు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో యూబీ వరప్రసాద్ సోమవారం తెలిపారు. మండల పరిధిలో గల 6066 పెన్షన్‌లకు గాను 1596 మంది పెన్షన్‌దారులకు ఇంటి వద్దనే గ్రామ సచివాలయ సిబ్బంది అందజేస్తారని తెలిపారు. మిగిలిన 4370 మంది పెన్షన్ లబ్ధిదారులకు వారి బ్యాంకు ఖాతాలకు మే 1వ తేదీన జమ చేయనున్నట్లు తెలిపారు. ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేసేవారి జాబితా సచివాలయ గ్రా కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌ల వద్ద ఉన్నట్లు తెలిపారు. దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, మంచంపై ఉన్న వారికి ఇంటి వద్దనే సచివాలయ సిబ్బంది పెన్షన్ అందజేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

## 11 మంది వలంటీర్ల రాజీనామా

మార్టూరు, ఏప్రిల్ 29 : మార్టూరు గ్రామంలోని రెండవ, మూడవ గ్రామ సచివాలయాల పరిధిలో పని చేస్తున్న 11 మంది గ్రామ వలంటీర్లు సోమవా రం తమ రాజీనామాలను ఎంపీడీవో కార్యాలయంలో అందచేశారు.

# ఒక పక్క ఉపాధి పనులు.. మరోవైపు యంత్రాలతో మట్టి తవ్వకాలు

- కలవకూరు చెరువులో రియల్ వ్యాపారుల బరితెగింపు
- యథేచ్ఛగా గ్రావెల్ తోడకం
- గ్రామస్థుల ఫిర్యాదుతో నిలిపివేసిన అధికారులు


కలవకూరు చెరువులో ఉపాధి పనులు చేస్తుండగా, మరో వైపు టిప్పర్‌కు మట్టిని ఎత్తుతున్న ఎక్స్‌కవేటర్

అద్దంకి, ఏప్రిల్ 29 : రియల్ ఎస్టేట్ వ్యాపారులు బరి తెగించి చెరువులో మట్టి తవ్వకాలు చేపట్టి వెంచర్‌లకు తరలిస్తున్నారు. మండలంలోని కలవకూరు చెరువు నుంచి గత రెండు రోజులుగా సమీపంలో ఉన్న వెంచర్‌లకు టిప్పర్‌లతో గ్రావెల్ తరలిస్తున్నారు. ఎక్కువ లోతు గుంతలు చేసి గ్రావెల్ తవ్వకాలు చేయడం ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. గతంలో కూడా చెరువులో వినాయక విగ్రహాల నిమజ్జనాలకు వెళ్లిన విద్యార్థి మునిగి మృతి చెందిన సంఘటన తెలిసిందే. ఎలాంటి అనుమతులు లేకుండా చెరువు మట్టిని యథేచ్ఛగా తరలించటం పట్ల గ్రామస్థులు సోమవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మట్టి తరలింపును నిలిపేశారు.

### ఉపాధి హామీ పనులు జరిగేచోట యంత్రాలతో

కలవకూరు చెరువులో ఉపాధి హామీ ద్వారా పనులు జరుగుతున్నాయి. కూలీలు చెరువు పనులు చేస్తున్నారు. అయితే సమీపంలోనే కొందరు యంత్రాలతో గ్రావెల్ తవ్వి తరలిస్తున్నారు. దీంతో ఉపాధికూలీలు చేసిన పనులు కూడా యంత్రాలతో జరిగాయా అన్న అనుమానాలు ఉన్నతాధికారులు వ్యక్తం చేసే అవకాశం ఉంటుందన్న ఆందోళన కూలీలలో నెలకొంది. అదే సమయంలో యంత్రాలతో చేసిన పనిని కూడా క్షేత్ర స్థాయి సిబ్బంది, అధికార పార్టీ నేతలు కుమ్మక్కై లబ్ధి పొందే అవకాశం కూడా లేకపోలేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చెరువుకు నీరు వచ్చిన వెంటనే పనులు కూడా కనిపించే అవకాశం ఉండదు కాబట్టి లబ్ధి పొందే అవకాశం కూడా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులో మట్టి తవ్వకాలు చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


బాధిత కుటుంబానికి సాయం అందిస్తున్న టీడీపీ నేతలు

## బాధిత కుటుంబానికి టీడీపీ సాయం

చినగంజాం, ఏప్రిల్ 29 : చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుదేవా కాలనీలో అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి టీడీపీ మండల నేతలు సోమవారం సాయం అందించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, మండల నాయకులు కట్టా తిరుపతమ్మ కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం, నిత్యవసర సరుకులు, చాప, దుప్పట్లు తదితర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అబ్దుల్‌కలాం అజాద్, టీ.జయరావు, రాయని ఆత్మారావు, చెరుకూరి రాఘవయ్య, సందు శ్రీనివాసరావు, బెల్లంకొండ రమేష్‌బాబు, నరహరి శ్రీనివాసరావు, గంటా చెన్నయ్య, ఎం.రామాంజనేయులు, షేక్ జిలాని, పి.సార్థసారిధి, కే.విష్ణు, బయ్యా సతీష్, ఎం.లక్ష్మయ్య, జి.నరసింహారావు, టి.చిన్నా, జి.వెంకటనారాయణ, పీ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## అనుమానితుల వివరాలు అందించండి

చీరాలటౌన్, ఏప్రిల్ 29 : అపరిచితులు మీ ప్రాంతాలలో సంచరిస్తున్న లేక అనుమానస్పద పరిస్థితులు మీ పరిసరాల్లో కనింపించిన సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించాలని టూటౌన్ సీఐ సోమశేఖర్ పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం స్టేషన్ పరిధిలోని కొత్తపేట, ప్రసాద్‌నగర్, వివేకానంద నగర్, ఆర్టీసీ కాలనీ, లక్ష్మీ శ్రీనివాస కాలనీ, ఐఎల్‌టీడీ కాలనీలలో రూట్ మార్చ్ నిర్వహించారు. అలాగే ఆయా ప్రాంతాలలోని పాత నేరస్తులకు ప్రత్యేకమైన కౌన్సెలింగ్ చేసి వాహనాలు తనిఖీలు చేశారు. సీఐ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి అన్ని విధాలుగా జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రజలకు ఏదయినా సమస్యలు తలెత్తితే సమాచారాన్ని నేరుగా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, ప్రత్యేక బలగాలు పాల్గొన్నారు.

## 54 మద్యం సీసాలు పట్టివేత

మార్టూరు, ఏప్రిల్ 29 : కొణిదెన రోడ్‌లో సోమవారం అక్రమంగా మద్యం అమ్ముతున్న కొప్పరం బాలకృష్ణ అనే వ్యక్తిని అదుపులోకి 54 మద్యం క్వార్టరు సీసాలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతనిని మద్యం సీసాలతో స్టేషన్‌కు తరలించారు.

## మేదరమెట్లలో మద్యం బాటిళ్లు స్వాధీనం

మేదరమెట్ల, ఏప్రిల్ 29 : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎస్ఈబీ అధికారులు మేదరమెట్లలో నిర్వహించిన దాడుల్లో ఒక వ్యక్తి వద్ద ఏడు మద్యం సీసాలను పట్టుకున్నారు. సోమవారం రాత్రి మేదరమెట్లకు చెందిన ఐనమిల్లి శ్రీనివాసరావు వద్ద రెండు తెలంగాణ మద్యం సీసాలు మిగిలిన ఐదు మద్యం సీసాలు ఏపీకి చెందినవి ఉన్నాయి. ఏడు ఫుల్‌బాటిళ్లు దొరికినట్లు ఎస్ఈబీ ఎస్సై వి.సైమన్ తెలిపారు.

## అమ్మ ఆశ్రమ అధ్యక్షునికి నంది పురస్కారం

మార్టూరు, ఏప్రిల్ 29 : కొణిదెన రోడ్‌లో ఉన్న అమ్మ ఆశ్రమం అధ్యక్షుడు గుంటుపల్లి చందుకు హైదరాబాద్‌లో వల్లూరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బంగారు నందితో పురస్కారాన్ని అందచేశారు. ఆదివారం రాత్రి హైదరాబాదులో రవీంద్ర భారతిలో జరిగిన ఉగాది వేడుకలలో అమ్మ ఆశ్రమం ద్వారా పేదలకు, వృద్ధులకు అన్నదానం చేస్తున్న చందు సేవలను గుర్తించి బంగారు నందిని అందచేశారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక పండితులు దైవజ్ఞ శర్మ, చిక్కడ పల్లి సీఐ సీతయ్య సినీ నటి స్నేహా చౌదరి, నటుడు మాణిక్, ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.


హైదరాబాద్‌లో చందుకు బంగారు నందితో సన్మానిస్తున్న వల్లూరి ఫౌండేషన్ సభ్యులు


ఆరికట్లవారిపాలెం ఎస్సీ కాలనీలో ప్రచారం చేస్తున్న దళిత నేతలు

## దళిత ద్రోహి జగన్‌రెడ్డి

- పథకాల రద్దుతో దూరమైన విద్య
- చిత్తుగా ఓడించాలని ఎస్సీ నేతల పిలుపు

పంగులూరు, ఏప్రిల్ 29 : వైసీపీ ఐదేళ్ల పాలనలో దళిత విద్యార్థుల విద్యావకాశాలను దూరంచేసిన ద్రోహి జగన్‌రెడ్డి అని టీడీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వరపర్ల సుబ్బారావు అన్నారు. మండలంలోని ఆరికట్లవారిపాలెం, జనకవరం గ్రామాలలో ఎస్సీ సెల్ ప్రతినిధులు టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని సోమవారం ఎస్సీకాలనీలో ప్రచారం నిర్వహించారు. కాలనీలో 1, 2 తరగతులను అంగన్‌వాడీలతో విలీనం చేసి ప్రాథమిక పాఠశాలలను రద్దు చేశారన్నారు. జీవో 107ని విడుదల చేసి ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో కన్వీనర్ కోటా తీసుకురావడం ద్వారా ఎస్సీలకు రిజర్వేషన్ లేకుండా చేసిన వ్యక్తి జగన్‌రెడ్డి అన్నారు. దీంతో 1088 మెడికల్ సీట్లను దళిత విద్యార్థులు కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. జీవో 707తో ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ కళాశాలల్లో ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంసీఏ, ఎంబీఏ కోర్సులకు రీయింబర్స్‌మెంట్‌ను రద్దు చేశారని ధ్వజమెత్తారు. అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌ను మూసివేసి విద్యకు దూరం చేసిన జగన్‌రెడ్డిని ఎస్సీలంతా చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మందా ఆమోస్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఉన్నం రవిబాబు, అమర్తపూడి చిన్న, తెలగతోటి రాధాకృష్ణమూర్తి, కొలకలూరి వెంకటరావు, దయాశేఖర్, కొమ్ము పేతురు, ధనరాజుపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



# బాబు సభను జయప్రదం చేయాలి

- టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య


భూమి పూజ చేస్తున్న టీడీపీ కూటమి అభ్యర్థి కొండయ్య తదితరులు

చీరాల, ఏప్రిల్ 29 : టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటనను జయప్రదం చేయాలని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య విజ్ఞప్తి చేశారు. 216 జాతీయ రహదారి పక్కనున్న టీడీపీ కార్యాలయం పక్కనున్న ఖాళీ స్థలంలో చంద్రబాబు సభకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, బాపట్ల పార్లమెంట్ నియోజకర్గ పరిధిలోని మిగిలిన ఆరు నియోజవకర్గాల బాధ్యులు, శ్రేణులతో సభ జయప్రదంకు సహకరించాలని కొండ య్య కోరారు. పార్టీ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్, పక్కన బహిరంగ సభ వేదిక, ఇతర ఏర్పాట్లకు సంబంధించి సోమవారం కొండయ్య, టీడీపీ బాపట్ల పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు డాక్టర్ బాచిన చెంచుగరటయ్య, బాపట్ల పార్లమెంట్ నియోజకర్గ అధ్యక్షుడు సలగల రాజశేఖర్‌బాబుతో కలసి వేదపండితుల పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ బుధవారం చీరాలలో జరిగే చంద్రబాబు సభను జయప్రదం చేసేందుకు కూటమి శ్రేణులు విస్తృతంగా సంయమనంతో జయప్రదం చేసేందుకు కదం తొక్కాలన్నారు. రాష్ట్రంలో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ అమలుతో అన్ని వర్గాల ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. జనం ఆస్తిపై జగన్ కన్ను పడిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ జగన్ అనే కంతకుడి నుంచి రాష్ట్ర విముక్తికి కార్యోన్ముఖులవుతున్నారన్నారు. భావసారూప్యం ఉన్న ప్రతి ఒక్కరినీ కలుపుకుని ముందుకుపోతూ జగన్ అండ్ కోను సాగనంపే క్రమంలో శ్రేణుల్లో నూతనోత్సాహం నింపేందుకు, దిశానిర్దేశం చేసేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు వస్తున్నారన్నారు. చంద్రబాబు సభను జయప్రదం చేయటం ద్వారా కూటమి శ్రేణుల సత్తా చాటాలని పిలుపునిచ్చారు. బుధవారం మధ్యాన్నం 3 గంటలకు చంద్రబాబు సభా స్థలానికి చేరుకుంటారన్నారు. ప్రతి కార్యకర్త క్రమ శిక్షణగల సైనికునిగా అడుగులు వేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసే, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గెలుపు మనదే.. అయినా నిర్లక్ష్యం వద్దు


ప్రచారం నిర్వహిస్తున్న గౌరీఅమర్‌నాథ్

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 29 : చీరాల నియోజకవర్గంలో గెలుపు టీడీపీ కూటమిదేనని, అయినా నిర్లక్ష్యం వహించకుండా ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య విజయం కోసం అందరూ శ్రమించాలని కొండయ్య కుమారుడు గౌరీఅమర్‌నాథ్ కోరారు. మండలంలోని రామన్నపేట పంచాయతీ రావూరిపేటలో సోమవారం నాయకులు, కార్యకర్తలతో కలసి గౌరీ అమర్‌నాథ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్ వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. వచ్చేది టీడీపీ కూటమి ప్రభుత్వమని, అన్ని సమస్యలను పరిష్కరించడంతోపాటు అర్హులందరికీ పథకాలను అందిస్తామన్నారు. అందరి బాగుకోసం కూటమి ఎమ్మెల్యేగా కొండయ్యను, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. బుధవారం చంద్రబాబు సభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు పొగడదండ రవికుమార్, నాసిక వీరభద్రయ్య, కోటయ్య, వెంకటేశ్వర్లు, కర్ణ శ్రీనివాస్, గుత్తి కుమార్, శ్రీనివాసరావు, అయ్యప్ప, సుబ్రమణ్యం, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

## ఓటర్ స్లిప్‌ల పంపిణీపై బీఎల్వోలకు సూచన

మార్టూరు, ఏప్రిల్ 29 : మే 13న జరిగే పోలింగ్ రోజు ఓటు హక్కును వినియోగించుకునే ఓటర్లకు ఓటర్ స్లిప్పుల పంపిణీపై బీఎల్వోలకు ఏఈఆర్వో సంధ్యశ్రీ పలు సూచనలు చేశారు. సోమవారం మార్టూరులో మండలంలోని 72 మంది బీఎల్వోలతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో వారికి స్లిప్‌ల పంపిణీపై పలు సూచనలను, మార్గదర్శకాలను ఏఈఆర్వో అందించారు.



ముప్పగంగవరంలో మాట్లాడుతున్న గొట్టిపాటి రవికుమార్

## ప్రజాసేవకే గొట్టిపాటి కుటుంబం అంకితం

కురిచేడు, ఏప్రిల్ 29: గొట్టిపాటి కుటుంబం మాట ఇస్తే కట్టుబడి ఉంటుందని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మాట తప్పే గుణం తమ రక్తంలోనే లేదని చెప్పారు. సార్వత్రిక ఎన్నికలలో భాగంగా సోమవారం దర్శి నియోజకవర్గ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కురిచేడు మండలం ఆవులమంద పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమెకు మద్దతుగా రవికుమార్ ముప్పగంగవరం గ్రామంలో లక్ష్మితో కలసి ప్రచారంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ తాము ప్రజాసేవకే అంకితమయ్యామన్నారు. దర్శిని అభివృద్ధి చేసి చూపిస్తామని చెప్పారు. మా బిడ్డను మీ వద్దకు పంపామని, ఆదరించి అభిమానం చూపాలని కోరారు. వచ్చేది మన ప్రభుత్వమేనని, దర్శి అభివృద్ధికి కావలసిన సౌకర్యాలను కల్పించుకుందామన్నారు. ముఖ్యంగా సాగు, తాగు నీరులేక అనేక మంది ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వారి కష్టాలు త్వరలో గట్టెక్కుతాయన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కార్యకర్తలందరూ ఏకమై కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. రామాంజనేయ కాలనీ, నాంచారపురం, ప్రతిజ్ఞాపురం, ముప్పగంగవరం, కొత్తూరు, ఆవులమంద గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పిడతల పెమిలయ్య, గొట్టిపాటి వెంకటేశ్వర్లు, కాట్రాజు నాగరాజు, గొట్టిపాటి అజయ్, కిలారి పెద్ద కొండయ్య, మొఘల్ మస్తాన్ వలి, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన నామినేషన్‌ల ఉపసంహరణ

● పర్చూరు బరిలో 15 మంది

పర్చూరు, ఏప్రిల్ 29: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్‌ల ఉపసంహరణ ప్రక్రియ సోమవారంతో ముగిసింది. పర్చూరు అసెంబ్లీ బరిలో పోటీ చేసేందుకు 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. మొత్తం 20 మంది అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేయగా అందులో ముగ్గురు అభ్యర్థులు సరైన పత్రాలు జతచేయకపోవడంతో పరిశీలనలో తిరస్కరణకు గురయ్యారు. మిగిలిన 17 మంది అభ్యర్థుల్లో ఇద్దరు నామినేషన్‌లను ఉపసంహరించుకొని పోటీ నుంచి తప్పుకున్నారు. దీంతో మిగిలిన అభ్యర్థులకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గుర్తులను కేటాయించి ఎన్నికల కమిషన్ ఆమోదం కోసం అధికారులు పంపారు. గుర్తింపు పొందిన రిజిస్ట్రేషన్ పార్టీల అభ్యర్థుల పేర్లలో తెలుగు అక్షరములను ప్రామాణికంగా తీసుకొని గుర్తులను వరుస క్రమంలో కేటాయించినట్లు అధికారులు పేర్కొన్నారు. పర్చూరు నియోజకవర్గ బరిలో జనసేన పార్టీ అభ్యర్థి పోటీలో లేకపోవడంతో జాతీయ సమ సమాజ పార్టీ అభ్యర్థి చిమటా రాంబాబుకు వరుస క్రమంలో గ్లాసు గుర్తు రావడంతో అధికారులు కేటాయించారు. దీనిపై కొంత చర్చానీయాంశంగా మారింది. సంబంధిత పార్టీ అభ్యర్థులు పోటీలో లేని చోట గుర్తులను కేటాయించవచ్చు అన్న విషయం కమిషనర్ జారీ చేసిన నిబంధనల్లో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. దీనికి సంబంధించి పూర్తి అనుమతికోసం ఎన్నిల కమిషన్‌కు అధికారులు నివేదిక పంపినట్లు తెలిసింది.

### అద్దంకి బరిలో 15 మంది

అద్దంకి, ఏప్రిల్ 29 :అద్దంకి అసెంబ్లీ బరిలో 15 మంది అభ్యర్థులు తల పడనున్నారు. సోమవారం నామినేషన్‌ల ఉపసంహరణ గడువు ముగియగా ఏఒక్క అభ్యర్థి ఉపసంహరించుకోకుండా పోటీలో ఉండటంతో 15 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. కాంగ్రెస్ పార్టీ నుంచి అడుసుమల్లి కిషోర్‌బాబు, టీడీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, వైసీపీ తరపున పాణెం చినహనిమిరెడ్డి, బహుజన్ సమాజ్ పార్టీ తరపున మందా జోషఫ్, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరపున కందుల యాకోబు, నవోదయం పార్టీ తరపున గుంటుపల్లి గోపి, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున గుమ్మా సదాశివరావు, జైభీమ్‌రావ్ భారత్ పార్టీ తరపున పులిపాటి హేబేలు, భారత చైతన్య యువజన పార్టీ తరపున మీసాల సామ్రాజ్యం, జాతీయ సమ సమాజం పార్టీ తరపున బాచిన రాంబాబు, ఇండిపెండెంట్‌లుగా అట్లా చినవెంకటరెడ్డి, దూపాటి ఏసోబు, సురభి ప్రభుదాసు, మందా శ్రీనివాసరావు, గొల్లపాటి వెంకటాచారి పోటీ చేస్తున్నారు.

### సమసమాజం పార్టీకి గ్లాస్ టంబ్లర్ గుర్తు

అద్దంకి, ఏప్రిల్ 29 : అద్దంకి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థులుగా బరిలో నిలిచిన అభ్యర్థులకు సోమవారం గుర్తులు కేటాయించారు. అయితే జనసేన పార్టీ ఎన్నికల గుర్తుగా ఉన్న గాజు గ్లాసు ను పోలిన విధంగా ఉండే గ్లాస్ టంబ్లర్ గుర్తును జాతీయ సమ సమాజం పార్టీ అభ్యర్థి బాచిన రాంబాబుకి కేటాయించారు. పొత్తులో భాగంగా అద్దంకి నుంచి టీడీపీ తరపున గొట్టిపాటి రవికుమార్ పోటీ చేస్తుండగా, జనసేన అభ్యర్థి లేరు. అయితే జాతీయ సమ సమాజం పార్టీ అభ్యర్థికి గ్లాస్ టంబ్లర్ గుర్తు కేటాయించడంతో నిరక్షరాస్యులైన ఓటర్లు ఒకింత తడబాటుకు గురయ్యే అవకాశం ఉందని పలువురు అభి ప్రాయ పడుతున్నారు.

### చీరాల నియోజకవర్గ ఎన్నికల బరిలో 15 మంది

చీరాల, ఏప్రిల్ 29 : చీరాల నియోజకవర్గ ఎన్నికల బరిలో 15 మంది ఉన్నట్లు ఈఆర్వో సూర్యనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ అనంతరం బరిలో 15 మంది నిలిచారు. మొత్తం 23 మందికి గాను 39 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. స్క్రూటీని అనంతరం 23 మందికి గాను 17 మంది మిగిలారు. అందులో ఇద్దరు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో మిగిలిన 15 మంది బరిలో ఉన్నారు.

### మహిళా ఓటర్లే కీలకం

నియోజకవర్గాలవారీగా ఓటర్ల తుది జాబితాను సోమవారం విడుదల చేశారు. చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. దీంతో వచ్చే ఎన్నికల్లో మహిళా ఓటర్లు కీలకం కానున్నారు. చీరాల నియోజకవర్గంలో మొత్తం 2,02,711 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషలు 98,729 మంది, మహిళలు 1,03,958 మంది, థర్డ్ జండర్ 24 మంది ఉన్నారు. పర్చూరు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,29,333 మంది ఉన్నారు. అందులో పురుషులు 1,11,865 మంది, మహిళలు 1,17,462 మంది, థర్డ్ జెండర్ 6గురు ఉన్నారు. దీంతో రెండు నియోజకవర్గాల్లోను మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. వారే కీలకం కానున్నారు.



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న అయ్యప్ప

## ఎన్నికలకు కట్టుదిట్టమైన చర్యలు

బల్లికురవ, ఏప్రిల్ 29 : ఎన్నికలు ప్రశాంగా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని ఎక్కడా ఘర్షణలకు తావులేకుండా ముందస్తుగా పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశామని బాపట్ల జిల్లా పోలీసు ఎన్నికల పరిశీలకులు ఐపీఎస్ ఎంఏ అయప్ప తెలిపారు. సోమవారం బల్లికురవ మండలంలోని ప్యాక్షన్ గ్రామం వేమవరంలో ఆయన పర్యటించారు. పోలింగ్ బూత్‌లను తనిఖీ చేసి ఎన్నికల రోజు బందోబస్తు ఎలా నిర్వహించాలో సిబ్బదికి సూచించారు. అనంతరం కూకట్లపల్లి గ్రామంలో పర్యటించారు. అతి సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉందని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు రాజకీయపార్టీ నాయకులు, ప్రజలు సహకరించానలి కోరారు. ఆయనవెంట సంతమాగులూరు సర్కిల్ సీఐ నరసింహారావు ఉన్నారు.

# మద్యం మాయం

రేషన్ మాటున పక్కదారి

అధికారపార్టీకి మాత్రమే సరఫరా

ప్రభుత్వ దుకాణాలు, బార్ల నుంచి తరలింపు

50 మందికిపైగా మద్యం దుకాణాల సిబ్బందిపై కేసులు నమోదు

దర్శిలో వైసీపీకి చెందిన వారి వద్ద 240 కేసుల మద్యం స్వాధీనం

మంత్రి ఇలాకాలో గోవా మద్యం

తాజాగా ఎర్రగుడిపాడులో డంప్

చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

**● దర్శి నియోజకవర్గం ముడ్లమూరు మండలంలో వైసీపీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నామినేషన్‌కు ముందు రోజు భారీ మద్యం డంప్ దొరికింది. 240 బాటిళ్లు మద్యం సీజ్ చేశారు. ఏకంగా వైసీపీ నాయకుల ఇళ్లలో ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి తరలించిన మద్యాన్ని నిల్వచేశారు. దీనిపై ఆయా దుకాణాల సిబ్బందిపై కేసు నమోదైంది.**

**● ఒంగోలులో అధికారపార్టీ వారికి ఐదారు బార్ల నుంచి మద్యం సరఫరా చేస్తున్నారని ఎస్ఈబీ అధికారులకు సమాచారం అందింది. నోటిఫికేషన్ ముందుగానే రూ.6కోట్లకుపైగా బార్ల యజమానులకు అడ్వాన్స్ ఇచ్చినట్లు సమాచారం. దీంతో నిత్యం పెట్టెలకొద్దీ మద్యం మధ్యాహ్నం సమయంలో డివిజన్లకు, గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. అలాగే తీరప్రాంతంలో ఒకచోట, నగరంలోని శివారులో ఒకచోట భారీ డంప్‌లు పెట్టినట్లు ఎస్ఈబీకి సమాచారం అందింది.**

**● మంత్రి నాగార్జున పోటీ చేస్తున్న సంతనూతలపాడు నియోజకవర్గంలో గోవా మద్యం ఏరులై పారుతోంది. ఎర్రగుడిపాడులోని ఓ వైసీపీ నాయకుని ఆవుల ఫాం షెడ్‌లో 1000కిపైగా బాటిళ్లు మద్యం దొరకడమే ఇందుకు నిదర్శనం. ఇంకా నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో ఇలాంటి నిల్వలు ఉండే అవకాశం ఉందని అధికార యంత్రాంగం భావిస్తోంది.**

**● జిల్లాలో అధికారపార్టీ నేతలు జనాన్ని మందులో ముంచెత్తుతున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలకు రేషన్ పెట్టి సామాన్యులకు, మిగతా పార్టీల వారికి మద్యం దొరకకుండా చేస్తున్నారు. తమ అడ్డాలకు మాత్రం దొడ్డిదారిన కేసులకొద్దీ తరలించేస్తున్నారు. మరోవైపు బార్లలో కూడా తమకే మద్యం ఇవ్వాలంటూ బెదిరించి తీసుకెళ్తున్నారు. మాట వినకుంటే సీజ్ చేయిస్తున్నారు. అదీ చాలదన్నట్లు కొందరు ఏకంగా గోవా, కర్ణాటక రాష్ట్రాల నుంచి అక్రమ మార్గాలలో యథేచ్ఛగా మద్యాన్ని తీసుకొచ్చి వైసీపీ నేతల ఇళ్లు, షెడ్డులలో దాచిపెడుతున్నారు. వైసీపీ వారి కారణంగా మద్యం దొరక్క మందుబాబులు అల్లాడుతున్నారు.**





ముండ్లమూరులో పట్టుబడిన మద్యం కేసులు (ఫైల్)

ఒంగోలు(క్రైం), ఏప్రిల్ 29 : అధికార పార్టీ ఎన్నికలలో మద్యాన్ని ఏరులై పారిస్తోంది. మంత్రి మేరుగ నాగార్జున పోటీ చేస్తున్న సంతనూతలపాడు నియోజకవర్గంలోని చీమకుర్తి మండలం ఎర్రగుడిపాడులో గోవా మద్యం 1001 బాటిళ్లు దొరకడం అందుకు ఉదాహరణ. పైగా ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్ల నుంచి తమకు ఉన్న అధికార బలంతో మద్యం బాటిళ్లను కేసులకొద్దీ తరలించుకుపోతున్నారు. అదీ చాలదన్నట్లు అక్రమ మార్గాల ద్వారా గోవా, కర్ణాటక మద్యాన్ని గ్రామాలకు చేరవేస్తున్నారు. డంప్‌లు పెడుతున్నారు. జిల్లా సరిహద్దులలో 18 చెక్‌పోస్టులు ఉన్నాయి. అయినా నేరుగా గ్రామాలలోకి గోవా మద్యం చేరవేయడం అధికారపక్షం బరితెగింపు అని చెప్పవచ్చు. ఎన్నికల కమిషన్, అధికార యంత్రాంగం చెబుతున్నట్లు కట్టుదిట్టంగా ఏర్పాటు చేసిన పదులకొద్దీ చెక్‌పోస్టులను దాటి మద్యం బాటిళ్లను జిల్లాలోకి తెచ్చారంటే ఆశ్చర్యం కలిగించే అంశంగా చెప్పవచ్చు. దీనిని బట్టి ఆ చెక్‌పోస్టులు ఏ స్థాయిలో పనిచేస్తున్నాయో అర్థమవుతోంది. కేవలం సామాన్యుల వాహనాలను ఆపి అణువణువు తనిఖీ చేయడం, కొద్దిపాటి డబ్బులు, ఇతర విలువైన వస్తువులు ఉన్నా స్వాధీనం చేసుకోవడం లాంటివి చేస్తున్నారు తప్పా అధికారపార్టీ వారి వాహనాలైతే చూసీచూడనట్లు వదిలేస్తున్నట్లు పరిస్థితి తయారైందని తెలుస్తోంది. ప్రస్తుతం ఎన్నికల నిబంధనల ప్రకారం మద్యం రేషన్ పెట్టడంతో భారీగా డిమాండ్ పెరిగింది. దీంతో సామాన్య మందు బాబులకు, ఇతర పార్టీల వారికి మద్యం దొరకని పరిస్థితి. బార్లకు వెళ్లి అధిక ధరకు కొనలేని పరిస్థితి. మద్యం దుకాణాల నుంచి బెల్ట్‌షాపులు, వైసీపీ నాయకులకు మద్యం సరఫరా చేస్తున్న 50మందికిపైగా సిబ్బందిపై కేసులు నమోదు చేయడం చూస్తే ప్రభుత్వ మద్యం దుకాణాలు వైసీపీకి మద్యం సరఫరా బాగా జరుగుతుందని అర్థమవుతుంది. ఒంగోలు నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి కొత్తపట్నం మండలంలో ఉన్న గ్రామాల్లో భారీగా మద్యం నిల్వలు ఉంచినట్లు పోలీసు అధికారులకు సమాచారం వచ్చింది. దీనిపై విచారణ చేపట్టిన అధికారులకు కీలకమైన ఆధారాలు లభించకపోవడంతో వెనుదిరిగారు. ఇలా ఎన్నికలను మద్యంతో ముంచెత్తడానికి ప్రయత్నం చేస్తున్నారు అధికారపక్షం అభ్యర్థులు.

### మంత్రి ఇలాకాలో గోవా మద్యం

మంత్రి మేరుగ నాగార్జున పోటీ చేస్తున్న సంతనూతలపాడు నియోజకవర్గంలో చీమకుర్తి మండలం ఎర్రగుడిపాడులో వైసీపీ మండల నాయకులు గోవా మద్యం గ్రామాలకు సరఫరా చేస్తుండగా ఎస్ఈబీ అధికారులు దాడిచేసి పట్టుకున్నారు. 1001 బాటిళ్లు గోనెసంచులలో పెట్టి ఆయా గ్రామాలకు సరఫరా చేసేందుకు సిద్ధమయ్యారు. జిల్లాకు గతంలో గోవా, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి కంటైనర్ల ద్వారా మద్యం దిగుమతి అయిన సందర్భాలు ఉన్నాయి. కాగా ఇతర రాష్ట్రాల మద్యం డంపు దొరకడం కలకలం రేగింది. అదీ 25 పెట్టెల మద్యం కావడం గమనార్హం. పైగా చీమకుర్తి మండల వైసీపీ నేతలు ఇందులో కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై లోతుగా విచారణ చేస్తే ఆ నియోజకవర్గంలో మరిన్ని అక్రమ నిల్వలు బయటపడే అవకాశం ఉంది. గోవా మద్యం ఇక్కడకు ఎలా వచ్చింది అనే అంశంపై దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

### స్టాక్ పాయింట్ నుంచే అధికార పార్టీకి మద్యం

పదిరోజుల క్రితం ప్రభుత్వం దుకాణాల నుంచి మద్యాన్ని దర్శి నియోజకవర్గం ముండ్లమూరు మండలంలో మూడు దుకాణాల నుంచి తరలించి మద్యం అక్రమంగా నిల్వ ఉంచారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు, ఎస్ఈబీ అధికారులు దాడి చేసి 240 పెట్టెలు అంటే సుమారుగా రూ.20లక్షలు పైచిలుకు విలువైన సరుకును స్వాధీనం చేసుకున్నారు. అందుకు సంబంధించి వైసీపి నాయకులు, మద్యం దుకాణాలలో పనిచేసే సిబ్బందిపై కేసులు నమోదు చేశారు. కాగామద్యం స్టాక్ పాయింటు నుంచి మద్యం దుకాణం కోసమని తెచ్చి నేరుగా వైసీపీ నాయకుల ఇళ్లకు తరలించినట్లు చెబుతున్నారు. ఇలా జిల్లావ్యాప్తంగా మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. అందుకు కారణం ప్రభుత్వ మద్యం దుకాణాలలో పనిచేసే సిబ్బంది అంతా వైసీపీ సానుభూతి పరులే. వైసీపీ నాయకులు స్వయంగా నియమించిన వారు. అలాగే ఎక్సైజ్ శాఖ అధికారులు కూడా అధికారపార్టీ సేవలో మునిగితేలుతున్నారు. వారికి ఎంత స్టాక్ కావాలంటే అంత పంపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సాధారణ దుకాణాల్లో స్టాక్ అమ్ముడుపోయినట్లు చూసి ఆ సరుకును దొడ్డిదారిన వైసీపీ నేతల అడ్డాలకు చేర్పుతున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తరువాత ఇలా సరుకును తరలిస్తు సుమారుగా 50మంది సిబ్బంది ఎస్ఈబీ అధికారుల దొరికిపోవడంతో కేసులు నమోదు చేశారు.

### బార్ల నుంచి మద్యం

నిత్యం బార్ల నుంచి మద్యం అధికారపార్టీ వారికి సరఫరా చేయడం చర్చనీయంశంగా మారింది. ఈ మేరకు దర్శిలో ఇప్పటికే ఒక బారును అధికారులు సీజ్ చేసిన విషయం విదితమే. ఒంగోలులో కూడా బార్ల నుంచి రోజు ఒక్కో బారు నుంచి పది పెట్టెల మద్యం అధికార పార్టీ వారికి సరఫరా చేస్తున్నట్లు సమాచారం. అంతే కాదు అందుకు సంబంధించి అడ్వాన్స్‌గా కోట్లు చెల్లించారని అంటున్నారు. బార్ల నుంచి ఒక్క బాటిల్ మద్యం కూడా బయటకు విక్రయించకూడదు. అయితే రోజు మద్యం దుకాణాలను రేషన్ కారణంగా మధ్యాహ్నానికే మూసివేయడంతో బార్లలో జోరుగా విక్రయాలు జరుగుతున్నాయి. చీటీలు రాసిస్తే మద్యం ఇవ్వడం పరిపాటిగా మారింది. కొత్తపట్నం మండలంలో చివరగా ఉన్న ఒక కీలక గ్రామంలో భారీగా మద్యం నిల్వలు ఉంచినట్లు అధికారులకు సమాచారం రావడంతో వారంరోజుల క్రితం విచారణ చేశారు. అయితే పక్కాగా నిల్వలు సమాచారం లేదని వెనుతిరిగి వెళ్లారు.

# ఏలూరి బలాన్ని పెంచిన సేవలు

దళిత, బలహీన వర్గాల్లో

ఆదరణ పెరగటానికి అదే కారణం

క్రిందిస్థాయిలో పట్టున్న నేతగా

ప్రచారంలో స్పష్టంగా కనపడుతున్న వైనం

స్వచ్ఛందంగా మద్దతు ప్రకటిస్తున్న వర్గాల ప్రజలు



సైకిల్‌పై ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ఏలూరిసాంబశివరావు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

రాజకీయాలకతీతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించినా, కష్టసుఖాల్లో వారికి అండగా నిలిచినా సాధారణ ప్రజల అభిమానాన్ని చూరగొనటం సాధ్యమని నిరూపితమైంది. అందుకు పర్చూరు నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి ఏలూరి సాంబశివరావుకు లభిస్తున్న ఆదరణను ఉదాహరణగా చెప్పుకోవచ్చు. రాజకీయ ఆరంగేట్రం నుంచి ఇప్పటి దాకా ఆయన నిర్వహించిన సేవా కార్యక్రమాలు ప్రధానంగా వైద్యసేవలు, పార్టీలకు, కుల మతాలకు అతీతంగా కొనసాగించిన మానవ సంబంధాలు ఆయనకు ఎన్నికల సమయంలో తోడ్పడుతున్నాయి. అందుకు ఆయా ప్రాంతాల్లో ముఖ్యంగా బడుగు, బలహీన, మైనార్టీలు నివసించే ప్రాంతాల్లో లభిస్తున్న ఆదరణ నిదర్శంగా చెప్పవచ్చు.

### పాదయాత్రతోనే ప్రజల్లోనే..

పర్చూరు నియోజకవర్గంలో రాజకీయ ఆరంగేట్రం చేయగానే నియోజకవర్గంలో సాంబశివరావు పాదయాత్ర నిర్వహించారు. నియోజకవర్గంల్లోని 112 గ్రామాలను చుట్టేస్తూ పాదయాత్ర నిర్వహించారు. 31 రోజులు జరిగిన పాదయాత్రలో రేయింబవళ్లు ప్రజలతోనే ఉండిపోయారు. అన్ని గ్రామాల్లోని మౌలిక సమస్యలు అధ్యయనం చేయటంతో పాటు ప్రజల జీవన విధానాలపైన సమీక్ష చేశారు. రాజకీయంగా పెత్తనం చేసే నాయకులు ఉన్న ప్రాంతాలకే కాక దళిత, బడుగు, బలహీనవర్గాలు, మైనార్టీలు గిరిజనులు, మత్స్యకారులు నివసించే ప్రాంతాలకు ప్రత్యేకంగా వెళ్లి వారితో మమేకమయ్యారు. మౌలిక సమస్యలను గుర్తించటమే కాక ఆయా వర్గాల ప్రజల జీవన ప్రయాణంపైన అధ్యాయనం చేశారు. కనీస విద్యా, వైద్య సౌకర్యాలు అందుబాటులో లేక ఆయా వర్గాల ప్రజలు పడుతున్న ఇబ్బందులు గుర్తించారు. కొద్దికాలంకే ఆయన తండ్రి నాగేశ్వరరావు పేరుతో ట్రస్టు ఏర్పాటు చేశారు. ట్రస్టు ద్వారా కంటి వైద్య శిబిరాలతో పాటు మెగా వైద్యశిబిరాలు నిర్వహించారు. ఆరంభం నుంచి ఇప్పటివరకు ప్రతినెల వైద్య శిబిరాలు నిర్వహిస్తునే ఉన్నారు. వేలాది మందికి కంటి ఆపరేషన్లు ఉచితంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. ప్రముఖ వైద్యులతో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాల్లో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి చేయూతనిచ్చి ప్రత్యేక చికిత్సలు చేయించారు. మోకాలి నొప్పులతో బాధపడుతున్న వారిని గుర్తించి శస్త్రచికిత్సలను ఉచితంగా చేయించారు. సాధారణ జబ్బుకు మెగా వైద్యశిబిరాల్లో చికిత్సలు చేయించటంతో పాటు మందులు ఇప్పించారు. ఈ వైద్య శిబిరాల ద్వారా చికిత్సలు పొందిన లేక ఏలూరి ద్వారా చేయూతనందుకున్న వారు గ్రామగ్రామాన ఉన్నారు. ప్రధానంగా ఇలాంటి శిబిరాలకు పేద ప్రజలే అధికంగా వస్తారనేది జగమెరిగిన సత్యం. ఇక ఆరంభం నుండే ఆయన ఒక పనిగా దళితవాడలకు వెళ్లటం అక్కడ ప్రజలతో మమేకం కావటం చాపకింద నీరులా సాగించారు. చర్చిల అభివృద్ధి నిర్మాణాలకు చేయూతనివ్వటమే కాక దళిత విద్యార్థులకు ప్రాథమిక విద్యలో అవసరమైన పుస్తకాలు ఉచితంగా అందించారు. విద్యాధికులైన దళిత, బలహీనవర్గాల వారికి ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వపరంగా ఆయావర్గాల ప్రజల నివాసిత ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చారు. ఇక ఆయన ఎక్కడున్నా తన కార్యాలయంలో ఆయా వర్గాల ప్రజల సమస్యలను చెబితే వెంటనే రంగంలోకి వెళ్లి పరిష్కరించే వ్యవస్థను కొనసాగించారు. వీటన్నింటి ఫలితమే కాబోలు ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలో ఆయన వైసీపీకి బలమైన కాలనీల్లో కూడా ప్రత్యేక ఆదరణ లభిస్తుంది. గత రెండు రోజుల్లోనే దళిత, బలహీన, మైనార్టీ వర్గాలకు చెందిన పలువురు టీడీపీలో చేరారు. వివిధకారణాలతో వారికి పదవులు లేకపోవచ్చు కానీ వారి ప్రాంతాల్లో పట్టున్న వ్యక్తులు ఆయనకు మద్దతు తెలిపారు. సోమవారం అయితే మైనార్టీ, ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన పలు గ్రామాల వారు మార్టూరులో ఏలూరిని కలిసి పార్టీలకతీతంగా మద్దతు ప్రకటించటం విశేషం. దీంతో వైసీపీ నాయకులు కంగుతింటున్నారు. తమకు పూర్తి ఆధిపత్యం ఉందనుకుంటున్న వర్గాల ప్రజలు నివసించే ప్రాంతాల్లో ఏలూరికి స్వాగతం పలకటం బహిరంగంగా మద్దతు ప్రకటించటం వారు జీర్ణించుకోలేకపోతున్నారు.

# టీడీపీలో చేరికల ఊపు

వైసీపీకి పట్టున్న సామాజిక వర్గాల నుంచి

అధిక సంఖ్యలో బయటకొస్తున్న నేతలు, కార్యకర్తలు



ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరుతున్న రామాయపాలెం మాజీ సర్పంచ్ కుమారుడు, వైసీపీ నేత వేములపాటి రాజశేఖరరెడ్డి, ఇతర వైసీపీ నేతలు

అద్దంకి, ఏప్రిల్ 29 : నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు జోరందుకున్నాయి. నెలరోజుల క్రితం అన్ని మండలాల నుంచి మండల స్థాయి నేతలతో పాటు గ్రామ స్థాయిలో పలువురు కీలక నేతలు వైసీపీ ని వీడి టీడీపీలో చేరారు. అనంతరం ఎమ్మెల్యే రవికుమార్ ఇంటింటి ప్రచారం స్పీడు పెంచారు. ఈ నేపథ్యంలో పలు గ్రామాల నుంచి వైసీపీ నేతలు, కార్యకర్తలు ముందుకు వచ్చి ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరుతున్నారు. ప్రధానంగా వైసీపీకి మంచి పట్టు ఉన్న గ్రామాలతో పాటు, ఆ పార్టీ కి మంచి ఓటింగ్ ఉండే సామాజిక వర్గాల నుంచి ఇటీవల కాలంలో చేరిక లు పెరిగాయి. అంతా ఏకపక్షంగా ఓటింగ్ జరుగుతుంది అని వైసీపీ నాయకులు అంచనా వేసుకున్న పలు గ్రామాల నుంచి టీడీపీలోకి చేరికలు పెరగడంతో ఆయా గ్రామాలలో నువ్వా నేనా అన్న రీతిలో రెండు పార్టీలకు ఓట్లు పడే అవకాశం ఉందని టీడీపీ శ్రేణులు అంచనా వేస్తున్నాయి. ప్రధానంగా అద్దంకి మండలంలోని రామాయపాలెంలో వైసీపీకి మంచి పట్టు ఉంది. మాజీ సర్పంచ్ కుమారుడు పాములపాటి రాజశేఖరరెడ్డి తన వర్గీయులతో కలిసి ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. అదే సామాజిక వర్గానికి చెందిన నేతలతో పాటు, ప్రజా ప్రతినిధిగా ఉన్న నేత కూడా తనకు సరైన ప్రాధాన్యం ఇవ్వడం లేదని వైసీపీ నాయకుల తీరుపై అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తుంది. అదే విధంగా వైసీపీకి మంచి పట్టు ఉన్న గ్రామాలలో ఒకటైన పంగులూరు మండలం కల్లంవారిపాలెంకు చెందిన మండల పరిషత్ ఉపాధ్యక్షుడు, వైసీపీ మండల శాఖ మాజీ కన్వీనర్ యర్రం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అదే సామాజిక వర్గానికి చెందిన భవనం రామిరెడ్డి, రోహిత్‌రెడ్డి, చిన్న అంజిరెడ్డి, అలవల అంజిరెడ్డి, గుడిపాటి పెద్దారెడ్డి, శివనాగిరెడ్డితో పాటు పలువురు వైసీపీ నేతలు ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరారు. ఇక ఎస్సీ సామాజికవర్గంలో వైసీపీ ఓటు బ్యాంక్‌గా భావించే సామాజిక వర్గం నుంచి కూడా పలు గ్రామాలలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఈ క్రమంలోనే అద్దంకి మండలంలోని విప్పర్లవారిపాలెంలో సుమారు 50 కుటుంబాలు వైసీపీని వీడి ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఇలా నియోకవర్గంలోని పలు గ్రామాలలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు జోరందుకున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీలోకి చేరికల జోరు మరింత పెరిగే అవకాశం ఉంది. వైసీపీకి ఆయువుపట్టుగా ఉంటాయనుకున్న పలు గ్రామాలలో ప్రస్తుతం టీడీపీలోకి చేరికలు పెరిగాయి. ఇక టీడీపీకి మంచి మెజార్టీ వచ్చే పలు గ్రామాలలో వైసీపీ నాయకులు చేసే ప్రయత్నాలు ఫలించకపోగా బెడిసికొడుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బలంగా కుపించాల్సిన వైసీపీ శిబిరం రోజురోజుకూ నీరసపడిపోతూ వైసీపీ నేతల్లో ఉత్సాహం తగ్గిపోతోందని గ్రామస్థాయి నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో వైసీపీలో ఉండే కంటే గుర్తింపు ఉండే టీడీపీలో చేరడం మేలని గ్రామ నేతలు ఎమ్మెల్యే గొట్టిపాటికి మద్దతు ప్రకటించి సైకిల్ ఎక్కుతున్నారు. ఈ నేపథ్యంలోనే అద్దంకి నియోజకవర్గంలో టీడీపీ రోజురోజుకూ పటిష్టమవుతూ భారీ మెజార్టీ దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయని టీడీపీ శ్రేణులు అభిప్రాయపడుతున్నారు.



ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరుతున్న కల్లంవారిపాలెం వైసీపీ నేతలు భవనం రామిరెడ్డి, రోహిత్‌రెడ్డి, అంజిరెడ్డి తదితరులు

## డిజిటల్ లైబ్రరీ ప్రారంభం

ఇంకొల్లు, ఏప్రిల్ 29 : మండలంలోని గంగవరం ఎస్‌వీకే హైస్కూల్‌లో స్వేచ్ఛ కమ్యూనిటీ డిజిటల్ లైబ్రరీని ప్రారంభించినట్లు కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శివ గంగ ప్రసాద్ తెలిపారు. 12రోజుల పాటు కంప్యూటర్ శిక్షణను వినియోగించుకోవాలని ఆయన కోరారు. స్వేచ్ఛ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీని పాఠశాల హెచ్ఎం నార్నె సమత ప్రారంభించార. కంప్యూటర్ విజ్ఞాన్ని పెంపొందించుకొని విద్యార్థులు ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వలేటి విజయలక్ష్మి, ఆంజనేయులు,పాఠశాల సిబ్బంది, స్వేచ్ఛ జనరల్ కౌన్సిల్ కార్తీక్, సెల్వ పాల్గొన్నారు.


### స్కూటీని ఢీకొన్న కారు
### వదిన మృతి.. మరదలకు గాయాలు

అద్దంకి, ఏప్రిల్ 29 : స్కూటీని వెనుక నుంచి కారు ఢీకొనడంతో వదిన మరదళ్లకు గాయాలుకాగా, వదిన మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని గోవాడకు చెందిన వదినామరదళ్లు ఇండ్ల కుమారి (35) పొట్లూరి జ్యోతి సోమవారం స్కూటీపై అద్దంకి వచ్చి తిరిగి వెళ్తుండగా శింగరకొండ రోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో వెనుక నుంచి కారు ఢీకొట్టింది. దీంతో ఇండ్ల కుమారికి తీవ్రగాయాలు కాగా 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఆమె చికిత్స పొందుతూ మృతి చెందారు. పొట్లూరి జ్యోతికి స్వల్ప గాయాలయ్యాయి.

### 'నందిగం'తో ప్రాణహాని... రక్షణ కల్పించండి

సీఈవోకు కట్టా ఆనంద్‌బాబు ఫిర్యాదు


అమరావతి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బాపట్ల పార్లమెంట్ వైసీపీ అభ్యర్థి నందిగం సురేశ్ నుంచి తనకు ప్రాణ హాని ఉందని, రక్షణ కల్పించాలని బాపట్ల పార్లమెంట్ స్వతంత్ర్య అభ్యర్థి కట్టా ఆనంద్‌బాబు విజ్ఞప్తి చేశారు. సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాను అమరావతి సచివాలయంలో ఆయన కలిశారు. నందిగం సురేశ్ అక్రమాలు, దౌర్జన్యాలను సోషల్ మీడియా వేదికగా ఎండగడుతున్న తనపై కక్ష కట్టి, బెదిరిస్తున్నారని సీఈవో దృష్టికి తీసుకెళ్లారు. 'నువ్వొక వలంటీర్‌వి. నా మీదే తిరుగుబాటు చేసే ధైర్యం నీకెవడిచ్చాడు? నామినేషన్ ఉపసంహరించుకోకపోతే మే 13లోపు నిన్ను చంపేస్తా. వచ్చే ఏడాది నా పేరు మీద సినిమా తీస్తా' అని సురేశ్, అతని అనుచరులు బెదిరిస్తున్నారని వివరించారు. ఒంటరిగా ప్రచారం చేస్తున్న తనను, అతని అనుచరులు అనుసరిస్తున్నారని, తనను చంపేస్తారేమోనని భయం వ్యక్తం చేశారు.




- అసెంబ్లీ నియోజకవర్గాల్లో 115 మంది పోటీ
- నెల్లూరు పార్లమెంటుకు 14 మంది..
- అందరికీ గుర్తుల కేటాయింపు

- ముగిసిన నామినేషన్ల పర్వం

# బరిలో వీరు..
# ఇక ప్రచారాల జోరు!



**నెల్లూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి)**: సార్వత్రిక ఎన్నికల సంగ్రామం కీలక దశకు చేరుకుంది. ప్రధాన ఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ సోమవారం ముగిసింది. 12 రోజులపాటు కొనసాగిన ఈ ప్రక్రియ పూర్తి కావడంతో ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల లెక్క తేలింది. ఏ నియోజకవర్గంలో ఎవరెవరు తలపడబోతున్నారన్న విషయంలో స్పష్టత వచ్చింది. ప్రధాన పార్టీల అభ్యర్థుల విషయం ఎప్పుడో తేలిపోగా, వారికి ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులుగా ఎవరెవరు పోటీ ఇవ్వబోతున్నారన్నది ఆసక్తిగా మారింది. ఒక్క నెల్లూరు పార్లమెంటుకే 14 మంది పోటీ పడుతున్నారు. అందులో ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీలకు కాంగ్రెస్, ఇతర పార్టీల నుంచి పోటీ ఎదురవుతోంది. ఒకే ఒక్క స్వతంత్ర అభ్యర్థి కూడా బరిలో ఉన్నారు. ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 115 మంది పోటీ పడుతుండటం విశేషం. ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ అభ్యర్థులు 16 మందికి 99 మంది ఇతర పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు పోటీ ఇవ్వబోతున్నారు. ఏ నియోజకవర్గంలోనూ 11 మందికి తక్కువ లేరు. ఇదే ఇప్పుడు పోలింగ్ రోజున కీలకం కాబోతోంది. వీరు ఏ మేరకు ఓటింగ్‌ను చీల్చుతారు? ఆ ప్రభావం ప్రధాన పార్టీల్లో ఎవరిపై పడుతుంది? అన్నది ఆసక్తిగా మారింది. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల తుది జాబితా తేలిపోవడంతో ఇక ప్రచారాలు మరోస్థాయికి చేరుకోనున్నాయి. గడిచిన నెలన్నరగా పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా జోరుగా ప్రచారాలు సాగుతున్నాయి. మే 13న ఎన్నికల పోలింగ్ జరుగుతుంది. అంటే ఇక గట్టిగా రెండు వారాలు మాత్రమే సమయం ఉంది. మే 11వ తేదీతో ప్రచారాలు ముగించాల్సి ఉంటుంది. ఇక మిగిలింది పన్నెండు రోజులే కావడంతో బరిలో నిలిచిన అభ్యర్థులంతా ఈ సమయం మొత్తం ప్రజల మధ్యనే తిరుగుతారనడంలో ఎటువంటి అతిశయోక్తిలేదు. ప్రచారాలు కూడా పోటాపోటీగా సాగనున్నాయి. ఒక ప్రాంతంలో ఉదయం ఒక అభ్యర్థి, మధ్యాహ్నం మరో అభ్యర్థి, సాయంత్రం ఇంకో అభ్యర్థి ప్రచారం చేసినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ ప్రచారాలు కూలీలకు పని కల్పించనున్నాయి. ఇప్పటికే రోజువారీ కూలీ ఇచ్చి ప్రచారానికి తీసుకెళుతుండగా, ఇటువంటి వారి సంఖ్య ఇకపై పెరగనుంది.

| అసెంబ్లీ | దాఖలైన నామినేషన్లు | తిరస్కరణ | ఉపసంహరణ | బరిలో ఉన్నవారు |
|---|---|---|---|---|
| సర్వేపల్లి | 17 | 4 | - | 13 |
| నెల్లూరు రూరల్ | 13 | 1 | 1 | 11 |
| నెల్లూరు సిటీ | 28 | 8 | 3 | 15 |
| కావలి | 25 | 10 | 2 | 13 |
| కందుకూరు | 25 | 1 | 2 | 22 |
| ఉదయగిరి | 22 | 6 | 1 | 15 |
| కోవూరు | 28 | 9 | 6 | 13 |
| ఆత్మకూరు | 15 | 2 | - | 13 |
| మొత్తం | 171 | 41 | 15 | 115 |
| నెల్లూరు (ఎంపీ) | 21 | 6 | 1 | 14 |

**నెల్లూరు పార్లమెంటు అభ్యర్థులు**

| వ.నెం. | అభ్యర్థి | పార్టీ | గుర్తు |
|---|---|---|---|
| 1. | కొప్పుల రాజు | కాంగ్రెస్ పార్టీ | హస్తం |
| 2. | వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి | తెలుగుదేశం | సైకిల్ |
| 3. | నాసిన భాస్కర్ | బహుజన సమాజ్ పార్టీ | ఏనుగు |
| 4. | వేణుంబాక విజయసాయిరెడ్డి | వైఎస్ఆర్‌సీపీ | సీలింగ్ ఫ్యాను |
| 5. | గాజుల సోమశేఖర్ | జైభారత్ నేషనల్ పార్టీ | టార్చ్‌లైట్ |
| 6. | తలారి వెంకయ్య | జైభీమ్‌రావ్ భారత్ పార్టీ | కోటు |
| 7. | నక్క దినేష్ | భారత చైతన్య యువజన పార్టీ | చెరుకు రైతు |
| 8. | పుంగనూరు ప్రసన్నగణపతి | రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా | కత్తెర |
| 9. | మల్లేపల్లి రఘు | నవరంగ్ కాంగ్రెస్‌పార్టీ | బకెట్ |
| 10. | వివేక్ మన్నేపల్లి | రెవెల్యూషనరీ సోషలిస్టుపార్టీ | పారా పలుగు |
| 11. | షేక్ మహబూబ్‌బాషా | రిపబ్లిక్‌పార్టీ ఆఫ్ ఇండియా(ఎ) | కుట్టు మిషన్ |
| 12. | షేక్ ముజబూర్ రెహమాన్ | పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా | టెలివిజన్ |
| 13. | షేక్ షఫి అహ్మద్ | ఆలిండియా ఫార్వాడ్ బ్లాక్ | సింహం |
| 14. | కొప్పాల రఘు | స్వతంత్ర | గ్యాస్ సిలిండర్ |

**బరిలో 129 మంది**

నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారం ముగియడంతో బరిలో నిలిచిన అభ్యర్థుల వివరాలను అధికారులు వెల్లడించారు. నెల్లూరు పార్లమెంటు, 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు 129 మంది పోటీలో నిలబడ్డారు. నెల్లూరు పార్లమెంటుకు 21 మంది నామినేషన్లు దాఖలు చేయగా స్క్రూటినీలో ఆరు తిరస్కరణకు గురయ్యాయి. మరొకరు విత్‌డ్రా చేసుకోవడంతో తుది బరిలో 14 మంది నిలిచారు. ఆ వివరాలను నెల్లూరులోని కలెక్టరేట్‌లో కలెక్టర్ హరినారాయణన్ వెల్లడించారు. గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులకు వారి పార్టీ గుర్తులు కేటాయించగా స్వతంత్రులకు ఎన్నికల నిబంధల ప్రకారం గుర్తులు కేటాయించారు. కాగా ఈ నెల 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా 25వ తేదీ వరకు స్వీకరణ ప్రక్రియ జరిగింది. 26న పరిశీలన, సోమవారం ఉపసంహరణకు అవకాశం కల్పించారు.

**లోకేష్, షర్మిల రాక**

నామినేషన్ల ఘట్టం ముగియడంతో అభ్యర్థుల విజయం కోసం ప్రధాన పార్టీల నేతలు జిల్లాకు రానున్నారు. ఇప్పటికే టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, వైసీపీ అధినేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బహిరంగ సభలు నిర్వహించారు. కాగా, బుధవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, 5వ తేదీన పీసీసీ చీఫ్ వైఎస్. షర్మిల జిల్లాకు రానున్నారు.

## మే, జూన్ నెలల్లో బ్యాంకు ఖాతాల్లో పింఛను

**నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 29** : ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం మే, జూన్ నెలల్లో సామాజిక భద్రత పింఛన్లను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాకు జమ చేస్తామని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కేవీ సాంబశివారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బ్యాంకు అకౌంట్ ఉండి ఆధార్ నంబర్‌తో మ్యాపింగ్ కాబడి ఉంటే వారి ఖాతాలకు డీబీటీ పద్ధతిలో నేరుగా పింఛను నగదు జమ అవుతుందని తెలిపారు. అలా జమ అయిన వివరాలు సంబంధిత సచివాలయాల్లో అందుబాటులో ఉంటాయన్నారు. ఏదైనా సమస్య వస్తే సచివాలయ సిబ్బంది ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు. డీబీటీ పద్ధతిలో బ్యాంకులో నగదు జమకాని వారికి 5వ తేదీలోపు ఇంటి వద్దనే పింఛను అందిస్తారని తెలిపారు. బ్యాంకు అకౌంట్ లేని పింఛనుదారులకు, వికలాంగులకు, కదలలేని స్థితిలో ఉన్నవారికి, ఆరోగ్య పింఛన్లు, సైనిక సంక్షేమ పింఛన్‌దారులకు వారి ఇంటి వద్దనే సచివాలయ రెగ్యులర్ సిబ్బంది పింఛను నగదు మే 1వ తేదీ ఉదయం నుంచే పంపిణీ చేస్తారని తెలిపారు. జిల్లాలో 3,15,423 మంది పింఛను దారులు ఉన్నారని, వారికి రూ.94.38 కోట్లు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. ఇంటివద్దనే పంపిణీ చేయు పింఛన్లు 79,734 ఉన్నాయని, 235689 మందికి బ్యాంకు అకౌంట్‌ల ద్వారా పింఛను నగదు జమ చేస్తామని పీడీ తెలిపారు.

**నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 29:** ప్రశాంతంగా ఉండే నెల్లూరులోని విజయమహల్ గేటు సెంటర్‌లో సోమవారం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఒక్కసారిగా 10 మీటర్లకుపైగా ఉవ్వెత్తున ఎగిసిపడిన మంటలు, పొగను చూసిన ప్రజలు ఇళ్లు, దుకాణాల నుంచి రోడ్లపైకి పరుగులు తీశారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇళ్లు, దుకాణాలు, వైద్యశాలలల మధ్య ఆక్వా రంగానికి చెందిన సామగ్రి ఉన్న గోదాములో ఈ ప్రమాదం జరిగింది. అక్కడన్నీ ప్లాస్టిక్ సామాన్లు ఉండడంతో మంటలు భారీగా ఎగిసిపడ్డాయి. మంటలు చుట్టుపక్కల భవనాలకు వ్యాపించకుండా సరైన సమయంలో అగ్నిమాపక సిబ్బంది మూడు ఫైరింజన్లతో వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదాన్ని చూసిన ప్రజలు అక్కడ ఆక్వా సామగ్రి నిల్వఉంచే గోదాము ఉందన్న విషయమే తమకు తెలియదన్నారు. ఓ ఫర్నిచర్ దుకాణం, పండ్లరసాల దుకాణం మాత్రమే ఉన్నాయనుకుంటున్నామని వారు పేర్కొన్నారు. గతంలో ఈ గోదాము ఉన్న ప్రాంతంలో ఓ డాబాను నిర్వహించారు. అయితే దాన్ని మూసేయడంతో ఆ గోదాము ఖాళీగా ఉందని భావించామన్నారు.

# భయపెట్టిన అగ్నికీలలు

- నగరంలో భారీ అగ్ని ప్రమాదం
- భయంతో రోడ్లపైకి జనం పరుగులు
- మూడు ఫైరింజన్లతో అదుపులోకి..
- ఆక్వాసామగ్రి గోదాములో ఘటన
- అనుమతులు లేకుండా గోడౌన్ నిర్వహణ

**భయంతో పరుగులు**


అలుముకున్న పొగ

అప్పటి వరకు ప్రశాంతంగా ఉన్న విజయమహల్ గేటు ప్రాంతం సోమవారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో బీభత్సంగా మారింది. విజయ మహల్ గేటు సెంటర్‌లోని ఓ స్వీట్‌షాపు ఎదురుగా కనకదుర్గ మెటల్స్ దుకాణానికి చెందిన గోదామును జేకే హరీష్ అనే వ్యక్తి నిర్వహిస్తున్నారు. ఆ గోదాముకు ముందు ఓ ఫర్నీచర్ షాపు, పండ్ల రసాల దుకాణం ఉన్నాయి. ఆ దుకాణాల వెనుక వైపు నుంచి ఉదయం 10.20 గంటల ప్రాంతంలో పొగలు వస్తున్నాయంటూ ఆ అంగళ్ల సిబ్బంది బయటకు పరుగులు తీశారు. కొద్దిసేపటికే ఆ ప్రాంతంలో మంటలతో పాటు దట్టమైన పొగ కమ్ముకుంది. దీంతో చుట్టుపక్కల ఇళ్లవారు, షాపుల్లోని వారు భయంతో రోడ్లపైకి పరుగులు తీశారు. ప్రమాదం జరిగిన రేకుల గోదాము పక్కనే ఓ ప్రైవేటు వైద్యశాల ఉండటంతో అందులోని వైద్యులు, రోగులు, సిబ్బంది కూడా బయటకు పరుగులు తీశారు. వెంటనే అప్రమత్తమైన స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు.

**ప్రాణాలకు తెగించి..**


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది క్షణాల్లో ఘటనాస్థలానికి చేరుకున్నారు. మూడు ఫైర్‌ఇంజన్ల సాయంతో సిబ్బంది రెండు గంటలపాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. ఏడీఎఫ్‌వో వేణుగోపాల్ రావు ఆధ్వర్యంలో హెడ్‌కానిస్టే బుళ్లు మస్తానరావు, హరిబాబులు మంటలను అదుపు చేయడంలో తీవ్రంగా శ్రమించారు. కానిస్టేబుల్ ఈ రామకృష్ణ అత్యంత ధైర్యసాహసాలతో శ్లాబు పెచ్చులు ఊడిపడు తున్నా లోపలికి చొచ్చుకుపోయి మంటలను అదుపు చేశారు. సంఘ టన స్థలాన్ని డీఎఫ్‌వో వాకా శ్రీనివాసరెడ్డి పరిశీలించి సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం సంభవించి నట్లు తెలిసింది. ఆక్వా పరిశ్రమలో వినియోగించే ప్లాస్టిక్ నెట్‌లు, థర్మాకోల్ షీట్స్, బోట్‌లు, పట్టలు, నైలాన్ రోప్స్ ఈ ప్రమాదంలో కాలిపోయాయి. దీంతో రూ.40 లక్షలు నష్టం వాటిల్లిందని గోదాము యజమాని తెలిపారు. తనకు రూ.3లక్షల నష్టం వాటిల్లిందని ఫర్నీచర్ దుకాణం యజమాని మస్తానయ్య అగ్నిమాపక అధికారులకు తెలిపారు. కాగా గోదాము పైకప్పునకు వినియోగించిన రేకులు పూర్తిగా ధ్వంసమయ్యాయి.

**2019లోనూ భారీ అగ్నిప్రమాదం**

2019 అక్టోబరు 27న నగరమంతా దీపావళి జరుపుకుంటుండగా చిన్నబజారులోని ఓ మెటల్ దుకాణంలోనూ భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకొంది. ఈ ప్రమాదంలో చెలరేగిన మంటలను ఆర్పేందుకు అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బందికి 24 గంటల సమయం పట్టింది. 9 ఫైర్‌ఇంజన్లతో క్షణం తీరిక లేకుండా శ్రమిస్తేకాని మంటలు అదుపులోకి రాలేదు. ఈ ప్రమాదంలో ఐదు అంతస్తుల భవనం పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదం జరిగిన ఐదేళ్ల తర్వాత సోమవారం తాజాగా ఈ ప్రమాదం సంభవించింది. ఈ రెండు భారీ అగ్ని ప్రమాదాలతో నగర ప్రజలు వణికి పోతున్నారు.


ముసునూరు జడ్పీ స్కూల్ రోడ్డులో నిరుపయోగంగా ఓవర్‌హెడ్ ట్యాంక్

**టీడీపీకి మైలేజ్ వస్తుందనే..**

పట్టణ ప్రజల దాహార్తి తీర్చే బృహత్తర పథకమైన అమృత్ పథకం పూర్తయి ప్రజల నోటికి నీరందితే టీడీపీకి గుర్తింపు వచ్చి మైలేజ్ పెరుగుతుందన్న అక్కసుతోనే వైసీపీ పాలకులు పథకం ప్రకారం మిగిలిన 15శాతం పనులు పూర్తి చేయకుండా అడ్డుకుని 5ఏళ్ల కుంటి సాకులు చెబుతూ కాలం వెళ్లబుచ్చారు. పథకం ఎందుకు ఆగిపోయింది.. ఎప్పుడు పూర్తవుతుందన్న వివరాలపై అధికారుల మౌనమే సమాధానంగా మారింది.

కావలిలో రూ.86.11 కోట్ల పథకం నిర్వీర్యం

తాగునీటిపై విషం చిమ్మిన పాలకులు

# ‘అమృతం’ ఆలస్యమైంది!

- టీడీపీ ప్రభుత్వంలోనే 85 శాతం పనుల పూర్తి
- వైసీపీ పాలనలో పైలాన్ ధ్వంసం

**కావలి (టౌన్), ఏప్రిల్ 29:** ఆలస్యం అమృతం విషం అన్న పెద్దల మాటలను అధికార పార్టీ నేతలు పాటించి అక్షరాల నిజమని నిరూపించారు. కావలి పట్టణ ప్రజల దాహార్తి తీర్చే చిరకాల కోరిక తీరే సమయం ఆసన్నమైందనుకున్న తరుణంలో రూ.86.11 కోట్లతో చేపట్టిన అమృత్ పథకంపై విషం చిమ్మారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు కేంద్ర ప్రభుత్వం నుంచి కావలి వాసుల దాహార్తి తీర్చేందుకు అమృత్ పథకాన్ని మంజూరు చేయించారు. ఈ పథకం ద్వారా రూ.57కోట్లు తాగునీటి పనులకు, రూ.29.11 కోట్లు నీటి శుద్ధి ప్లాంట్‌కు మంజూరయ్యాయి.

**అప్పట్లోనే 85 శాతం పనుల పూర్తి**

టీడీపీ పాలనలో నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించి ముసునూరు జడ్పీ పాఠశాల వీధిలో, బాపూజీనగర్ మున్సిపల్ పార్కు స్థలంలో, వెంగళరావునగర్‌లో, ముసునూరు ఇందిరమ్మ కాలనీలో, పట్టణ ఉత్తరంపేటలలో 5 ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించారు. ట్యాంక్‌ల వద్ద ప్రధాన వాల్వుల ఏర్పాటు, పట్టణ పరిధిలో పైపులైన్ లేని ప్రాంతాల్లో పైప్‌లైన్ల నిర్మాణం పూర్తయ్యాయి. పైపులైనుల అనుసంధాన ప్రక్రియ పూర్తయితే నూరుశాతం పనులు పూర్తయినట్లే. ఈ క్రమంలో ప్రభుత్వ మారింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఒక్కటంటే ఒక్క పైపు కూడా అనుసంధానం చేయకుండా బృహత్తరమైన తాగునీటి పథకాన్ని నిర్వీర్యం చేశారు.

- తుమ్మలపెంట రోడ్డు వద్ద రూ.29.11 కోట్లతో నిర్మించిన నీటి శుద్ధి ప్లాంట్ పనులు పూర్తయ్యాయి. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకుని ప్లాంట్ పనులు ప్రారంభించుకునే తరుణంలో ఎన్నికలు సమీపించడంతో ప్లాంట్ ప్రారంభానికి నోచుకోలేదు.


వాటర్ ట్యాంక్ వద్ద పైపులు అమర్చకుండా వదిలేసిన ప్రధాన వాల్వు

**పైలాన్ ధ్వంసం**

ట్రంకురోడ్డులోని అగ్నిమాపక కేంద్రం రోడ్డు వద్ద నిర్మించిన పైలాన్‌ను అధికారంలోకి వచ్చిన వెంటనే వైసీపీ మూకలు ఆనవాళ్లు కూడా కనిపించకుండా రాత్రికి రాత్రే ధ్వంసం చేశారు. పోలీసులు ఇప్పటికీ నిందితులను పట్టుకుని శిక్షించిన పాపాన పోలేదు.



**గుక్కెడు నీళ్లు లేవయ్యా!**

కళ్ల ముందు ఓవర్‌హెడ్ ట్యాంక్ ఉన్నా గుక్కెడు నీళ్లు లేవు. ఆరేళ్ల క్రితమే మా ప్రాంతంలో ట్యాంక్ నిర్మాణంతోపాటు ప్రతి వీధికి పైపులైన్లు ఏర్పాటు చేశారు. ఇక నీటి కొరత ఉండదకున్నాం. ఆ తర్వాత వచ్చిన వైసీపీ వాళ్లు పట్టించుకోలేదు. పెద్దోళ్ల వ్యవహారాలు మాలాంటి పేదలకేం తెలుసు. ఏంజరిగిందో ఏమోగాని నోటికాడ నీరు అందకుండా పోయాయి. ప్రజా సమస్యలు తీర్చడంలో, అభివృద్ధి, సంక్షేమంలో నేతలు పోటీ పడాలేగాని ఇలా అభివృద్ధిని అడ్డుకోవడం దారుణం.

- మరియమ్మ, ముసునూరు

# ఉదయగిరిలో వైసీపీకి భారీ షాక్

- ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు సభ్యులు టీడీపీలో చేరిక
- చంద్రబాబును సీఎం చేద్దాం : వేమిరెడ్డి


అభ్యర్థులు వేమిరెడ్డి, కాకర్లతో మెట్టుకూరు

**వింజమూరు** : ఉదయగిరి నియోజకవర్గంలో వైసీపీకి గట్టి దెబ్బ తగిలింది. కలిగిరి మండలా నికి చెందిన రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరం జీవిరెడ్డి నాయ కత్వంలో సుమారు వెయ్యి మంది నాయకులు సోమ వారం టీడీపీలో చేరారు. వింజమూరులోని టీడీపీ కార్యాలయంలో నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి కాకర్ల సురేష్ సమక్షంలో వారికి పార్టీ కండువా కప్పి టీడీపీలోకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి, కాకర్ల మాట్లాడుతూ కలిసికట్టుగా పనిచేసే టీడీపీని గెలిపించాలని, నారా చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. అప్పుడే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుదని, యువతకు ఉపాధి దొరుకుతుందని, పోలవరం ప్రాజెక్టు పూర్తవుతుందని, సంక్షేమ పథకాలు అందరికీ అందుతాయని, అభివృద్ధి జరుగుతుందని అన్నారు. మొదట కలిగిరి మండలం అనంతపురంలోని మెట్టుకూరు చిరంజీవి రెడ్డి స్వగృహం నుంచి భారీ బైక్ ర్యాలీతో బంబరా చెరువు దగ్గర ఉన్న కాకర్ల ట్రస్ట్ నుంచి టీడీపీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, విజయరామిరెడ్డి, చెంచలబాబు యాదవ్, నేతపాటి శాంతమ్మ, జనసేన నాయకులు కొంటే వెంకటేశ్వర్లు, మన్నేటి వెంకటరెడ్డి, బొబ్బలు వెంగళరావు, అన్ని మండలాల కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.

- వీఆర్ ఫంక్షన్ ప్లాజాలో మాజీ సొసైటీ అధ్యక్షుడు జూపల్లి రాజారావు ఆధ్వర్యంలో భారీ ఎత్తున టీడీపీలోకి చేరారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో తన అనుచరులతో కలిసి జూపల్లి రాజారావు టీడీపీ కండువాలు వేసుకున్నారు. మండల కన్వీనర్ గొంగటి రఘునాధరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ తీగల్లో మంటలు

**బిట్రగుంట, ఏప్రిల్ 29:** బోగోలు పంచాయతీ బేతనీ పేట కమ్యునిటీ హాల్ సమీపంలో హై టెక్షన్ విద్యుత్ తీగలో సోమవారం సాయంత్రం మంటలు రేగాయి. స్థానికులు గమనించి లైన్‌మెన్ రమేష్‌కు సమాచారాన్ని అందచేశారు. ఆయన సంఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ సప్లై నిలిపి వేసి సమస్యను పరిష్కరించారు. విద్యుత్ తీగలపై లోడ్ ఎక్కువ కావడం, లూస్ కాంటాక్ట్ వలన మంటలు రేగాయని తెలిపారు.

## రేషన్ డీలర్‌పై చర్యలు తీసుకోండి

**కొండాపురం, ఏప్రిల్ 29:** రేషన్ డీలరుగా పనిచేస్తూ అధికార పార్టీ ప్రచార కార్యక్రమాలలో పాల్గొన్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ మండలంలోని సాయిపేట పంచాయతీ కొత్తపాలెంకు చెందిన ఓ.సుమన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని రేషన్ షాపు నెంబరు-14 నడుపుతున్న ఎమ్.శ్రీను ఉదయగిరి వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాలరెడ్డికి అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రచారాలలో పాల్గొంటూ ప్రజలను ప్రలోభాలకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఆ ఆధారాలను ఆర్‌వో, తహసీల్దారు, కార్యదర్శికి అందజేశామని పేర్కొన్నారు.

## కందుకూరు అసెంబ్లీ బరిలో 22 మంది

● రెండు ఈవీఎం ప్యానెళ్ల ఏర్పాటు తప్పనిసరి

**కందుకూరు, ఏప్రిల్ 29:** కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 22మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. దీంతో రెండు ఈవీఎం ప్యానెల్స్ ఏర్పాటు చేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఒక్కో ఈవీఎం ప్యానెల్‌లో 16 మంది అభ్యర్థులకు మాత్రం చోటు ఉంటుంది. దీంతో అభ్యర్థుల సంఖ్యను ఎలాగైనా 16కి వచ్చేలా చేయడం ద్వారా ఓటర్లు గందరగోళానికి గురికాకుండా చూడాలని ప్రధాన పార్టీల అభ్యర్థులు రెండురోజులుగా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కందుకూరు నియోజకవర్గంకు మొత్తం 25 మంది అభ్యర్థులు 40 సెట్లు నామినేషన్లు వేయగా టీడీపీ డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య బీఫాం సమర్పించని కారణంగా రద్దయింది. దీంతో 24 మంది మిగలగా టీడీపీ నేతలపై అసంతృప్తితో నామినేషన్ దాఖలుచేసిన ఆపార్టీ నాయకుడు షేక్ రఫీని బుజ్జగించి సోమవారం ఉపసంహరింపజేశారు. అలాగే ఇండిపెండెంట్‌గా నామినేషన్ దాఖలు చేసిన వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ సతీమణి లక్ష్మి తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో 22 మంది బరిలో మిగలగా వారిలో కనీసం ఆరుగురిని ఉపసంహరింపజేస్తే ఒక్క ఈవీఎం ప్యానెల్‌తో ఎన్నికలకు వెళ్లవచ్చని విశ్వప్రయత్నం చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులిద్దరూ చెరో ముగ్గురిని ఉపసంహరింపజేయాలన్న లక్ష్యంతో ప్రయత్నం చేసినప్పటికీ పోటీలో ఉన్న అభ్యర్థులు భారీగా నగదు డిమాండ్ చేసినట్లు సమాచారం. వారు ఊహకందని మొత్తాలు డిమాండ్ చేయడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో 22 మంది అభ్యర్థులు బరిలో మిగలగా రెండు ఈవీఎం ప్యానెల్స్ తప్పనిసరిగా మారింది. రెండు ఈవీఎం ప్యానెల్స్ ఉంటే నిరక్షరాస్య ఓటర్లు కొంత గందరగోళానికి గురయ్యే ప్రమాదం లేకపోలేదు.

### కందుకూరు నుంచి పోటీలో ఉన్న అభ్యర్థులు

| వరుస నెం. | అభ్యర్థి పేరు | రాజకీయ పార్టీ |
|---|---|---|
| 1. | సయ్యద్ గౌస్ మొహిద్దీన్ | కాంగ్రెస్ |
| 2. | బుర్రా మధుసూదన్ యాదవ్ | వైసీపీ |
| 3. | ఇంటూరి నాగేశ్వరరావు | తెలుగుదేశం |
| 4. | పేరం సత్యనారాయణ | బీఎస్పీ |
| 5. | ఎండ్లూరి బాలకుమార్ | రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా |
| 6. | పొడపాటి శివకుమార్ | జైభారత్ నేషనల్ పార్టీ |
| 7. | చేకూరి వెంకటకృష్ణారావు | పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా |
| 8. | జగన్నాథం శ్రీను | నీతినిజాయితీ పార్టీ |
| 9. | గోలి పద్మజ | లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ |
| 10. | అక్కిలగుంట ఇషాక్ | స్వతంత్ర |
| 11. | పొడపాటి హరిబాబు | స్వతంత్ర |
| 12. | తాటికొండ రాంబాబు | స్వతంత్ర |
| 13. | చెరుకూరి జాషువా | స్వతంత్ర |
| 14. | ఉన్నం రాధమ్మ | స్వతంత్ర |
| 15. | ముచ్చు శ్రీనివాసులు | స్వతంత్ర |
| 16. | గొడుగు మాల్యాద్రి | స్వతంత్ర |
| 17. | సయ్యద్ నసీమా | స్వతంత్ర |
| 18. | నేతి మహేశ్వరరావు | స్వతంత్ర |
| 19. | రాతికింద వేణు | స్వతంత్ర |
| 20. | చల్లా వెంకటమురళీకృష్ణ | స్వతంత్ర |
| 21. | చెన్నిబోయిన నరసింహ్మం | స్వతంత్ర |
| 22. | సంగా సత్యనారాయణ | స్వతంత్ర |

## కావలి నియోజకవర్గంలో 13 మంది పోటీ

**కావలి, ఏప్రిల్ 29 :** కావలి అసెంబ్లీ నియోజకవర్గంలో 25 మంది నామినేషన్లు వేశారు. నామినేషన్ల పరిశీలన అనంతరం వివిధ కారణాలతో 10 నామినేషన్లను తిరస్కరణకు గురయ్యాయి. దీంతో 15 మంది మిగిలారు. వారిలో సోమవారం ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో 13 మంది పోటీలో నిలిశారు.

### కావలి అసెంబ్లీ బరిలో నిలిచిన అభ్యర్థులు వీరే

| వ. నం | అభ్యర్థి పేరు | రాజకీయ పార్టీ |
|---|---|---|
| 1. | గుంజి వెంకటేశ్వర్లు | బహుజన సమాజ్ పార్టీ |
| 2. | దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి | తెలుగుదేశం |
| 3. | పొదలకూరి కల్యాణ్ | కాంగ్రెస్ |
| 4. | రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి | వైసీపీ |
| 5. | ముప్పసాని నరేంద్ర | జై భారత్ నేషనల్ పార్టీ |
| 6. | యెల్లు సాల్మన్ | రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా |
| 7. | సబ్బెళ్ల విజయభాస్కర్ రెడ్డి | పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా |
| 8. | అనుమాలశెట్టి హరిప్రసాద్ రావు | స్వతంత్ర |
| 9. | గర్రె సురేష్‌బాబు | స్వతంత్ర |
| 10. | దేవరపల్లి క్రిష్ణారెడ్డి | స్వతంత్ర |
| 11. | పసుపులేటి సుధాకర్ | స్వతంత్ర |
| 12. | వాయిల తిరుపతి | స్వతంత్ర |
| 13. | విడవలపాటి శ్రీనివాసులు | స్వతంత్ర |

## విజయసాయిరెడ్డికి ఓటేస్తే నెల్లూరుకు ముప్పు

● మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వేణుగోపాల్‌రెడ్డి

**కావలి, ఏప్రిల్ 29:** నెల్లూరు ఎంపీగా వైసీపీ నుంచి పోటీ చేస్తున్న ఆర్థిక నేరస్థుడైన వేణుంబాక విజయసాయిరెడ్డికి ఓటేస్తే నెల్లూరు జిల్లాకు ముప్పేనని కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని జండా చెట్టు వద్ద ఉన్న టీడీపీ ఎంపీ అభ్యర్థి కార్యాలయంలో సోమవారం కూటమి నేతలతో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అక్రమంగా లక్షల కోట్లు ఎలా సంపాదించాలో జగన్‌కు నేర్పి ఆయనను జైలుకు పంపిన వ్యక్తి విజయసాయిరెడ్డన్నారు. వైజాగ్‌లో రుషికొండను గుండు కొట్టించి అక్కడ అక్రమాలకు పాల్పడితే వైసీపీ నేతలే అక్కడ నుంచి తరిమి కొట్టారన్నారు. నెల్లూరులో టీడీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిపై పోటీకి వైసీపీలో ఎవరూ ముందుకు రాకపోవడంతో విజయసాయిరెడ్డిని జగన్ నిలిపారన్నారు. ఆయన తొలుత పోటీకి వెనుకకు తగ్గగా ఆ తర్వాత నెల్లూరు కేంద్రంగా సంపాదించుకునే అవకాశాలను సిలికా, ఇసుక అక్రమ వ్యాపారం, కృష్ణపట్నం, రామాయణపట్నం ద్వారా డ్రగ్స్ దిగుమతి చేసుకుని వ్యాపారం చేసుకోవచ్చని చెప్పడంతో అయన పోటీకి దిగారన్నారు. ఆయనకు ఓట్లు వేసి గెలిపిస్తే నెల్లూరు జిల్లాకే పెను ముప్పు పొంచి ఉన్నందున ఆయనను జిల్లా ప్రజలు తరిమి కొట్టాలన్నారు. వేమిరెడ్డిపై ఓడిపోతామనే భయంతోనే ఆయన రాజ్యసభకు రాజీనామా చేయకుండా పోటీ చేస్తున్నారన్నారు. గెలుస్తామనే ధైర్యం ఉంటే ముందు రాజ్యసభకు రాజీనామా చేయాలన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని రంగాలలో సేవా కార్యక్రమాలు చేసే నేత వేమిరెడ్డికి, దొరికిన చోటల్లా దోపిడీ చేసే ఆర్థికనేరస్థుడైన సాయిరెడ్డికి పోలిక ఎక్కడన్నారు. వేమిరెడ్డిని విమర్శించే స్థాయి విజయసాయిరెడ్డికి లేదన్నారు. ఆయనను విమర్శిస్తే జిల్లా ప్రజలు నిన్ను క్షమించరని హెచ్చరించారు. ప్రజలు ఎంపీగా ప్రభాకర్ రెడ్డికి, ఎమ్మెల్యే అభ్యర్థిగా కావ్య క్రిష్ణారెడ్డికి ఓటు వేసేందుకు ఎప్పుడో సిద్ధమయ్యారని చెప్పారు. ఈ సమావేశంలో జనసేన కావలి ఇన్‌చార్జి అళహరి సుధాకర్, బీజేపీ నాయకురాలు పూనూరు మాధవి, టీడీపీ నేతలు మన్నవ రవిచంద్ర, గుత్తికొండ క్రిషోర్, అశోక్‌రెడ్డి, రాజా, రమణయ్య, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ అభ్యర్థులను గెలిపించాలి

● ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు

**కందుకూరు, ఏప్రిల్ 29:** ఈ ఎన్నికల్లో టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిలను మంచి మెజారిటీతో గెలిపించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ కులాల వర్గీకరణ సమస్య పరిష్కారం కావాలన్నా, మాదిగల జీవితాల్లో వెలుగులు రావాలన్నా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రబాబునాయుడు గెలుపు అంటే మాదిగల గెలుపుగా చూడాలని పిలుపునిచ్చారు. గతంలో చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో వర్గీకరణ జరిగిన ఫలితంగానే మాదిగ జాతికి 23వేల ఉద్యోగాలు వచ్చాయని, అన్నిరంగాల్లో మేలుజరిగిందని వివరించారు. జగన్మోహనరెడ్డి మాదిగలను నమ్మించి మోసం చేసిన వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోతారన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు జలదంకి నరసింగరావు, వర్ల దేవదాసు, గౌడపేరు కాంతారావు, చదలవాడ కిట్టు, ఏలియా, ప్రభాకర్, బన్నీ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# కందుకూరుకు ఏం చేస్తారో చెప్పరా?

● సీఎం జగన్ బహిరంగ సభపై ఇంటూరి నాగేశ్వరరావు విమర్శ


మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు

**కందుకూరు, ఏప్రిల్ 29:** గడచిన ఐదేళ్లలో కందుకూరు నియోజకవర్గానికి ఏమి చేశారో, రానున్న ఐదేళ్లలో మళ్లీ గెలిపిస్తే ఏమి చేస్తారో చెప్పకుండా సీఎం జగన్మోహనరెడ్డి ఎందుకు బహిరంగ సభ నిర్వహించారో అర్థం కాలేదని, ప్రజలకు ఏమి చేస్తామో చెప్పకుండా తమ గొప్పలు చెప్పుకుని టీడీపీని విమర్శిస్తే సరిపోతుందా అని టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ కందుకూరు బహిరంగ సభలో మాట్లాడిన మాటలను ఆయన మాట్లాడిన విధానాన్ని తప్పుబట్టారు. 22 నెలల క్రితం రామాయపట్నం భూమిపూజకు వచ్చిన సందర్భంగా రాళ్లపాడు ఎడమ కాలువ పొడిగింపు, కందుకూరు పట్టణంలో ఉత్తర బైపాస్‌రోడ్డు నిర్మాణం, కరేడులో పీహెచ్‌సీ భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించిన జగన్ నేటికీ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. ఆ హామీలు ఏమయ్యాయో ప్రస్తావించకుండా రాబోయే కాలంలో కందుకూరుకి ఏమి చేస్తామో చెప్పకుండా ఆయన చంద్రబాబుపై విమర్శలు చేయడానికే పరిమితమై వెళ్లడం ప్రజలు అర్థంచేసుకుంటారన్నారు. పార్లమెంటు నియోజకవర్గాల డీ లిమిటేషన్‌లో కందుకూరును తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపేలా చర్యలు తీసుకుంటామని విజయసాయిరెడ్డి, బుర్రా మధుసూదన్‌యాదవ్‌లు చెప్పారని, మరి ఆ విషయాన్ని జగన్‌తో ప్రజలకు ఎందుకు చెప్పించలేకపోయారని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో ప్రకాశం జిల్లాలో కందుకూరును కలుపుతామని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటిస్తారని పేర్కొన్నారు.

### జగన్ బినామీ కంపెనీ కోసం బలవంతంగా భూసేకరణ

చేవూరు, రావూరు గ్రామాల పరిధిలో ఇండోసోల్ పరిశ్రమ కోసం 8వేల ఎకరాలు బలవంతంగా లాక్కుంటున్నారని, ఇది జగన్ బినామీ కంపెనీ అని నాగేశ్వరరావు విమర్శించారు. 8వేల ఎకరాలలో నిజంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే వేలాదిమంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయని, అయితే ఇండోసోల్ వల్ల 500 మందికి కూడా ఉద్యోగాలు రావని పేర్కొన్నారు. రైతుల భూములను కారుచౌకగా కొట్టేసేందుకే ఈ బలవంతపు భూసేకరణ చేస్తున్నారని విమర్శించారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు 2014లో ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయలేదని జగన్ విమర్శిస్తున్నాడని, ఆయన గత ఎన్నికల సమయంలో ఇచ్చిన మద్య నిషేధం, సీపీఎస్ రద్దు, అద్భుత రాజధాని నిర్మాణం, ప్రత్యేక హోదా సాధన, పోలవరం పూర్తి లాంటి హామీల పరిస్థితి ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. గత ఐదేళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేసి నిరుపేద యువతకు తీరని ద్రోహం చేశాడని విమర్శించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు మాదాల లక్ష్మీనరసింహ్మం, చిలకపాటి మధు, జి.మోషే, బండారు సోమరాజు, రమణయ్య, సుబ్బారెడ్డి, కూనం నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### ఆలోచించి మంచి నాయకుడిని ఎన్నుకోండి

ఈ ఐదేళ్ల కష్టాలు అనుభవించిన మీకు మంచి నాయకుడిని ఎన్నుకునే అవకాశం వచ్చిందని, ప్రతి ఒక్కరూ ఆలోచించి చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేసుకోవటమే లక్ష్యంగా ఓటు వేయాలని కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య కోరారు. పట్టణంలోని 5వ వార్డు బృందావనం, యువరాజ్ థియేటర్ ప్రాంతం, 3వ వార్డు ఉప్పుచెరువు, పాలిటెక్నిక్ కాలేజీ ప్రాంతాలలో సోమవారం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటూరి నాగేశ్వరరావు ప్రజల మనిషి అని, సేవా కార్యక్రమాలు భవిష్యత్తులోనూ కొనసాగుతాయని, ప్రతిఒక్కరు ఎమ్మెల్యేగా నాగేశ్వరరావును, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దాసరి ప్రమోద్, జంగాల రాఘవ, పాలేటి కోటేశ్వరరావు, గేరా నరేష్, సుదర్శి శ్యామ్, గేరా పవన్, పొనుగోటి రమేష్, ఎం వేణు, ఎం సుబ్బరాజు, బీ వెంకటేశ్వర్లు, గుర్రం మధు, షేక్ కరీముల్లా, వేముల ఫణీంద్ర, మనోజ్, రుద్రబోయిన పోతురాజు, ముచ్చు లక్ష్మీరాజ్యం, కల్లూరి శైలజ పాల్గొన్నారు.

### వైసీపీని వీడి టీడీపీలో చేరిక

**లింగసముద్రం :** మండలంలోని పెంట్రాల పంచాయతీ పరిధిలోని చీమలపెంటకు చెందిన వైసీపీ కార్యకర్తలు పలువురు టీడీపీలో చేరారు. సోమవారం వలేటివారిపాలెం మండలంలోని బడేవారిపాలెంలో ఇంటూరి నాగేశ్వరరావు స్వగృహంలో షేక్ ఖాజా, సిద్ధారపు శ్రీను, వంశీ, యోహాను, బండెల వినోద్, రవి, మోషే, జోసఫ్ తదితరుల కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.నాగేశ్వరరావు వీరికి టీడీపీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. తనను, ఎంపీ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు బొల్లినేని రమణయ్య, ముత్తులూరి సుధాకర్, సీహెచ్ దత్తాత్రేయ, మానికొండ బ్రహ్మయ్య, గంగినేని మధు పాల్గొన్నారు.

### టీడీపీలోకి యాదవులు

**ఉలవపాడు :** మండలంలోని తూర్పుమన్నేటికోటలో 10 యాదవ కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కందుకూరు నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు మన్నేటికోట పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామ టీడీపీ మాజీ అధ్యక్షుడు గొత్తుల వెంటకేశ్వర్లు(అబ్బాయి) ఆధ్వర్యంలో గతం ఎన్నికల్లో టీడీపీని వీడిన యాదవ కుటుంబాలు మళ్లీ అదే గూటికి చేరుకున్నారు. శంకర్‌నగర్ ఎస్టీ కాలనీ, పడమర, తూర్పు మన్నేటికోట, జీవీఆర్ ఎస్టీ కాలనీ, ఎస్సీ కాలనీల ప్రజలు ఇంటూరికి హారతులు పట్టారు. గ్రామ సర్పంచు పులివర్తి బసవయ్య నాయుడు, నాయకులు రాచగల్లు సుబ్బారావు, చిమ్మిరి వెంకటేశ్వర్లు, వీరగంధం నారాయణ, గొత్తుల బ్రహ్మయ్య, చిరంజీవి, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.


కందుకూరు : కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఇంటూరి సౌజన్య


లింగసముద్రం : టీడీపీలో చేరిన వారితో ఇంటూరి నాగేశ్వరరావు

# అరాచకాలు, దోపిడీ తప్ప అభివృద్ధి ఏది?


కావలి : మసీదులో ప్రార్థనలు చేస్తున్న క్రిష్ణారెడ్డి


అల్లూరు : రోడ్‌షోలో కావ్య క్రిష్ణారెడ్డి, తదితరులు

● కరప్షన్ పట్టణాన్ని కనక పట్టణంగా మారుస్తా : కావ్య

**కావలి, ఏప్రిల్ 29:** వైసీపీ ఐదేళ్ల పాలనలో కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి, అరాచకాలు, దోపిడీ తప్ప ఆయన చేసిన అభివృద్ధి శూన్యమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని 9, 10 వార్డులలో సోమవారం టీడీపీ, జనసేన, బీజేపీ నేతలతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కావలిలో ఏదైనా అభివృద్ధి జరిగిందంటే అది తెలుగుదేశం పార్టీలోనేనన్నారు. అభివృద్ధికి నిలువెత్తు నిదర్శనం తెలుగుదేశం పార్టీ అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఆదుకున్న పార్టీ టీడీపీయేనన్నారు. యువతకు ఉద్యోగాలు రావాలన్నా, రైతుల కష్టాలు తీరాలన్నా, భావితరాలకు భవిష్యత్తు రావాలన్నా, మహిళలకు అండగా నిలవాలన్నా ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు రావాలన్నారు. కావలిలో ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి అరాచకాలు, దోపిడీలు, దుర్మార్గాలకు అంతులేదన్నారు. ఇసుక, మట్టి, గ్రావెల్ దోపిడీ, రియల్‌ఎస్టేట్ దందా తప్ప కావలికి ఏమి చేయలేదన్నారు. రెండు పర్యాయాలుగా ఎలాంటి అభివృద్ధి చేయని ప్రతాప్‌రెడ్డికి మళ్లీ ఓటేస్తే కావలిని గంజాయి పట్టణంగా మారుస్తారన్నారు. తనకు ఒక్క అవకాశం ఇచ్చి టీడీపీని గెలిపిస్తే కరప్షన్ పట్టణంగా ఉన్న కావలిని కనక పట్టణంగా మారుస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ క్రిషోర్‌బాబు, జ్యోతి బాబూరావు, బీజేపీ నేతలు గుండ్లపల్లి భరత్ కుమార్, కుట్టుబోయిన బ్రహ్మానందం, అంచి పాకల కమల, సూనూరు మాధవి, జనసేన నేతలు పొబ్బా సాయివిఠల్, తోట శరణ్ టీడీపీ స్థానిక నాయకులు బిట్రగుంట శివప్రసాద్, ఆత్మకూరు నాగరాజు, మేడికొండ సుకుమార్, వల్లూరి వెంకట కిరణ్‌కుమార్, యల్లంటి వెంకటేశ్వర్లు, ఆసిఫ్, హఫీజ్, అల్‌హర్, మస్తాన్, తోట రమేష్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

### ● 20వ వార్డులో క్రిష్ణారెడ్డి తనయ ప్రచారం

పట్టణంలోని 20 వార్డులో సోమవారం టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి తనయ సంహితారెడ్డి నాన్నకు ఓట్లు వేసి గెలిపించాలని కోరుతూ ఇంటింట ప్రచారం చేపట్టారు. ఆమె వెంట మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, ఏఎంసీ మాజీ డైరెక్టర్ తిరువీధి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

### కోడి కత్తి డ్రామాలాగే గులకరాయి డ్రామా

**అల్లూరు :** కోడి కత్తి డ్రామాలాగే గులకరాయి డ్రామా ఆడిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రజలను నమ్మించలేక విఫలమయ్యాడని టీడీపీ కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి విమర్శించారు. మండలంలోని నార్త్ మోపూరు, గ్రద్దగుంట పంచాయతీల్లో నెల్లూరు నిరంజన్‌రెడ్డి, రేబాల శంకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డిలతో కలసి సోమవారం ఆయన రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఎన్నికల్లో కోడి కత్తి డ్రామా, ఈ ఎన్నికల్లో గులకరాయి డ్రామా ఆడి ప్రజల్లో వ్యతిరేకతను సంపదించుకన్నాడని ఎద్దేవా చేశారు. మాయమాటలు చెప్పి పథకాలు అంటూ మసిపూసి మారేడుకాయి చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ప్రజలు నమ్మేలా లేరన్నారు. పంచాయతీల్లో నిధులు మాయం చేసి తన స్వార్థ ప్రయోజనాలకు వినియోగించుకొని కళకళలాడాల్సిన పంచాయతీలు నేడు మోడుగా మిగిలాయన్నారు. దోచుకోవడం దాచుకోవడమే తప్ప నాయకులకు అభివృద్ధి చేయడం తెలియదన్నారు. అదేవిధంగా రాష్ట్రానికి నేటి పరిస్థితుల్లో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని ఆయన ఒక్కడే ఈ రాష్ట్రాన్ని దారిలో పెట్టగలడని, సూపర్ సిక్స్ పథకాలతో వైసీపీకి దిమ్మతిరిగి బొమ్మ కనపడుతుందన్నారు. మేనిఫెస్టోలో చూపిన పథకాలు కొత్తగా ఏమీ లేవని ఆయన ఉద్ఘాటించారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా పదవులు అనుభవించిన స్థానిక ఓ నాయకుడు అభివృద్ధిని మాత్రం పట్టించుకోలేదన్నారు. ఆయన తన స్వగ్రామానికి వస్తే ఈ రోడ్డు దుస్థితి ఆయనకు అర్థమవుతుందని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వస్తే పింఛన్ రూ.4 వేలకు పెంచి లబ్ధిదారులకు నేరుగా ఇంటికి వచ్చి పంపిణీ చేసేలా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారన్నారు. పదేళ్ల ఎమ్మెల్యేగా ఉన్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధిని బేఖాతరు చేసి నేడు తాగునీటికి కూడా ఇబ్బంది పడేలా చేశారన్నారు. పంటలు విరివిగా పండే డెల్టా ప్రాంతం అల్లూరు మండలంలో కూడా తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. కష్టాలు తీరి రాష్ట్రాభివృద్ధి జరగాలంటే కూటమి బలపరచిన కావలి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఓట్లు వేసి అత్యంత మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు విడవలూరు దశరథరామిరెడ్డి, మేడా మల్లారెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లు, దేవళ్ల హరిప్రసాద్‌రెడ్డి, బాలాజీ, డేగా సాయి, కొండా శ్రీనివాసులు రెడ్డి, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

### తాళ్లూరులో కావ్య సోదరుడి ఇంటింటి ప్రచారం

**బిట్రగుంట :** బోగోలు మండలం తాళ్లూరు పంచాయతీలో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటినాగేశ్వరావు ఆధ్వర్యంలో కావలి టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి దగుమాటి క్రిష్ణారెడ్డి సోదరుడు వేణుగో పాల్‌రెడ్డి సోమవారం ఇంటింటి ప్రచార నిర్వహించారు. చంద్రబాబునాయుడు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. బీజేపీ, జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థులు నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యేగా దగుమాటి క్రిష్ణారెడ్డిలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎల్.మాధవరావు, ఏ.శ్రీనివాసులు, పీ.సుబ్బారావు, టీ.మాల్యాద్రి, సీహెచ్.మాధవరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాలెంలో స్థానిక టీడీపీ నేతలు ఐ.తిరుపతిరెడ్డి, డీ.శ్రీధర్, ఎల్.కిషోర్, శివకోటయ్య, మాలకొండయ్య, చెన్నకేశవులు, మాల్యాద్రి, నాగేశ్వరావులు ఇంటింటి ప్రచార కార్యక్రమం చేపట్టారు.


కావలి : దుస్తులు ఇస్త్రీ చేస్తున్న క్రిష్ణారెడ్డి తనయ సంహితారెడ్డి

మున్సిపల్ ట్యాంకర్ల నీటి సరఫరాలో
## వైసీపీ నేతల పెత్తనం

● టీడీపీ సానుభూతిపరులకు అందని నీరు

● ప్రశ్నిస్తే బెదిరింపులు

● పరస్పరం పోలీసులకు ఫిర్యాదు

**కావలి రూరల్, ఏప్రిల్ 29:** కావలి పట్టణం ముసునూరులో అధికారపార్టీ నేతల పెత్తనంలతో టీడీపీ సానుభూతి పరులకు మున్సిపల్ ట్యాంకర్ల నుంచి నీరు అందలేదు. దీనిని ప్రశ్నిస్తే సోమవారం బెదిరింపులకు దిగారు. బాధితుల వివరాల మేరకు.. ముసునూరు వడ్డిపాలెంకు చెందిన టీడీపీ సానుభూతి పరుడు బెల్లంకొండ వెంకటేష్ ఇంటి వద్ద నీటి సరఫరా చేసేందుకు ట్రాక్టర్ రాగా టీడీపీ వారికి నీళ్లు పట్టవద్దని వెంకటేష్ ఇంటికి సమీపంలో ఉండే వైసీపీకి చెందిన వల్లెపు శ్రీను చెప్పారు. దీంతో వెంకటేష్ భార్య జ్యోతి నీళ్లు పట్టకపోతే కమిషనర్‌కు చెబుతామని ట్యాంకర్ ఫొటోలు తీసింది. దీంతో కోపోద్రిక్తులైన వల్లెపు శ్రీను కుటుంబ సభ్యులు మొత్తం జ్యోతిని తిడుతూ ఇంటి మీదకు వచ్చారు. ఈ క్రమంలో రెండు కుటుంబాల మధ్య పాత గొడవలు ఉండటంతో జ్యోతి భయంతో 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చెయ్యగా రూరల్ పోలీసులు వారి ఇంటికి వెళ్లి స్టేషన్‌కు పిలిపించారు. ఇరుకుటుంబాలు ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఏది ఏమైనప్పటికి నీటి సరఫరాలో కూడా పార్టీల పేరుతో వివక్ష చూపటం చర్చనీయాంశమైంది.

## అభివృద్ధి కోసమే టీడీపీలో చేరిక

● వేయి మోటారు సైకిళ్లతో చిరంజీవిరెడ్డి ర్యాలీ


టీడీపీలో చేరిన మెట్టుకూరి శిరీష

**కలిగిరి, ఏప్రిల్ 29:** గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో ఉదయగిరి నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి జరగపోవడంతో వైసీపీని వీడి తాను తెలుగుదేశం పార్టీలో చేరినట్లు రాష్ట్ర పోలీసు హౌసింగ్‌బోర్డు మాజీ ఛైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని 14వ మైలు నుంచి తన అనుచరగణంతో కలసి 1000 మోటారు సైకిళ్లపై ర్యాలీగా బయలుదేరిన ఆయన వింజమూరు, కలిగిరి మండలాల సరిహద్దులో ఉన్న బొమ్మరాజుచెరువులోని టీడీపీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధితో పాటు తనను నమ్ముకున్న కార్యకర్తలకు న్యాయం జరగాలనే ఉద్దేశంతోనే టీడీపీలో చేరానన్నారు. కాగా బొమ్మరాజుచెరువు పార్టీ కార్యాలయంలో నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి అభ్యర్థి కాకర్ల సురేష్ సమక్షంలో తన శ్రీమతి, కలిగిరి ఎంపీపీ మెట్టుకూరు శిరీష, తన తల్లి, అనంతపురం సర్పంచు మెట్టుకూరు పాపమ్మలతోపాటు పలువురు ఎంపీటీసీలు, సర్పంచులను టీడీపీలో చేర్పించారు.

### ఎస్సీ, ఎస్టీ మైనార్టీలను రక్షించుకోవాలి

**అల్లూరు, ఏప్రిల్ 29 :** రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలను పరిరక్షించుకోవలసిన అవసరం ఉందని రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా అంబేడ్కర్ కావలి నియోజకవర్గ అభ్యర్థి ఎల్లు సాల్మన్‌రాజు అన్నారు. అల్లూరు పట్టణ పరిధిలోని ఉడ్‌హౌస్‌పేట, రాయపేట ప్రాంతాల్లో సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోవూరు బాబు, ముసలి నరేంద్ర, కప్పల నవీన్ కుమార్, కాకాని వెంకయ్య, కాకాని రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీటిలో కలిసిన
## ఎమ్మెల్యే హామీ

● 9 ఏళ్లుగా ఆచరణకు నోచని

డ్రైనేజీ కాలువల నిర్మాణం


కొండబిట్రగుంటలో రోడ్డుపైన మురుగు

**బిట్రగుంట, ఏప్రిల్ 29:** కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి 9 ఏళ్ల క్రితం వెంకన్న సన్నిధిలో చెప్పిన రోడ్డు డ్రైనేజీ పనుల హామీ మురుగు నీటిలో కలసిపోయింది. బోగోలు మండలం కొండబిట్రగుంటలో వెలసి ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం, గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అందులో ప్రధానంగా కొండబిట్రగుంట నుంచి శ్రీవేంకటేశ్వరపాలెం రైల్వే గేట్ వరకు ఉన్న ప్రధాన రోడ్డుకు ఇరువైసుల డ్రైనేజ్ నిర్మాణం చేస్తామన్న హామీ తొమ్మిదేళ్లు దాటినా ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు. వేంకటేశ్వరా.. నన్ను గెలిపించయ్యా.. అంటూ మొక్కి రెండు సార్లు గెలిచి ఏమి అభివృద్ధి చేశావో స్వామి సన్నిధిలో చెప్పగలవా ఎమ్మెల్యే సారూ..!

### హామీ మరిచారా జగన్‌రెడ్డీ..?


కలిగిరి సమీపంలో ఉన్న కాటన్‌యార్డ్

**కలిగిరి, ఏప్రిల్ 29:** కలిగిరి పంచాయతీ పరిధిలోని జిర్రావారిపాలెం వద్ద ఉన్న కాటన్‌యార్డ్ వాడుకలో లేదు. ఈ క్రమంలో సీఎం జగన్ కలిగిరి మండలంలో పాదయాత్ర చేసిన సమయంలో కాటన్‌యార్డును శీతల గిడ్డంగిగా మార్చి స్థానిక రైతులకు ఉపయోగపడే విధంగా చేస్తామని హామీ ఇచ్చారు. ఐదేళ్లు గడిచిపోయినా శీతలగిడ్డంగుల నిర్మాణం మాత్రం కార్యరూపం దాల్చలేదు. దీంతో హామీ మరిచారా జగన్‌రెడ్డీ.. అంటూ స్థానిక రైతులు కోల్డ్‌స్టోరేజ్‌ల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

## బైకులకు భలే గిరాకీ !

అవునండీ.. ఇది నిజం ! ఈ సారి ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు బైక్‌లతో రోడ్‌షోలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అందుకే బైకులకు యమా గిరాకీ. గ్రామాల్లో యువకులు తమ బైకులతోపాటు తెలిసిన వాళ్ల బైకులను రోడ్‌షోలకు తీసుకు వస్తున్నారు. మెడలో కండువా వేయించుకొని, బైక్‌కి జెండా కట్టేస్తే సరి...? బైక్‌కి రూ.200 పెట్రోల్ కొట్టించడం, మరో రూ.300 చేతికి ఇస్తుండటంతో రూ.500 గిట్టుబాటు అవుతున్నట్లు వారు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా ఈ సారి ఎన్నికల్లో బైక్‌లకు గిరాకీ పెరగడం విశేషంగా పేర్కొంటున్నారు.





- కలిగిరి

## వీధుల్లో మైకులు.. ఇళ్లలో సెల్‌ఫోన్లు !

- అభ్యర్థుల ప్రచార హోరు
- సగటు ఓటర్ల విసుగు

ఈ ఎన్నికల్లో నాయకులు గతానికి భిన్నంగా ప్రచారం చేస్తున్నారు. వీధుల్లో మైకులతో హోరెత్తిస్తుండగా, ఇళ్లల్లో సెల్‌ఫోన్‌లకు అభ్యర్థుల ఫోన్ చేస్తున్నారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడం, స్మార్ట్ ఫోన్‌లు ప్రతి ఇంటా ఉండడంతో అభ్యర్థులు వాట్సాప్ ద్వారా ప్రతిఅంశం షేర్ చేస్తున్నారు. తమకు ఓటు వేస్తే చేయబోయే అంశాలను ఐవీఆర్ ద్వారా చెప్తున్నారు. వారం రోజులుగా ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల తరుపున ఆయా పార్టీల మద్దతుదారులు పార్టీ కార్యాలయాల ప్రతినిధులు ఫోన్ చేసి వచ్చేనెల 13న జరిగే పోలింగ్‌లో తమ అభ్యర్థికి ఓటు వేయాలని పదేపదే కోరుతున్నారు. దీనివల్ల ఫోన్‌రింగ్ అవుతున్న సమయంలో లిఫ్ట్ చేసేందుకు చాలామంది ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు. గుర్తుతెలియని నెంబర్ల నుంచి ఫోన్ వస్తే లిఫ్ట్ చేయడానికి ఇష్టపడడంలేదు. బంధువులు, స్నేహితులు పనులపై చేసే సమయంలో కూడా ఈ నెంబరు ఎవరిదోనని తికమక పడుతున్నారు. ప్రశాంతత కోరుకునే గ్రామీణులు ఎక్కువగా సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంటారు. కొద్దిరోజులుగా అనేకసార్లు ఫోన్లు వస్తుండడంతో విసుగుచెందుతున్నారు.




ఎన్నికల ప్రచారాలతో విసిగిపోతున్న జనం

- ఉదయగిరి

## బయట ఊర్లలో మనవాళ్లెవరు ?

- ఓటరు జాబితా తిరగేస్తున్న నేతలు

బయట ఊర్లలో నివాసముంటున్న మన ఊరి ఓటర్లు ఎవరు... అందులో మన వర్గం ఎవరు.. వాళ్లకు ఖర్చు పెట్టి తీసుకువచ్చినా మన పార్టీకే ఓట్లేసే వాళ్లు ఎంత మంది.. ?అని అంటూ బూత్ స్థాయి నాయకులు ఓటర్ల జాబితాను జల్లెడ పడుతున్నారు. సార్వత్రిక ఎన్నికల సమరంలో ప్రధాన పార్టీల మధ్య పోటీ తీవ్రత పెరిగింది. దీంతో ప్రతీ ఓటు కీలకంగా మారింది. ఈ క్రమంలో ఇక్కడ ఓట్లుండి బయట ఊర్లలో నివాసాలుంటున్న వారి వివరాలను రాజకీయ పార్టీల నాయకులు అన్వేషిస్తున్నారు. ఓటర్ల జాబితాలను దగ్గరపెట్టుకుని కొందరు ఆరా తీస్తుండగా, వలంటీర్ల సహాయంలో మరికొందరు నాయకులు బయట ఓట్ల కోసం పాకులాడుతున్నారు. బయట ఊర్లలో ఉన్న ఇక్కడ ఓటర్లకు ప్రయాణ ఖర్చులన్నీటిని భరించి వారిని మే 13వ తేదీనాటికి తీసుకువచ్చేందుకు అన్నీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే రైళ్లు, బస్సుల్లో రిజర్వేషన్లు పూర్తవగా, అందులో అవకాశం లేనివారిని కార్లలో తీసుకు వచ్చేందుకు కూడా ప్రయత్నాలు చేస్తున్నారు.



- నెల్లూరురూరల్



అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం మొండివైఖరే అవలంభిస్తోంది. సమ్మె విరమణ సందర్భంగా వారితో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. ఎన్నికలకు ముందు చేసుకున్న ఒప్పందాలను అమలు చేయడంలో ఉద్యోగులతో చెడుగుడు లాడుకుంటోంది. సమ్మె కాలానికి ఇస్తామన్న వేతనాలు నేటికీ అంగన్‌వాడీలకు అందలేదు. అదిగో., ఇదిగో ఇస్తామన్న ప్రభుత్వం ఆ సంగతినే విస్మరించింది. కాగా జూన్ తర్వాత ఏర్పడే ప్రభుత్వంపైనే అంగన్‌వాడీలు ఆశలు పెట్టుకుంటున్నారు.

- నెల్లూరు (వైద్యం)

- సమ్మె కాలానికి వేతనం ఏదీ... ?
- 11 ఒప్పందాల్లో ఐదు మాత్రమే అమలు
- మా ఆవేదన అర్థం చేసుకోవా జగనన్నా... : అంగన్‌వాడీలు






# ఇచ్చినమాట ఏమైందన్నా...?

అంగన్‌వాడీల సమ్మె ఓ చారిత్రాత్మకం. ఏకంగా 42 రోజులపాటు అంగన్‌వాడీలు తమ కేంద్రాలను మూసివేసి సమ్మెబాట పట్టారు. ఎట్టకేలకు దిగివచ్చిన వైసీపీ ప్రభుత్వం అంగన్‌వాడీలతో పలు ఒప్పందాలు చేసుకుని, వాటిని అమలు చేస్తామని హామీ ఇచ్చింది. సమ్మె కాలానికి కూడా వేతనాలు ఇస్తామని అంగీకరించింది. ఇది జరిగి మూడు నెలలు దాటింది. అయితే ఇంతవరకు వేతనాలు మాత్రం అందలేదు. ఫైనాన్స్ క్లియరెన్స్ పూర్తి అయినా సీఎం జగన్మోహన్‌రెడ్డి వద్దే అంగన్‌వాడీల వేతనాల నివేదిక ఉన్నా నేటికి అవి పరిష్కారం కాలేదు. జిల్లాలో అంగన్‌వాడీలు మాత్రం సమ్మె కాలానికి వేతనాల కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. జిల్లాలో 2,934 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి వీటిల్లో 5,639 మంది అంగన్‌వాడీలు, హెల్పర్లు పనిచేస్తున్నారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ. 11,500 వేతనాలు ఇస్తుండగా హెల్పర్లకు రూ. 7వేలు ఇస్తున్నారు. డిసెంబర్ 14న అంగన్‌వాడీలు సమ్మె చేపట్టగా జనవరి 24వ తేదీ వరకు కొనసాగింది.

### ఒప్పందాలు అమలు జరిగేనా?

సమ్మె సందర్భంగా 11 డిమాండ్‌లను అంగన్‌వాడీలు ప్రభుత్వం ముందు ఉంచారు. వాటన్నిటి అమలు చేస్తామని ప్రభుత్వం వారితో ఒక అంగీకారానికి వచ్చింది. అయితే ప్రస్తుతం ఐదు డిమాండ్‌లు మాత్రమే అమలు అవుతున్నాయి, మిగిలిన వాటిని త్వరలో అమలు చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. అయితే నేటికీ అవి అమలు కాలేదు. అంగన్‌వాడీ వేతనాల పెంపునకు యూనియన్లకు హామీ ఇచ్చారు. అయితే జూలై నుంచి వేతనాలు పెరుగుతాయని మెలిక పెట్టింది. గ్రేడ్ - 2 సూపర్‌వైజర్ పోస్టులకు పరీక్ష రాసి పెండింగ్‌లో ఉన్న 164 గ్రేడ్ - 2కు ఏప్రిల్ నాటికి పూర్తి చేస్తామని హామీ ఇచ్చింది. ఎన్నికల కోడ్ రావటంతో ఈ ప్రతిపాదన ఆగిపోయింది. నాలుగు యాప్‌లు కలిపి ఒకే యాప్‌గా రూపొందిస్తామని ప్రభుత్వం వెల్లడించింది. అదీ కూడా అమలు కాలేదు. వేతనాలతో కూడిన మెడికల్ లీవ్, పోషణ మెనూ చార్జీల పెంపు, గ్యాస్ తదితర సమస్యలకు కమిటీ వేయిస్తామని హామీ ఇచ్చింది. ఇవి ఎప్పటికి పూర్తవుతాయో తెలియదు. మినీ అంగన్ వాడీలను మెయిన్ సెంటర్‌లుగా చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. అయితే నేటికీ అమలులోకి రాలేదు.

**వేతన బకాయిలు ఇంకా ఇవ్వలేదు**

సమ్మెకాలానికి వేతనాలు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇప్పట్లో అవి వస్తాయన్న నమ్మకం లేదు. ప్రస్తుతం ఎన్నికలు ఉండటంతో ప్రభుత్వం అధికారులు వేతన బకాయిలు చెల్లించే అవకాశం ఉన్నా ఆదిశగా కృషి చేయటం లేదు. వచ్చే ప్రభుత్వమైనా వేతనాలు చెల్లిస్తుందని ఆశిస్తున్నాం.

- సుజాత, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

# నాడు మునెమ్మ.. నేడు ప్రశాంతి

- కోవూరు పోరులో రెండో మహిళగా పోటీ
- నియోజకవర్గంలో నారీమణుల ఓట్లే ఎక్కువ

**మము రాణిస్తాం**

కోవూరు నియోజకవర్గంలో ఎప్పటి నుంచో మహిళాశక్తి రాజకీయాలను ప్రభావితం చేస్తోంది. మహిళా ఓటర్లే అధికంగా ఉన్న నియోజకవర్గ మిది. మహిళలే రాజకీయాల్ని శాసించే సెగ్మెంట్ కోవూరు. 2,61,125 మంది ఓటర్లలో 1,34, 835 మంది మహిళా ఓటర్లు ఉండటం విశేషం. పురుషుల కంటే మహిళా ఓటర్లే 8,565 ఎక్కువమంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 1951 నుంచి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధానపక్షాలు మహిళలకు అవకాశం కల్పించడం లో విఫలమయ్యాయి. బెజవాడ గోపాలరెడ్డి ఆంధ్రరాష్ట్ర ముఖ్య మంత్రిగా ఉన్న సమయంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో వవ్వేరు పంచాయతీని మహిళలే స్వాధీనం చేసుకోవడం అప్పట్లో సంచలన మైంది. కోవూరు మండల పరిధిలోని లేగుంటపా డులో పొదుపు ఉద్యమానికి శ్రీకారం చుట్టిన మహిళలు దేశవ్యాప్త ఖ్యాతిని ఆర్జించారు. సారానిషేధం, అక్షరాస్యతా ఉద్యమాల్లో కోవూరు ఖ్యాతిని ఎలుగెత్తి చాటిన మహిళలు స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచా టుతూనే ఉన్నారు.టీడీపీ అభ్యర్థిగా బుచ్చికి చెందిన ఉక్కాల రాజేశ్వర మ్మ 1999లో జరిగిన ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా గెలుపొందారు. విడవలూరు మండలం చౌకచర్లకు చెందిన నాగభూష ణమ్మ ఎన్టీఆర్ ప్రభుత్వ హయాం లో జడ్పీ ఛైర్‌పర్సన్‌గా గెలుపొందారు. అన్నిరంగాల్లో సత్తా చాటుతున్న నియోజకవర్గ మహిళలు అసెంబ్లీ ఎన్నికలకు మాత్రం దూరంగా ఉండిపో యారు. కాగా 2009లో జరిగిన త్రిముఖ పోటీలో ప్రజారా జ్యం పార్టీ తరఫున గిరిజన సామాజికవర్గానికి చెందిన తుపాకుల మునెమ్మను ఆ పార్టీ అధ్యక్షుడు చిరంజీవి పోటీకి నిలిపారు. ఆమె పోటీ అప్పట్లో సంచలనం రేపింది. ఓ గిరిజన మహిళ ప్రధాన పార్టీల అభ్యర్థులను ఢీకొని సత్తాచాటారు. కాగా ఈసారి ఎన్నికల్లో టీడీపీ తరఫున నెల్లూరు పార్లమెంట్ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి వేమి రెడ్డి ప్రభాకరరెడ్డి సతీమణి ప్రశాంతిరెడ్డిని టీడీపీ తరపున పోటీకి నిలిపారు. ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలతో హడావిడిగా ఉండే ఆమె, సుదీర్ఘ కాలం ఎమ్మెల్యేగా పనిచేసిన నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని ఢీకొంటున్నారు. మహిళలంతా సర్వశక్తులు ఒడ్డి ఆమె విజయానికి పాటుపడుతున్నారు.



తుపాకుల మునెమ్మ



వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

- కోవూరు

## రాజకీయ సభల్లో అల్లరి నేరమే !

- కరపత్రాలకు అనుమతి అవసరం
- వేసిన ఓటు రహస్యమే..

**రూల్స్ గుర్తున్నాయా..?**

ఏదైనా రాజకీయ పార్టీ నిర్వహించే సభలో ఆ పార్టీకి సంబంధంలేని వ్యక్తి అల్లరి చేస్తే ఈసీ నిబంధనల మేరకు నేరమే అవుతుంది. అభ్యర్థులు ప్రచారానికి గ్రామాలకు వెళ్లినప్పుడు సమావేశాలను అడ్డుకోవడం, భంగపరచడానికి ప్రయత్నించడం కూడా అపరాధమే అవుతుంది. ఇలాంటి నేరాలకు పాల్పడిన వ్యక్తికి ఆరు నెలల జైలుశిక్ష , రూ. 2 వేల జరిమానా విధించే అవకాశం ఉంది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి పూర్తయ్యేవరకు ఈ నిబంధనలు అమలులో ఉంటాయి. సభకు అధ్యక్షత వహించే నాయకుడు అనుమానం వచ్చిన వ్యక్తిని గురించి వివరాలను రాబట్టుకోవచ్చు. పోలీసులకు కూ డా ఆ వ్యక్తి వివరాలను చెప్పకపోతే అతడ్ని వారంట్ లేకుండా నిర్బంధంలోకి తీసుకునే వీలుంది. అలాగే ప్రచారానికి సంబంధించిన కరపత్రాలపై ప్రచురణకర్త చిరునా మా తప్పనిసరిగా ఉండాలి. చిరునా మా లేకుండా కరపత్రం, పోస్టర్ ము ద్రించి ప్రచారం చేస్తే ఆరు నెలల జైలుశిక్ష, రెండువేల రూపాయల జరిమానా విధించే అవకాశం ఉంది.

- **వేసిన ఓటు రహస్యమే..**

ఓటరు వేసిన ఓటును ఎన్నికల అధికారులు రహస్యంగా ఉంచాలి. ఓటు రహస్య స్వభావాన్ని పరిపూర్ణంగా పరిరక్షించకపోతే మూడు నెలల జైలుశిక్ష, జరిమానా విధించవచ్చని ఈసీ నియమావళిలో పొందుపరచింది. ఏ వ్యక్తి ఓటరునూ కూడా ప్రభావితం చేసేలా ఎన్నికల అధికారులు, పోలీసులు ప్రవర్తించరాదు. ఎవరికైనా ఓటు వేయమని చెప్పినట్లు రుజువైతే ఆరు నెలల జైలుశిక్ష తప్పదు.

- సంగం

## ఉప్పు రైతులకు ఉపకారమేది ?

- హామీలకే పరిమితమైన వసతుల కల్పన
- పట్టించుకోని పాలకులు

అల్లూరు, ఏప్రిల్ 29: ఉప్పు రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువయింది. రోజురోజుకీ తగ్గుతున్న ధరలతో ఉప్పు రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. ఇక్కడి ఉప్పును ఏళ్లతరబడి ఇతర రాష్ట్రాలకు తరలిస్తుంటారు. అయినా ధరలు ఆశాజనకంగా లేవు. రెండేళ్ల క్రితం క్వింటా ఉప్పు ధర రూ.500 వరకు పలికింది. గత ఏడాది ఆ ధర రూ.250కి పడిపోయింది. ఈ ఏడాది రూ.150కి పడిపోవడంతో రైతుల ఆశలు ఆవిరయ్యాయి. ఇంత జరుగుతున్నా ఉప్పు రైతులకు ఏనాడూ ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందలేదు. వీరికి ఎటువంటి రాయితీలు ఇవ్వలేదు. ధరల నియంత్రణచర్యలను ప్రభుత్వం చేపట్టలేదు.

- **ప్రోత్సాహమేది ?**

మిగతా రైతులకు ఇస్తున్న ప్రోత్సాహం ఉప్పు రైతులకు ఇవ్వడం లేదు. రాయితీతో బోర్ల ఏర్పాటు, మోటార్ల పంపిణీ, విద్యుత్ చార్జీల ధరల తగ్గింపు లాంటి చర్యలు లేవు. ఉప్పు తింటారు కానీ వీరి గురించి ఎవరూ పట్టించుకోరు. గతేడాది భారీ వర్షాలకు వరద తీవ్రతతో కయ్యల్లోనూ, రోడ్డు మార్జిన్లలోనూ ఉన్న ఉప్పు కువ్వలు కరిగిపోయాయి. రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసుకున్న బోర్లు, విద్యుత్ మోటార్లు ధ్వంసమయ్యాయి. అయితే పాలకులు కానీ, అధికారులు కానీ వీరివైపు కన్నెత్తి కూడా చూసిన దాఖలాలు లేవు.

- **హామీల్లోనే వసతులు**

స్థానిక ఎంపీ ఉప్పు నిల్వల కోసం ప్లాట్ ఫామ్‌లు ఏర్పాటు చేస్తామని, రోడ్డు నిర్మాణం చేపడతామని హామీలు ఇచ్చారు. కానీ ఆ హామీలు నేటికీ అమలు కాలేదు. గత వర్షాకాలంలో నష్టపోయిన రైతులకు తిరిగి అదే హామీ ఇచ్చారు. కానీ నెరవేరలేదు. ఉప్పు రైతులకు విద్యుత్ బిల్లుల ఇటీవల పెనుభార మయ్యాయి. బిల్లుల్లో రాయితీ ఇవ్వాలని వారు కోరుతున్నారు.



ప్లాట్‌ఫాం లేక రోడ్డు మార్జిన్‌లో ఉన్న ఉప్పు కువ్వలు

**ఎవరూ పట్టించుకోవడం లేదు..**



ఉప్పు రైతులను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో హామీలు ఇస్తారు కానీ, అధికారంలోకి వచ్చాక మరిచిపోతున్నారు. ఎవరైనా రాకపోతారా.. మమ్మల్ని పట్టించుకోకపోతారా ? అని ఎదురు చూస్తున్నాం.

- పురిణి ఏడుకొండలు, ఉప్పు రైతు, తూర్పుగోగులపల్లి

**రాయితీలు కల్పించాలి...**

అందరూ రైతుల మాదిరిగానే ఉప్పు రైతులకు కూడా రాయితీలు కల్పించాలి. మోటార్లు, విద్యుత్ వైర్లు, బోర్లపై రాయితీలు ఇవ్వాలి. ఉప్పు నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వం ప్లాట్‌ఫామ్‌లు ఏర్పాటు చేయాలి.

- గోళ్ల ఆదాం, ఉప్పురైతు, తూర్పుగోగులపల్లి

## ఓటేయడానికి కావాల్సిన గుర్తింపు కార్డులివే..!

పోలింగ్ రోజున ప్రతి ఓటరూ పోలింగ్‌స్టేషన్‌కు విధిగా వ్యక్తిగత గుర్తింపు కార్డును తీసుకెళ్లాలి. లేని పక్షంలో ఎన్నికల అధికారులు ఓటును తిరస్కరించే అవకాశం ఉంది. ఓటరు తమకు నచ్చిన లేదా తమ వద్ద అందుబాటులో ఉన్న గుర్తింపు కార్డు తీసుకెళ్తే కుదరదు. ఓటరు ఎలాంటి గుర్తింపు కార్డును తీసుకెళ్లాలో ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈ 13 రకాల కార్డులను మాత్రమే అధికారులు పరిగణలోకి తీసుకుంటారు. ఓటరు ఫొటో గుర్తింపు కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు, సర్వీసు గుర్తింపు కార్డు (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పీఎస్‌యూలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు తమ ఉద్యోగులకు జారీ చేసినవి), పాస్‌బుక్ (ఫొటోతో పాటు బ్యాంక్, పోస్టాఫీసులో జారీ చేసినవి), పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, స్మార్ట్‌కార్డు (కార్మిక శాఖ మంత్రిత్వశాఖ పథకం కింద జారీ చేసి నవి), ఎంఎన్ఆర్ఈజీఎస్ జాబ్‌కార్డు, ఆరోగ్య బీమా స్మార్ట్‌కార్డు (కార్మిక మంత్రిత్వ శాఖ పథకం కింద జారీ చేసినది), ఫొటో పిం ఛన్ పత్రం, అధికారిక గుర్తింపు కార్డు (ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జారీ చేసిన ), ఎన్‌పీఆర్ కింద ఆర్జీఐ జారీ చేసిన స్మార్ట్‌కార్డు తీసుకెళ్లాలి. వీటిని మాత్రమే అధికారులు గుర్తించి, ఓటు వేసే అవకాశం కల్పిస్తారు.

- వలేటివారిపాలెం




## 'కోడ్' బేఖాతర్..

# వైసీపీ బరితెగింపు

- ఉలవపాడులో గుంటూరు, విజయవాడ యువకులు
- ఇంటింటా స్టిక్కర్ల అతికిస్తున్నవైనం
- టీడీపీ ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



వైసీపీ స్టిక్కర్లు అంతికించేందుకు విజయవాడ, గుంటూరు జిల్లాల నుంచి ఉలవపాడుకు వచ్చిన యువకులు

**ఉలవపాడు** : కోడ్ అమలులో ఉన్నా అధికార పార్టీ నేతలు బేఖాతరు చేస్తూనే ఉన్నారు. విజయవాడ, గుంటూరు జిల్లాల నుంచి వచ్చిన కొంతమంది సోమవారం నెల్లూరు జిల్లాలోని ఉలవపాడులో నెల్లూరు ఎంపీ వైసీపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్, సీఎం జగన్, ఫ్యాన్ గుర్తు ఉన్న స్టిక్కర్లను ఇళ్ల గోడలపై అతికించారు. 20 మంది యువకులు బృందాలుగా ఏర్పడి బ్యాగ్‌ల నిండా కరపత్రాలు, స్టిక్కర్లు వేసుకొని తమ పని కానిచ్చేస్తున్నారు. పంచాయతీ కార్యాలయానికి ఆనుకొని కోనేరు సెంటర్‌లో ఉన్న ఇళ్లకు వారు స్టిక్కర్లు అతికిస్తుండగా టీడీపీ నేతలు కనుగొన్నారు. దీంతో వాళ్లను నిలదీయగా తాము విజయవాడ నుంచి వచ్చామని, ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి స్టిక్కర్లు అతికించేందుకు తమను తీసుకొచ్చినట్లు చెప్పారు. దీంతో టీడీపీ నేతలు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. విషయం జఠిలం కావడంతో అధికారులు వచ్చే సరికి అక్కడ నుంచి ఆ యువకులంతా పలాయనం చిత్తగించారు. పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలు, సిబ్బంది గ్రామంలో గాలించగా ఒక బృందం వారి కంటపడంది. దీంతో ఎంపీడీవో విజయ దగ్గర హాజరు పరిచారు. వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, ఈ యువకులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా సగర్వంగా సాగనంపడంపై టీడీపీ శ్రేణులు భగ్గుమంటున్నాయి. దీనిపై ఎన్నికల అధికారి అయిన ఎంపీడీవోను వివరణ కోరగా మండలంలోని వీరేపల్లి, మన్నేటికోట, చాకిచర్ల, ఉలవపాడు గ్రామాల్లో ఇంటింటా వైసీపీ ప్రచారం కోసం వారు అనుమతి పొందినట్లు తెలిపారు. కరపత్రాలు పంపిణీకి మాత్రమే అనుమతి ఉన్నప్పుడు స్టిక్కర్లు ఎలా అతికిస్తారని ప్రశ్నించగా, 41ఏ నోటీసులు అందజేస్తామని తెలిపారు.

- **కందుకూరు** : కందుకూరులో కొంతమంది ఇంటింటికీ వైసీపీ స్టిక్కర్లు అతికించడం కలకలం రేపింది. పట్టణంలోని అనేక ప్రాంతాలతో పాటు గత ప్రభుత్వం నిర్మించిన జీ ప్లస్ త్రీ గృహాల సముదాయంలోను గడపగడపకు ఈ స్టిక్కర్లు అంటిస్తూ చిన్నపిల్లలు కనిపించారు.

## ఎన్నికల ఖర్చు పెరిగిందిలా...!

**ఎలాగంటే..**

పోటీలో ఉన్న అభ్యర్థులు తమ గెలుపు కోసం ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అదనంగా నగదు ఖర్చు చేయకుండా ఎన్నికల సంఘం పరిమితులు విధించింది. ఒక అభ్యర్థికి గతంలో వ్యయ పరిమితి రూ.లక్ష ఉండగా, నేడు రూ.40 లక్షల వరకు పెరిగింది. వ్యయ పరిమితులను పరిశీలిస్తే... 1957లో రూ.2 లక్షలు, 1962లో రూ.3 లక్షలు, 1971లో రూ.4 లక్షలు, 1975, 1977లలో రూ.5 లక్షలుగా ఉండేది. 1984లో ఖర్చు పెంచి రూ.10 లక్షలు చేసింది. 1988లో రూ.10 లక్షలు, 1991లో రూ.12 లక్షలు, 1994లో రూ.12 లక్షలు, 1999లో రూ.15 లక్షలు, 2004లో రూ.17 లక్షలు, 2009లో రూ.9 లక్షల పెంచి ఏకంగా రూ.26 లక్షలు చేసింది. 2014, 2018ల్లో రూ.28 లక్షలుండగా 2024 ఎన్నికల్లో మరో రూ.12 లక్షలు పెంచి రూ.40 లక్షలుగా ఈసీ నిర్ణయించింది.



- ఉదయగిరి